Prajalakshyam Telugu Daily
ప్రజాలక్ష్యం
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి

సంపుటి: 16 | సంచిక: 285 | కరీంనగర్ | బుధవారం 4 మార్చి 2026 | పేజీలు: 12 | వెల: 2.00

## మూడు వారాల్లోగా ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎన్నిక

**- రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశాలు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,మార్చి 3 : ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎన్నికపై హైకోర్టు తుది తీర్పు ఇచ్చింది. మూడు వారాల్లోగా ఎన్నిక పక్రియను పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి మంగళవారం తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కౌన్సిలర్లు ఎలాంటి ఒత్తిడికి లోనవకుండా తమ మద్దతు తెలియజేసేలా చర్యలు తీసుకోవాలని వెల్లడించింది. మున్సిపల్ చైర్మన్ ఎన్నిక జరగాల్సిన సమయంలో

11లో

## తెలంగాణ హైకోర్టుకు బాంబు బెదిరింపు

**- వారంలో ఇది రెండోసారి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద, మార్చి 3 : తెలంగాణ హైకోర్టుకు మరోసారి బాంబు బెదిరింపు రావడంతో తీవ్ర కలకలం రేగింది. ప్రోటోకాల్ రిజిస్ట్రార్ కార్యాలయానికి గుర్తు తెలియని వ్యక్తులు ఈ-మెయిల్ పంపినట్లు తెలుస్తోంది. వెంటనే అప్రమత్తమైన సీఐఎస్ఎఫ్ అధికారులు భద్రతను కట్టుదిట్టం చేశారు. కోర్టు పరిసరాలను ఖాళీ చేయించి తనిఖీలు ప్రారంభించారు. బాంబు స్క్వాడ్, క్లూస్ టీమ్‌లు రంగంలోకి

11లో

### ఖజానా ఖాళీ పేరుతో

# హామీలకు ఎగనామం



**- తెలంగాణలో అప్పు చేయకుండా పూటగడవని స్థితి**
**- ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలి**
**- సిఎం రేవంత్‌కు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,మార్చి 3 : అప్పు చేయకుండా పూటగడవని స్థితిలో తెలంగాణ ప్రభుత్వం ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఇప్పుడు రాష్ట్ర ఖజానాలో డబ్బు లేదంటూ హామీల అమలుకు తప్పించుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ ఆర్థిక పరిస్థితికి సంబంధించి శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని కేంద్రమంత్రి లేఖలో తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ రాశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలతో పాటు 420 హామీలను ప్రజలు నమ్మి అధికారం కట్టబెట్టారని తెలిపారు. ఖజానా ఖాళీ అన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... ఇటీవల ఓ సభలో కాంగ్రెస్ పార్టీకి అవసరమైతే రూ.1,000 కోట్లు ఇవ్వడానికి సిద్ధమని చెప్పారని గుర్తుచేశారు. దీన్ని బట్టి చూస్తే.. 'రాష్ట్ర ఖజానా నిల్.. పార్టీ నాయకుల జేబులు ఫుల్'గా ఉన్నాయని వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వం 2014 నుంచి తెలంగాణ అభివృద్ధికి దాదాపు రూ.12 లక్షల కోట్లు మేర నిధులు కేటాయించిందని కేంద్రమంత్రి

11లో

# మూసీ ఒడ్డున భారీ అక్రమ నిర్మాణం

**- నార్సింగ్‌లో నిర్మాణంలో ఉన్న వెంచర్ వద్ద ధర్నా**
**- కవిత ధర్నాను అడ్డుకున్న పోలీసులు**
**- హైడ్రాకు అక్రమాలు కనిపించడం లేదా అని ప్రశ్న**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మార్చి 3 : హైడ్రాకు రియల్ ఎస్టేట్ వ్యాపారుల అక్రమ వెంచర్లు కనిపించడం లేదా అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రశ్నించారు. నార్సింగిలోని ఓ వెంచర్ వద్ద స్థానికులతో కలిసి ఆమె ధర్నా చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఆమెను అదుపులోకి తీసుకొని పోలీసు వాహనాల్లో తరలిస్తుండగా.. జాగృతి కార్యకర్తలు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, జాగృతి కార్యకర్తల మధ్య తోపులాట చోటు చేసుకుంది. అంతకుముందు మూసి నది పక్కన నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌పై కవిత ఆరోపణలు చేశారు. మధ్యాహ్నం నుంచి ఆ వెంచర్ వద్దే బైఠాయించారు. సాయంత్రం సెల్‌ఫోన్ లైట్ల వెలుతురులోనే ధర్నా కొనసాగించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ వచ్చే వరకు కదిలేది లేదని స్పష్టం చేశారు. మూసీని ఆనుకుని భారీ రియల్ ఎస్టేట్ వెంచర్ ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.



పేదల ఇళ్లు కూలుస్తూ రియల్ ఎస్టేట్ వెంచర్లను వదిలేస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ నార్సింగి పరిధిలోని మూసీ నదిని ఆక్రమించి శ్రీ ఆదిత్య లగ్జరీ అపార్ట్‌మెంట్స్ నిర్మిస్తున్నారని కవిత

11లో

### ఇరాన్ అధినేతను హత్య చేసినా

# నోరు మెదపరా

**- ఇదెక్కడి విదేశాంగ విధానమో మోడీ చెప్పాలి**
**- ఇరాన్‌పై దాడి గురించి మోడీకి ముందే తెలుసా**
**- కూటమి నేతలు కూడా ఖండించక పోవడం దారుణం**
**- మీడియా సమావేశంలో బివి రాఘవులు, శ్రీనివాసరావు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

విజయవాడ, మార్చి 3 : ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ దాడి కేవలం ఇరాన్ కే పరిమితం కాకుండా ప్రపంచాన్ని తీవ్ర ఇబ్బందికి గురిచేసే స్థాయికి చేరుకుంటుందని సిపిఐ(యం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావులు అన్నారు. ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ దాడిని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. విజయవాడలో సిపిఎం ఆధ్వర్యంలో

11లో



### ఇరాన్‌పై దాడి పట్ల

# మౌనమెందుకు

**- మోడీ తీరుతో దిగజారుతున్న భారత్ ప్రతిష్ట**
**- మోడీ తీరుపై మండిపడ్డ రాహుల్ గాంధీ**

(ప్రజాలక్ష్యం బ్యూరో)

న్యూఢిల్లీ, మార్చి 3 : అమెరికా-ఇజ్రాయిల్-ఇరాన్‌ల వివాదంపై ప్రధాని మోడీ మౌనం ప్రపంచంలో భారత్ ఖ్యాతిని దిగజారుస్తోందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మంగళవారం పేర్కొన్నారు. ప్రపంచక్రమాన్ని నిర్వచించడానికి ఒక మార్గంగా దేశాధినేత హత్యకు మద్దతు ఇస్తున్నారా లేదా అనే దానిపై ప్రధాని మోడీ మాట్లాడాలని, సమాధానం చెప్పాలని అన్నారు. ఇరాన్‌పై ఏకపక్ష దాడులతో పాటు, ఇతర మధ్యప్రాచ్య దేశాలపపై ఇరాన్ దాడులను ఖండించాలని ఆయన అన్నారు. అమెరికా, ఇజ్రాయిల్ దాడుల్లో ఇరాన్ అధ్యక్షుడు ఖమేనీని హత్య చేసిన సంగతి తెలిసిందే. అమెరికా- ఇజ్రాయిల్- ఇరాన్‌ల మధ్య పెరుగుతున్న వైరుధ్యాలు సున్నితమైన ప్రాంతాన్ని తీవ్ర సంఘర్షణ వైపు నెడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

11లో

## హోలీ శుభాకాంక్షలు తెలిపిన కేసీఆర్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మార్చి 3 : రాష్ట్ర ప్రజలకు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల్లో హోలీ కొత్త ఆశలు, విశ్వాసాలు నింపాలని ఆకాంక్షించారు. ప్రజలందరి నడుమ ప్రేమాభిమానాలను విరజిమ్మే రంగుల పండు గగా, హోలీ పండుగ భారతీయ సంప్రదాయంలో ప్రత్యేకతను సంత రించుకున్నది అని కేసీఆర్ అన్నారు. ఆకులు రాలే శిశిరం నుంచి కొత్త చిగురులు తొడిగే వసంతానికి బాటలు వేస్తూ, ప్రకృతిలో నూతనత్వానికి సూచకంగా హోలీ నిలుస్తుందని కేసీఆర్ తెలిపారు. ఆశలు అడుగంటి ఉన్న తెలంగాణ ప్రజల్లో, కొత్త ఆశలు విశ్వాసాలు తిరిగి పుంజుకోవాలని, ప్రజల నడుమ మరింతగా సహోదరతత్వం పెంపొందాలని హోలీ సందర్భంగా కేసీఆర్ ఆకాంక్షించారు.

### వేసవి డిమాండ్‌కు అనుగుణంగా

# విద్యుత్ ప్రణాళిక

**- ఒక్కరోజే 18,139 మెగావాట్ల డిమాండ్**
**- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మార్చి 3 : మంగళవారం ఒక్కరోజే 18,139 మెగావాట్ల డిమాండ్‌ను తెలంగాణ ప్రభుత్వం నెరవేర్చిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. రాష్ట్ర చరిత్రలోనే అత్యధిక విద్యుత్ డిమాండ్‌ను నమోదు చేసుకుందన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. వేసవి

11లో

### ఆ ఐదు గ్రామాలను

# తెలంగాణలో కలపాలి

**- పాలకల్తీకి ప్రభుత్వానిదే బాధ్యత**
**- సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాచలం, మార్చి 3 : భద్రాచలం చుట్టూ ఉన్న ఐదు గ్రామా లను తెలంగాణాకు ఇవ్వాలని సీపీఐ తరపున కోరుతున్నామని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ తెలిపారు. విభజన సందర్భంగా ఎపిలు కలిపిన ఆ ఐదు గ్రామాలు తెలంగాణలో తిరిగి విలీనం చేయాలన్నారు. లేకుంటే తీవ్ర సమస్యలు వస్తాన్నారు. ధార్మిక

11లో



### ప్రజలకు సంక్షేమ పథకాలు

# చేరవేయాలి

**- విద్యావ్యవస్థలో మార్పులపై ప్రజలకు అవగాహన**
**- 99 రోజుల కార్యాచరణలో అందరూ భాగస్వామ్యం కావాలి**
**- ఈ 99 రోజులు కలెక్టర్లు జిల్లా వీడి రావద్దు**
**- మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు సకాలంలో బిల్లుల చెల్లింపు**
**- గ్రామస్థాయి నుంచి ప్రజాప్రతినిధుల భగస్వామ్యం ఉండాలి**
**- కలెక్టర్ల సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మార్చి 3 : రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌పై లబ్దిదారుల అభిప్రాయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సచివాలయంలో కలెక్టర్లతో సీఎం సమావేశమయ్యారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికపై కలెక్టర్లకు దిశా నిర్దేశర చేశారు. 99 రోజుల కార్యాచరణలో అందరి భాగస్వామ్యం ఉండాలని సీఎం పిలుపునిచ్చారు. గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఉండాలి. విద్యావ్యవస్థలో తీసుకువస్తున్న మార్పులపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ప్రభుత్వ ఆస్పత్రులను మెడికల్ కాలేజీలతో అనుసంధానం చేయాలి. మధ్యాహ్న భోజనం ఏజెన్సీలకు ప్రతినెలా బిల్లులు చెల్లించాలని సీఎం అన్నారు. సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో అధికారులు, కలెక్టర్లకు పలు కీలక సూచనలు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రాధాన్యత అంశాలు, పాలనాపరమైన సంస్కరణలపై

11లో

# ప్రభుత్వ ఆలోచనలు, ప్రజల ఆకాంక్షల మేరకు పనిచేయండి

### కలెక్టర్లకు మంత్రి పొంగులేటి హితవు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మార్చి 3 : ప్రభుత్వ ఆలోచనలు, ప్రజల ఆకాంక్షల మేరకు జిల్లా కలెక్టర్లు అంకితభావంతో పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవల కొత్తగా బాధ్యతలు చేపట్టిన పలు జిల్లాల కలెక్టర్లు మంగళవారం సచివాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాల పాలన, సంక్షేమ పథకాల అమలుపై మంత్రి వారికి కీలక మార్గదర్శకాలను జారీ చేశారు. మంత్రిని కలిసిన వారిలో జోగులాంబ గద్వాల, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, మెదక్, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజలకు ప్రయోజనం చేకూరేలా మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకోవాలి. ఐఏఎస్ అధికారుల కెరీర్‌లో జిల్లా కలెక్టర్లుగా పనిచేయడమే అత్యంత కీలకమైన అవకాశం. ఈ సమయంలో ప్రజలతో నేరుగా మమేకమైతే క్షేత్రస్థాయి సమస్యలపై పూర్తి అవగాహన వస్తుంది. ఈ అనుభవమే

11లో

# రాజ్యసభ రేసులో నలుగురు బీసీ నేతలు

### పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మార్చి 3 : రాజ్యసభ స్థానాలపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. సమర్థవంతమైన నలుగురు బీసీ నేతలు రాజ్యసభ అవకాశం ఇవ్వాలని అడుగుతున్నారని తెలిపారు. రాష్ట్రం నుంచి ఒకరికి ఇస్తారా? లేదా ఇద్దరికి ఇస్తారా అనేది బుధవారం తెలుస్తుందన్నారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి రాజ్యసభ స్థానం కోసం అడగడం లేదని చెప్పారు. కార్పొరేట్ శక్తులకు బీఆర్ఎస్ రాజ్యసభ అవకాశాలు ఇచ్చిందని విమర్శించారు. తెలంగాణ కోసం పనిచేసిన వారిలో ఒక్కరికైనా బీఆర్ఎస్ రాజ్యసభ ఛాన్స్ ఇచ్చిందా? అని టీపీసీసీ చీఫ్ ప్రశ్నించారు. మార్చి నెలలో కొన్ని కార్పొరేషన్ పదవులు ఇస్తామని, ప్రస్తుతం వాటిపై కసరత్తు జరుగుతోందని మహేష్ గౌడ్ తెలిపారు. పినరయి విజయన్ వ్యాఖ్యలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమాధానం ఇచ్చారని చెప్పారు. రాజకీయాల కోసమే విజయ్ మాట్లాడుతున్నారని, కేరళంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆయన వెల్లడించారు. నమ్ముకున్న సిద్ధాంతం కోసం మావోయిస్టులు దశాబ్దాలుగా పనిచేశారని టీపీసీసీ చీఫ్ చెప్పుకొచ్చారు. ఆపరేషన్ కగార్‌ను తాము వ్యతిరేకించామని తెలిపారు.

11లో





# కన్న ఊరులాగే కరీంనగర్ నూ మర్చిపోలేను

**- అధికారుల సహకారంతో జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేశా**
**- వీడ్కోలు సమావేశంలో పూర్వ కలెక్టర్ పమేలా సత్పతి**
**- జిల్లా అధికారుల ఆధ్వర్యంలో ఘన సన్మానం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, మార్చి 03 : జిల్లా కలెక్టర్‌గా అభివృద్ధి చేసే గొప్ప అవకాశాన్ని కరీంనగర్ ఇచ్చిందని, కన్న ఊరులాగా ప్రజలంతా అక్కున చేర్చుకోవడం జీవితంలో మర్చిపోలేనని కరీంనగర్ పూర్వ కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. కరీంనగర్ లోని జింకల పార్కులో సోమవారం రాత్రి జిల్లా అధికారుల ఆధ్వర్యంలో కరీంనగర్ పూర్వ కలెక్టర్ పమేలా సత్పతికి ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని విభాగాల జిల్లా అధికారులు, టీఎన్జీవో, టీజీవో, తహసీల్దారులు, ఎంపీడీవోలు, అధికారులందరూ పూర్వ కలెక్టర్ పమేలా సత్పతిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సత్పతి భావోద్వేగ పూరితంగా మాట్లాడారు. రెండు సంవత్సరాల నాలుగు నెలలపాటు కరీంనగర్ జిల్లా కలెక్టర్ గా పనిచేయడం గొప్ప అవకాశమని పేర్కొన్నారు. జిల్లా అధికారులు, కిందిస్థాయి సిబ్బంది సహకారంతో తన శాయశక్తులా సమగ్ర అభివృద్ధికి కృషి చేశానని పేర్కొన్నారు. అందరి సహకారం ఎల్లవేళలా మరువలేనని పేర్కొన్నారు. కన్న ఊరు కోరాపూట్ తర్వాత జీవితంలో ఎప్పటికీ కరీంనగర్ జిల్లాను మరిచిపోలేని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా కన్న తల్లిలాగా అక్కున చేర్చుకుందని తెలిపారు. జిల్లా ఎంతో నేర్పిందన్నారు. సిపి గౌస్ ఆలం తో పాటు జిల్లా అధికారులందరూ అభివృద్ధిలో తమ వంతు సహకారం అందించారని, వారి సహకారంతోనే జిల్లాను అన్ని రంగాల్లో తీర్చిదిద్దామని పేర్కొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో సిపి గౌస్ ఆలం, అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మికిరణ్, మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్, కరీంనగర్, హుజురాబాద్ ఆర్డీవోలు కే.మహేశ్వర్, రమేష్ బాబు, అన్ని విభాగాల జిల్లా అధికారులు, టీఎన్జీవో, టీజీవో సంఘాల ప్రతినిధులు, ఎంపీడీవోలు, తహసీల్దారులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కాగజ్ నగర్ సమస్యలపై మంత్రిని కలిసిన కౌన్సిలర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కాగజ్‌నగర్, మార్చ్ 3 : కాగజ్ నగర్ మున్సిపల్ కౌన్సిలర్ కావేటి విజయ్ కుమార్ పట్టణానికి సంబంధించిన పలు సమస్యలపై రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను మంగళవారం హైదరాబాదులో కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల కొరత, పారిశుద్ధ్య సమస్యలు, తాగునీటి ఇబ్బందులు తదితర అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# పురుగుల మందు సేవించిన గృహిణి

**చికిత్సపొందుతూ గాంధీలో మృతి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మెదక్, మార్చి 03 : పురుగు మందు తాగి చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందిన సంఘటన పాపన్నపేట మండల పరిధిలోని నార్సింగి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది.ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం...గ్రామానికి చెందిన జిన్న దుర్గాభవాని(24) గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుంది.మండల పరిధిలోని బాచారం గ్రామానికి చెందిన బాలయ్య తన కుమార్తెను గత కొన్ని సంవత్సరాల క్రితం నార్సింగి గ్రామానికి చెందిన జిన్న హనుమంతుకు ఇచ్చి పెళ్లి చేశారు.వీరి అన్యోన్య కాపురానికి గుర్తుగా ఇద్దరు కుమారులు పెద్ద కుమారుడు సుమారు నాలుగు సంవత్సరాలు ఉండగా చిన్న కుమారుడు తొమ్మిది నెలల పసి కూన ఇంతలోనే ఏమైందేమో దుర్గాభవాని విషయం సేవించింది.కానీ అనారోగ్య విషయమై ఇంట్లో బాధపడుతూ ఉండేది అంటున్నారు.గత నెల 27న రాతి వేళ ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగు మందు తాగింది.ఈ క్రమంలో కుటుంబీకులు గమనించి చికిత్స నిమిత్తం మెదక్ జిల్లా హాస్పిటల్ కు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ హాస్పిటల్ కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది.మృతురాలి తండ్రి బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

# స్పోర్ట్స్ స్కూల్స్ ఎంపికలకు దరఖాస్తు చేసుకోని, హాజరవ్వండి

**భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాచలం, మార్చి 3 : 2026-27 విద్యా సంవత్సరంనకు గాను పూర్వ ఖమ్మం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో నిర్వహించబడుతున్న స్పోర్ట్స్ స్కూల్స్ ఎంపికలకు అర్హత గలవారు దరఖాస్తు చేసుకొని, హాజరవ్వాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ తెలిపారు. తగు క్రీడలను ఎంపికల కొరకు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాహుల్ మంగళవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్ స్పోర్ట్స్ స్కూల్స్ కిన్నెరసాని (బాలురు) లో 40 సీట్లు, కాచనపల్లి (బాలికలు)లో 40సీట్లు, వాటర్ స్పోర్ట్స్ అకాడమీ బోయినపల్లి, హైదరాబాదులో 5వ తరగతి ఇంగ్లీష్ మీడియం నందు (బాలురు 10 సీట్లు, బాలికలు10 సీట్లు) భర్తీ చేయుటకు కొత్త ప్రవేశాలకు, గత సంవత్సరమునకు చెందిన ఖాళీలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్పోర్ట్స్ స్కూల్ లో (24) అలాగే వాటర్ స్పోర్ట్స్ అకాడమీ బోయి నపల్లి హైదరాబాదు లో (11) మొత్తం (35) సీట్లు నింపుటకు ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ప్రవేశాలకు జిల్లా స్థాయి నందు ఈనెల 16 మార్చి నుండి 18 మార్చి వరకు ఎంపిక ఉంటుందని, తుది ఎంపికలు ఐటీడీఏ (ఉమ్మడి జిల్లా) స్థాయిలో 28 మార్చి నుండి 30 మార్చి వరకు జరుగు తాయని పీఓ అన్నారు. ఆసక్తి గల గిరిజన విద్యార్థిని, విద్యార్థులు 5వ తరగతిలో ప్రవేశం కోసం 31- 8- 2026 నాటికి 9 నుండి 11 సంవత్సరంల వయసు (పుట్టిన తేదీ 01-09-2015 నుండి 31-08-2017 మధ్యలో ఉన్నవారు), తగు ధ్రువీకరణ పత్రములు (విద్యార్థి ఆధార్ కార్డు, నాలుగో తరగతి స్టడీ సర్టిఫికెట్, కులము, ఆదాయ ధృవీకరణ మరియు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు -2)లతో తమ దరఖాస్తులను మార్చి 3 నుండి 14 వరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన విద్యార్థులు మోడల్ స్పోర్ట్స్ స్కూల్ కిన్నెరసానిలో, అలాగే ఖమ్మం జిల్లా వారు ఆశ్రమ ఉన్నత పాఠశాల ఉసిరికాయలపల్లిలో సమర్పించి, జిల్లా స్థాయిలో ఎంపికల కొరకు ఈనెల 16 నుండి 18 వరకు జరుగు ఎంపికలలో హాజరుకావాలని ఆయన వివరించారు. అలాగే ఈ నెల 28 నుండి 30 తేదీలలో జరిగే తుది ఎంపికలు బ్యాటరీ టెస్ట్ (9 అంశముల) కొరకు ఖమ్మం జిల్లా వారు ఆశ్రమ ఉన్నత పాఠశాల ఉసిరికాయలపల్లిలో, భద్రాద్రి జిల్లా విద్యార్థులు వారి నివాస ప్రాంతమునకు దగ్గర ఉన్న ఏదైనా మోడల్ స్పోర్ట్స్ స్కూల్స్ కిన్నెరసాని/కాచనపల్లిలో హాజరు కావాలని, ఈ తొలి ఎంపికల నందు ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు 5వ తరగతిలో ప్రవేశం కల్పించడం జరుగుతుందని అన్నారు. ఈ ఎంపికల కోసం తదుపరి సమాచారం కొరకు ఖమ్మం జిల్లా వారు ఆశ్రమ ఉన్నత పాఠశాల ఉసిరికాయలపల్లి, ఖమ్మం జిల్లా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వారు మోడల్ స్పోర్ట్స్ స్కూల్ కిన్నెరసాని, భద్రాద్రి జిల్లాల ప్రధానో పాధ్యాయులను సంప్రదించాలని ఆయన తెలిపారు. సంబంధిత వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు,ఈ విషయాన్ని గమనించి, ఆసక్తిగల విద్యార్థిని విద్యార్థులను జిల్లా స్థాయి ఎంపికులకు హాజరు అయ్యేట్లుగా చూడాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ ఆదేశించారు.



# మున్సిపల్ చైర్మన్ దంపతులకు బొడ్రాయి వార్షికోత్సవ కమిటీ ఆహ్వానం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సూర్యాపేట మార్చి 3 : కోదాడ పట్టణంలోని నాభి శిల బొడ్రాయి 8వ వార్షికోత్సవ వేడుకలకు హాజరు కావాలని కోదాడ మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ, వెంకటరత్నం బాబు దంపతులను బొడ్రాయి పునః ప్రతిష్ట కమిటీ సభ్యులు సోమవారం వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి కోరారు. ఈ నెల 10వ తేదీన మంగళవారం నిర్వహించనున్న వార్షికోత్సవాన్ని పురస్కరించు కుని, ఆ రోజు తెల్లవారుజామున జరిగే జలాభిషేకం మరియు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం పున ప్రతిష్ట కమిటీ అధ్యక్షులు నాగుబండి లక్ష్మయ్య దంపతులను వార్షికోత్సవంలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొడ్రాయి పున్న ప్రతిష్ట కమిటీ సభ్యులు, రైతు కమిటీ, ముత్యాలమ్మ కమిటీ సభ్యులు పైడిమర్రి వెంకటనారాయణ, ఆవుల రామారావు, పాశం శ్రీను, కోట వెంకటేశ్వరరావు, పందిరి సత్యనారాయణ, వట్టివేళ్ల రవీందర్ రెడ్డి, వేముల రాముడు, సుంకరి నాగయ్య, పెద్ద కోట వెంకటేశ్వరరావు, పారా వెంకటేశ్వర్లు, శేషు, ప్రసాద్, ధనమూర్తి, శ్రీనివాస్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# దీర్ఘకాలిక సింగరేణి కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

**యాజమాన్యంపై మండిపడ్డ ఏఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య**


(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 3 : దీర్ఘకాలిక సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘమైన ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. కొత్తగూడెం శేషగిరిభవన్ లో మంగళవారం జరిగిన ముఖ్య నాయకుల భేటీ లో మిరియాల రంగయ్య మాట్లాడుతూ, సింగరేణి సంస్థకు నూతన సిఎండిగా జ్యోతిబుద్ధ ప్రకాష్ రావడం చాలా సంతోషమే కానీ, యాజమాన్యం కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సిఎండి స్థాయి, డైరెక్టర్ స్థాయి స్ట్రక్చర్ కమిటీ సమావేశంలో ఒప్పుకున్న కార్మిక సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి డైరెక్టర్ లెవెల్, ప్రతి మూడు నెలలకు ఒకసారి సిఎండి స్థాయి లెవెల్ లో గుర్తింపు సంఘంతో సమావేశం ఏర్పాటు చేయాల్సి ఉండగా, వాటినికూడా యాజమాన్యం వాయిదాలు వేస్తూ వస్తుందని యాజమాన్యంపై రంగయ్య మండిపడ్డారు. కమిటీల పేరుతో కాలయాపన చేయడం మానుకోవాలన్నారు. మెడికల్ బోర్డు నిర్వహణ లేకపోవడంతో అనారోగ్యంతో ఉన్న కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తీవ్రంగా యాజమాన్యంపై మండిపడ్డారు. సొంత ఇల్లు పథకం, మారుపేర్ల సమస్యలు పరిష్కరించాలని, ఆదాయ పన్నును కోల్ ఇండియా తరహాలో యాజమాన్యమే భరించాలని కోరారు. డిస్మిస్ అయిన ఉద్యోగులకు మరోసారి అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సెంట్రల్ కార్యదర్శి వంగ వెంకట్, కార్పొరేట్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్.వి.రమణమూర్తి, కొత్తగూడెం ఏరియా సహాయ కార్యదర్శి గట్టయ్య, ఏఐటియుసి నాయకులు చందయ్య తదిత రులు పాల్గొన్నారు.





# మాదిగ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా చింతా బాబు మాదిగ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



సూర్యాపేట మార్చి 3 : ఎమ్మార్పీఎస్ తెలంగాణ అనుబంధ విభాగమైన మాదిగ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా కోదాడ పట్టణానికి చెందిన సీనియర్ నాయకులు చింతాబాబు మాదిగ నియమితులయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపన్న మాదిగ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు చింతా బాబూ మాదిగ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మేడి పాపన్న మాట్లాడుతూ గత 32 ఏళ్లుగా ఉద్యమంలో చురుగ్గా పని చేస్తున్న చింతా బాబు సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. ఎస్సీల సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అందేలా భవిష్యత్తు కార్యాచరణను రూపొందించినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం చింతాబాబు మాదిగ మాట్లాడుతూ తనకు రాష్ట్ర కార్మిక శాఖ అధ్యక్ష పదవి ఇచ్చినందుకు రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి మాదిగ బిడ్డకు అండగా ఉండి న్యాయమైన సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.





# ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం

**ఆర్టీసీ ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరామ్.**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, మార్చి 3 : ఖమ్మం రీజియన్ పరిధిలోని ఆర్టీసీలో ప్రయాణించే ప్రయాణికులు అందరికి మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని ఖమ్మం రీజినల్ మేనేజర్ ఏ.సరిరామ్ అన్నారు. మంగళవారం సత్తుపల్లి డిపోను సందర్శించి, డిపో అభివృద్ధి కోసం ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రయాణికుల భద్రతతో పాటు వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించడం తమ ముందున్న కర్తవ్యం అని పేర్కొన్నారు. ముందుగా సత్తుపల్లి బస్టాండ్ ను పరిశీలించారు. డిపో అత్యధిక ఆదాయం సాధించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలను ఉద్యోగులకు వివరించారు. పలువురు కండక్టర్లతో, వారు విధులు నిర్వహించే రూట్లలో వస్తున్న ఆదాయంపై ఆయన చర్చించారు. అదేవిధంగా గ్యారేజీలను బస్సులను పరిశీలించారు. నేషనల్ సేఫ్టీ వీక్ సందర్భంగా గ్యారేజీలోని ఉద్యోగులతో సమావేశమై ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను ఆయన వివరించారు. డిపో అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన ఈ సందర్భంగా ఉద్యోగులను కోరారు. అనంతరం అద్దె బస్ యాజమానులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించుటలో తమ వంతు కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు రీజియన్ పరిధిలో అదనపు బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ మేనేజర్ పి.ప్రవీణ్ కుమార్, మెకానికల్ ఇంజనీర్ ఎస్.సాహితి, ఖమ్మం రీజనల్ ఆఫీస్ సిఐ శ్రీనివాస్, ఎం.ఎఫ్. చక్రవర్తి, డిపో ఏడీసీలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# పుష్కర ఘాట్‌లను సందర్శించిన పెద్దపల్లి డీసీపీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, మార్చి 03 : రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధి పెద్దపల్లి జోన్, గోదావరిఖని సబ్ డివిజన్ అంతర్గాం పోలీస్ స్టేషన్ పరిధి ఎల్లంపల్లి ప్రాజెక్ట్, గోలివాడ, గోదావరిఖని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి గోదావరి బ్రిడ్జ్ సమీపంలోని గోదావరి పుష్కర ఘాట్‌లను పెద్దపల్లి డీసీపీ రామ్ రెడ్డి ప్రత్యక్షంగా సందర్శించి, గోదావరి తీర ప్రాంతాల్లో పుష్కరాల కోసం ఏర్పాట్లపై పూర్తిస్థాయి కార్యాచరణ రూపొందించాలని పలు సూచనలు చేశారు. గోదావరి తీరంలో అధిక సంఖ్యలో భక్తులు పుష్కర స్నానాలు ఆచరించే అవకాశం ఉందని, ఘాట్‌ల వద్ద భక్తుల రాకపోకలు, భద్రతా ఏర్పాట్లు, బ్యారికేడింగ్, సీసీ కెమెరాల పనితీరు, లైటింగ్ సౌకర్యం, పార్కింగ్ ఏర్పాట్లు, ట్రాఫిక్ మళ్లింపులు వంటి అంశాలను డీసీపీ పరిశీలించారు. ప్రత్యేకించి మహిళలు, వృద్ధులు, చిన్నారులు పుష్కర స్నానాల సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అత్యవసర పరిస్థితుల కోసం కంట్రోల్ రూమ్, ఘాట్ పరిసరాల్లో శుభ్రత, భక్తులు సురక్షితంగా, ప్రశాంత వాతావరణంలో పుష్కర ఘాట్‌లను వినియోగించుకునేలా అన్ని శాఖల సమన్వయంతో సమగ్ర ప్రణాళిక రూపొందించి పని చేయాలని డీసీపీ స్పష్టం చేశారు. డీసీపీ వెంట గోదావరిఖని ఏసీపీ రమేష్, రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్, గోదావరిఖని టూ టౌన్ సీఐ ప్రసాద్ రావు, అంతర్గాం ఎస్ఐ వెంకట్ పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో హెలీ సంబరాలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



యాదాద్రి భువనగిరి, మార్చి 3 : భువనగిరిలో హోలీ సంబరాలు ఘనంగా నిర్వహిం చారు. శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి బైక్‌పై ర్యాలీ నిర్వహిస్తూ పట్టణమంతా తిరిగి ప్రజలతో కలిసి పండుగను జరుపుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కార్యకర్తలతో కలిసి చిందులు వేశారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పుట్ట శివకుమార్ యాదవ్ ఎమ్మెల్యేను భుజాలపై ఎత్తుకుని డాన్స్ చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమం మొత్తం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తంగేళ్లపల్లి శ్రీవాణి రవి కుమార్, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల వెంకటేష్, పట్టణ అధ్యక్షుడు కూర వెంకట్, కౌన్సిలర్లు, కార్యకర్తలు, మండల ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి, బ్లాక్ ప్రెసిడెంట్ చిక్కుల వెంకటేష్, యువజన కాంగ్రెస్ మండల ప్రెసిడెంట్ కల్వకుంట్ల కొండల్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పోత్నక్ ప్రమోద్ కుమార్,మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, పిట్టల బాలరాజ్,బెండే శ్రీకాంత్, ప్రదీప్, విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రగ్రహణం.. శివమల్లన్న ఆలయం మూసివేత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కాగజ్‌నగర్, మార్చ్ 3 : చంద్రగ్రహణం సందర్భంగా కాగజ్ నగర్ మండలం ఇస్గశీ గ్రామంలోని శివ మల్లన్న స్వామి ఆలయాన్ని మంగళవారం మూసివేశారు. గ్రహణం ప్రారంభానికి ముందే అర్చకులు ఆలయ ద్వారాలకు తాళం వేసి భక్తుల దర్శనాలను నిలిపివేశారు. గ్రహణ కాలం ముగిసిన తర్వాత ఆలయ శుద్ధి, సంప్రోక్షణ నిర్వహించి ప్రత్యేక పూజలు చేపట్టనున్నట్లు అర్చకులు వెల్లడించారు. అదేవిధంగా కాగజ్ నగర్ పట్టణంలో అన్ని ప్రధాన ఆలయాలను ఆలయ కమిటీ సభ్యులు గ్రహణం సందర్భంగా తాత్కాలికంగా మూసివేశారు.భక్తులు ఈ మార్పును గమనించి సహకరించాలని కోరారు.



## ఆలయ దారి మూసివేతపై ఎసై కి ఫిర్యాదు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కాగజ్‌నగర్, మార్చ్ 3 : కాగజ్ నగర్ పట్టణంలోని ఆర్ఆర్ఆ కాలనీ రేణుక ఎల్లమ్మ ఆలయ మార్గంలో కాంగ్రెస్ నాయకులు లెండుగురే శ్యామ్ రావు ట్రాక్టర్లతో మొరం మట్టి పోసి అడ్డుకోవడాన్ని ఆలయ కమిటీ తప్పుబట్టింది. దీనివల్ల భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపిస్తూ ఎస్ఐ సుధాకర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని కమిటీ సభ్యులు హెచ్చరించారు. ఆలయ మార్గాన్ని తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు రామా గౌడ్, వెంకటేష్ గౌడ్, సభ్యులు శివ గౌడ్, పంజాలా సత్యనారాయణ గౌడ్, పంజలా రమేష్ గౌడ్,ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## కోసినిలో నిరుపేదలకు ఇళ్ల పట్టాల ఇవ్వాలని వినతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కాగజ్‌నగర్, మార్చ్ 3 : కాగజ్ నగర్ మండలంలో కోసిని గ్రామ పంచాయతీ పరిధిలో 15-40 ఏళ్లుగా నివసిస్తున్న నిరు పేదలు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని గ్రామస్థులు తహసీల్దార్, ఎంపిడిఓ లకు మంగళవారం వినతిపత్రం వేరు వేరుగా అంద జేశారు. ఇండ్ల పట్టాలు లేక ప్రభుత్వ గృహ పథకాలు అందడం లేదని పేర్కొన్నారు. ఇళ్ల చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణంపైచర్యలుతీసుకోవాలని కోరారు.

## పండగ పూట రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



పాల్వంచ, మార్చి3 : భద్రాద్రి జిల్లా పాల్వంచ పట్టణం నవ భారత్ సెంటర్ జాతీయ రహదారిపై మంగళవారం హోలీ పండగ రోజు రెండు టూ వీలర్స్ ఎదురెదురగా ఢీ కొనడంతో నవభారత్ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న మహేష్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలవడంతో కొత్తగుడెంలోని హాస్పిటల్ కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రాణాలు విడిచినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం పాల్వంచ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మహేష్ కు భార్య, ఒక పాప, ఒక బాబు వున్నట్లు సమాచారం. యాక్సిడెంట్ అయిన ప్రదేశంలో పోలీస్ ట్రాఫిక్ బాక్స్ వుండటం వల్లే ఇలాంటి ప్రమాదాలు తరుచూ ఆ ప్రదేశంలో జరుగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.



## అంగరంగ వైభవంగా లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సూర్యాపేట మార్చి 3 : నడిగూడెం మండలం 190 సర్వే నంబరు లోనీ ఫారెస్ట్ పరిధిలో గుట్టపై వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణ మహోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నడిగూడెం, మునగాల మండలాలకు చెందిన భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో వేలాదిమంది పాల్గొన్నారు. ఈ కార్యక్ర మంలో రామాపురం, బారాకత్ గూడెం, కృష్ణానగర్ కు చెందిన సర్పంచులు, వివిధ హోదాలలో ఉన్న ప్రజా ప్రతినిధులు, పలు రాజకీయ పార్టీల నాయకులు, భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చారు. కళ్యాణ మహోత్సవంలో భాగంగా, 10 జంటలు పీటల పై కూర్చొని, వేద పండితుల సమక్షంలో కళ్యాణ మహోత్సవం జరిగింది.

## కారు - బైక్ ఢీ..! ఒకరు దుర్మరణం

### మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కాగజ్‌నగర్, మార్చ్ 3 : కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం నారాయణపూర్-కిష్టాపూర్ మధ్య మంగళవారం కారు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు దుర్మరణం పాలయ్యారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మద్యం మత్తులో వాహనం నడపడమే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. హోలీ పండగ పూట గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఇసుక ట్రాక్టర్ బోల్తా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కాగజ్‌నగర్, మార్చ్ 3 : దహెగాం మండలం లగ్గం గ్రామ సమీపంలోని ప్రమాదకర మలుపు వద్ద మంగళవారం ఉదయం ఇసుక ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్ అప్రమత్తంగా కిందకు దూకేయడంతో ప్రాణాపాయం తప్పింది. మితిమీరిన వేగం, అధిక లోడ్ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు భావిస్తున్నారు. ఘటనా స్థలికి చేరుకున్న గ్రామస్థులు సహాయక చర్యలు చేపట్టారు. ట్రాక్టరు స్వల్ప నష్టం వాటిల్లిందని వారు తెలిపారు.

# కాల్వల అభివృద్ధితో గ్రామాలకు నీటి వెలుగు

### ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పరిశీలన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



యాదాద్రి భువనగిరి, మార్చి 3 : యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలంలోని సుద్దాల, అనంతారం గ్రామాల సమీపంలో ఉన్న కాల్వలను ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య స్వయంగా పరిశీలించారు. సాగునీటి సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా రైతులకు లాభం చేకూర్చే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతారం వద్ద అసంపూర్తిగా ఉన్న కాల్వలను త్వరితగతిన మరమ్మతులు చేస్తే చెరువులు నిండిపోతాయని పేర్కొన్నారు. ఈ పనులు పూర్తయితే సుద్దాల, వెల్మజాల, బ్రాహ్మణపల్లి, సీతారాంపురం గ్రామాలకు చెందిన చెరువులు కూడా నిండి రైతులకు పెద్ద ఎత్తున ఉపయోగం కలుగుతుందని వివరించారు. ఈ సందర్భంగా కాల్వ పనులను ప్రారంభిస్తూ అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. అనంతరం నవాబ్ పేట రిజర్వాయర్ ను సందర్శించిన ఎమ్మెల్యే, గుండాల మండలానికి నీటి సరఫరా పెంచే అంశంపై సమీక్షించారు. రిజర్వాయర్ నుంచి కాల్వల ద్వారా నీరు వచ్చే మార్గంలో పలు గ్రామాల్లో గేట్ వాల్ వద్ద ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, సంబంధిత అధికారులతో చర్చించారు. గ్రామాలకు నిరంతరాయంగా సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేస్తూ, రైతులకు ఇబ్బందులు లేకుండా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## ఫిరాయించిన"మమత"ను"బర్త్ రఫ్"చేయాలి



- ఎన్నికల నిబంధనలు అందరికీ సమానమే
- ఇస్నాపూర్ మున్సిపాలిటీ 12 వ వార్డు కౌన్సిలర్ “మచ్చ కిషోర్ రెడ్డి”

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పటాన్ చేరు, మార్చ్ 3 : ఇస్నాపూర్ మున్సిపల్ పరిధి వార్డు కౌన్సిల్ పరిధిలో జరుగుతున్న పరిణామాలు విచిత్రంగా గోచరిస్తున్నాయి. ఎన్నికల నియమ, నిబంధనలు అందరికీ సమానమే.! మరి “లక్దారం” ఒకటవ వార్డు నుండి బీఆర్ఎస్ పార్టీ బీ ఫామ్ తో పోటీ చేసి గెలిచిన “మమత అరుణ్ కుమార్” చేసిన ద్రోహం ఎన్నికల నియమ, నిబంధనలకు కనపడడం లేదా.? అంటూ ఇస్నాపూర్ మున్సిపల్ పరిధి 12 వ వార్డు కౌన్సిలర్ “మచ్చ కిషోర్ రెడ్డి” ప్రశ్నించారు. మంగళవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గడీల శ్రీకాంత్ గౌడ్ ప్రధాన కార్యాలయం ముందు “మచ్చ కిషోర్ రెడ్డి” మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు వ్యవహారంలో భాగంగా సాగుతున్న ఈ “బల్దియా” వ్యవహారం యావత్ రాష్ట్రం చూస్తుందని అన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ బి ఫామ్ పై గెలిచి బీఆర్ఎస్ పార్టీకీ మద్దతు పలికిన ఎనిమిదో వార్డు అభ్యర్థిపై చర్యలు తీసుకోవాలని చూస్తున్నా చట్టాలు మరి ఒకటవ వార్డులో టిఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచి కాంగ్రెస్ పార్టీకి ఊడిగం చేస్తున్న మమత అరుణ్ కుమార్ పై ఎందుకు చూపరు అంటూ ఆయన ప్రశ్నించారు. చట్టాలు అందరికీ సమానమే ఇక్కడ సామాన్యులు ప్రమిదల అంటూ ఆయన నిలదీశారు. అయితే లక్దారం 1 వ వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచి కాంగ్రెస్ పార్టీకి వంత పాడే రాజకీయ ద్రోహి రేపు అవార్డు ప్రజలకు ఏమని సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఆ లక్దారం పరిధి 1వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థిని ఆ వార్డు ప్రజలు ఓడించి బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించారు. ఈయన టిఆర్ఎస్ లో గెలిచి కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలికారు. ఆ వార్డు ప్రజలు అనుకుంటే కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకోలేరా అంటూ మచ్చ కిషోర్ రెడ్డి ప్రశ్నించారు. మొత్తానికి ఈ చెత్త రాజకీయాలు భవిష్యత్తులో ప్రమాదకరమని మాటపై నిలబడే సత్తా ఉన్న పార్టీ నాయకుని మార్గాన్ని దేశంలో నడిచే వ్యవస్థ బీఆర్ఎస్ పార్టీని లక్దారం 1వ వార్డు అభ్యర్థి మమత అరుణ్ కుమార్ సభ్యత్వం రద్దు అయ్యే వరకు నాయకత్వం మౌనంగా ఉండదని ఈ సందర్భంగా మచ్చ కిషోర్ రెడ్డి హెచ్చరించారు.

## ఆర్‌సీఓఏ క్లబ్‌లో నూతన డైనింగ్ హాల్ ప్రారంభం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, మార్చి 03 : స్థానిక ఆర్‌సీఓఏ క్లబ్ లో ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్ మంగళవారం డైనింగ్ హాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఆర్‌సీఓఏ క్లబ్ అభివృద్ధిలో ఇది ఒక ముఖ్యమైన అడుగు అని పేర్కొన్నారు. కొత్త డైనింగ్ హాల్ ద్వారా సభ్యులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటు లోకి వస్తాయని తెలిపారు. ఈ సదుపాయం ద్వారా సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర కార్యక్రమాలు మరింత సౌకర్యవంతంగా నిర్వహించవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు అనితా లలిత్ కుమార్, అధికారులు, సిబ్బంది, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## సమాజంలోని శాంతి, ఐక్యత, స్నేహానికి ప్రతీక హోలీ పండుగ

- రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంస్ మాజీ చైర్మన్ కొత్వాల
- పాత పాల్వంచలో కొత్వాల స్వగృహంలో ఉత్సాహంగా మహిళల హోలీ వేడుకలు




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, మార్చి 3 : సమాజంలోని శాంతి, ప్రేమ, ఐక్యత, స్నేహానికి ప్రతీకగా జరుపుకునే పండుగ హోలీ అని రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీఎంస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. హోలీ పండుగ సందర్భంగా మంగళవారం భద్రాద్రి జిల్లా పాత పాల్వంచ గడియకట్టలోని కొత్వాల స్వగృహంలో 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి నేతృత్వంలో మహిళలు, యువకులు ఉత్సాహంగా హోలీ వేడుకలు జరుపుకున్నారు. మహిళలు రంగులు చల్లుకుంటూ డాన్సులు చేశారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ, హోలీ చెడుపై విజయం సాధించిన తరుణమని, రంగురంగుల సంబరాల వేడుక అని అన్నారు. హోలీ పండుగ అందరి జీవితాలలో రంగులద్ది, సంతోషాలు నింపాలని కొత్వాల అన్నారు. ఈ కార్యక్రమాల్లో మైసమ్మతల్లి దేవాలయం కమిటీ సభ్యులు వంగా రమేష్, మసనం శరత్, గడదాసు వెంకట్, కోసూరి కిరణ్ కుమార్, కరుకుల సతీష్, రౌతు మల్లేష్, నాగరాజు, బొమ్మకంటి శ్రీను, బొమ్మకంటి వెంకన్న, నర్సింహారావు, లోగాని రామకృష్ణ, శరన్, చారుగుండ్ల మోహన్, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## అన్ని పోస్ట్ ఆఫీస్ ల ద్వారా భద్రాద్రి తలంబ్రాలు పంపిణీ

- రామకృష్ణ భూపాలపల్లి సబ్ డివిజన్ ఇన్స్పెక్టర్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భూపాలపల్లి, మార్చి 3 : అన్ని పోస్ట్ ఆఫీస్ ల ద్వారా భద్రాద్రి తలంబ్రాల పంపిణీ కార్యక్రమ నిర్వహణలో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని భూపాలపల్లి పోస్ట్ ఆఫీస్ ద్వారా కూడా తలంబ్రాల పంపిణీ చేస్తున్నట్లు భూపాలపల్లి సబ్ డివిజన్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీ రామ నవమి సందర్భంగా భద్రాద్రిలో నిర్వహించే శ్రీ సీతా రామచంద్రస్వామి కళ్యాణోత్సవంలోని పవిత్ర “తలంబ్రాలు” ప్రసాదాన్ని రాష్ట్రంలోని అన్ని పోస్టాఫీసుల ద్వారా భక్తుల ఇళ్లకు నేరుగా పంపిణీ చేసే ప్రత్యేక సేవను తెలంగాణ పోస్టల్ సర్కిల్ అందిస్తోందని ఆయన పేర్కొన్నారు. గత సంవత్సరాల మాదిరిగానే, భక్తులు భద్రాద్రికి ప్రయాణించాల్సిన అవసరం లేకుండా పవిత్ర తలంబ్రాలను పొందేందుకు తెలంగాణ ఎండోమెంట్స్ శాఖ సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టబడుతోందని ఆయన వివరించారు. రాష్ట్రంలోని అన్ని పోస్టాఫీసుల ద్వారా భక్తులు ఈ సేవలను పొందవచ్చుని ఆయన పేర్కొన్నారు. అంత్రాలయ అర్చన కళ్యాణ తలంబ్రాలు, భద్రాచల సీతారామ స్వామి కళ్యాణ తలంబ్రాలు ప్యాకెట్ (1 ముత్యం, కుంకుమ, మిశ్రీ మరియు కాజు గింజలు కలిగి ఉంటుంది) రూ.450, ముత్యాల తలంబ్రాలు, భద్రాచల సీతారామ స్వామి కళ్యాణ తలంబ్రాలు ప్యాకెట్ (1 ముత్యం కలిగి ఉంటుంది) రూ.151 ఉంటుందని ఆయన పేర్కొన్నారు. భక్తులు అవసరమైన రుసుము చెల్లించి ఏ పోస్టాఫీసులోనైనా ఈ అవకాశాన్ని పొందవచ్చుని, . శ్రీ సీతా రామచంద్ర కళ్యాణోత్సవం అనంతరం తలంబ్రాలు స్పీడ్ పోస్టు ద్వారా భక్తుల గృహద్వారాలకు పంపిణీ చేయబడతాయని ఆయన పెరకవిన్నారు. 27 మార్చి 2026న భద్రాద్రిలో నిర్వహించనున్న శ్రీ రామ నవమి మహోత్సవాలకు హాజరుకాలేని భక్తులకు ఈ సేవ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



## ట్రాక్టర్ బోల్తా పడి మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకోవాలి

- మానుక ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, మార్చి 03 : కోరుట్ల నియోజకవర్గంలోని మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామంలో ఇటీవల ట్రాక్టర్ బోల్తాపడి మరణించిన కుటుంబాలను వెంటనే ఆదుకోవాలని కోరుతూ కోరుట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ మానుక ప్రవీణ్ కుమార్ మరణించిన వారి కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ కు వినతి పత్రం అందజేశారు. కోరుట్ల నియోజకవర్గం ఇటీవల మల్లాపూర్ మండలంలో మొగిలిపేట గ్రామ శివారులో ట్రాక్టర్ బోల్తా పడి మరణించిన పెద్దిరెడ్డి గంగు, వైష్ణవి, సంపంగి సాయమ్మ, మంగళారపు లలిత కుటుంబాలను అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.ఎందుకంటే వారు నిరుపేద కుటుంబాలని రెక్క ఆడితే కానీ డొక్కాడని కుటుంబాలు అని, అలాగే రోజు కూలి పని చేసుకుని బ్రతుకుతున్న నిరుపేద కుటుంబాలని ప్రవీణ్ కుమార్ తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి రాష్ట్ర ముఖ్యమంత్రి, జిల్లా మంత్రికి అన్ని విషయాలు తెలియజేసి, మరణించిన కుటుంబాలకు ప్రభుత్వం తరఫున 20 లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా చెల్లించాలని ప్రవీణ్ కుమార్ కలెక్టర్ ను విజ్ఞప్తి చేసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎండి రఫీయోద్దీన్, మహదేవ్, మాధవరెడ్డి, మారుతి, మృతులకుటుంబసభ్యులుఎల్లయ్య, పాల్గొన్నారు.



## డిఎస్‌యఫ్ఐ ఆధ్వర్యంలో హోలీ సంబురాలు...

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, మార్చి 03 : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో డెమోక్రాటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ అఫ్ ఇండియా (డిఎస్‌యఫ్ఐ) ఆధ్వర్యంలో హోలీ సంబురాలు ఘనంగా నిర్వహించారు. డిఎస్‌యఫ్ఐ నాయకులు, యువసైన్యం భాగస్వామ్యమై పండుగను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ హోలీ వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి కెలోత్ సాయి కుమార్, రాష్ట్ర కోశాధికారి గూగులోతు సూర్య ప్రకాష్, జిల్లా ఇంచార్జి శ్రీకాంత్ మాట్లాడుతూ సమానత్వం, సోదరభావం అనే రంగులతో కొత్త సమాజాన్ని నిర్మిదామని పిలుపునిచ్చారు. ఇంకా ఈ హోలీ సంబరాల్లో పట్టణ నాయకులు గౌతం, సల్మాన్, విఘ్నేష్, సురభి సాయి, తరుణ్, వినయ్, సంతోష్, అజయ్, మహేష్, రాజేష్ యువకులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా హోలీ వేడుకలు జరుపుకున్న పోలీసు అధికారులు, సిబ్బంది

- జిల్లా ప్రజలకు హోలీ శుభాకాంక్షలు
- తెలిపిన జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భూపాలపల్లి, మార్చి 3 : భూపాలపల్లి జిల్లా పోలీసు కార్యాల యంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆధ్వర్యంలో ఘనంగా హోలీ పండుగ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది, పాత్రికేయ మిత్రులు ఉత్సాహంగా పాల్గొని పండుగను ఆనందంగా జరుపుకున్నారు. జిల్లా ఎస్పీ పోలీసు అధికారులతో కలిసి రంగులు చల్లుకుంటూ హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. స్నేహభావం, ఐక్యతకు ప్రతీకగా నిలిచే హోలీ పండుగను సురక్షి తంగా, పరస్పర గౌరవంతో జరుపుకోవాలని సూచించారు. జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులకు, సిబ్బందికి హోలీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, సమాజంలో సౌభ్రాతృత్వం, ఆనందం, ఐక్యత మరింత పెరగాలని ఆకాంక్షించారు. పండుగ సందర్భంగా ఎటు వంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవా లని, రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, డిఎస్పీలు, ఇన్స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు చౌరస్తాలో హోలీ సంబరాలు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, మార్చి 03 : రామగుండం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం స్థానిక చౌరస్తాలో హోలీ సంబరాలు నిర్వహించనున్నట్లు నగర మేయర్ మహంకాళి స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ హోలీ సంబరాలను విజయవంతం చేయాలని కోరారు.

## మెదక్ పట్టణంలో ఘనంగా హోలీ సంబరాలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మెదక్, మార్చి 03 : మెదక్ పట్టణంలో మంగళవారం రోజు హోలీ పండుగ సంబురాలు అంబరానంటాయి. ఈ సందర్భంగా యువతీ, యువకులు,స్నేహితులు,పిల్లలు చిన్నా పెద్ద తేడా లేకుండా ఉత్సాహంగా హోలీ వేడుకల్లో పాల్గొన్నారు.ఉదయం నుంచే నగరంలోని పలు కాలనీలు, ప్రధాన వీధుల గుండా రంగుల హరివిల్లుల్లా మెరిసిపోయాయి. స్నేహితులు, పరిచయస్తులు ఒకరినొకరు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపు కున్నారు. యువకులు ప్రధాన కూడళ్లలో గుంపులుగా చేరి రంగుల పండుగను ఆనందంగా ఆస్వాదించారు.పింక్,బ్లూ, గ్రీన్ రంగులతో ఒకరినొకరు అలంకరించుకుంటూ సంతోషంగా కేరింతలు కొడుతూ గడిపారు.కొందరు సెల్ఫీలు దిగుతూ ఆ క్షణాలను స్మృతులుగా నిలుపుకున్నారు. సరదాగా రంగులు చల్లుకుంటూ స్నేహబంధాలను మరింత బలపరిచారు. ఇళ్ల వద్ద చిన్నపిల్లలు కూడా నీటి గన్‌లతో రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. మహిళలు ప్రత్యేక వంటకాలు సిద్ధం చేసి కుటుంబ సభ్యులతో కలిసి పండుగను ఆనందంగా గడిపారు.కొన్ని ప్రాంతాల్లో డీజే సంగీతం మధ్య యువత నృత్యాలతో హోలీ ఉత్సాహాన్ని రెట్టింపు చేశారు. పోలీసులు,సిబ్బంది శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు చేపట్టడంతో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదు. ప్రజలు పరస్పర గౌరవంతో, స్నేహ భావంతో పండుగను జరుపుకోవాలని అధికారులు సూచించారు. మొత్తంగా మెదక్ జిల్లా కేంద్రంలో హోలీ పండుగ ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించు కున్నారు.



## అంతర్గాంలో హోలీ వేడుకల్లో సర్పంచ్ రవి నాయక్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, మార్చి 3 : అంతర్గాం టిటిఎస్ మండల కేంద్రంలో సర్పంచ్ రవి నాయక్ మంగళవారం అంబేద్కర్ చౌరస్తా లో మిత్రులు శ్రేయోభిలాషులతో రంగులు పులుముకుంటూ హోలీ వేడుకల సంబరాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ అంగోత్ రవి నాయక్ మాట్లాడుతూ ఈ రంగుల పండుగ హోలీ చెడుపై మంచి గెలిచే సందేశాన్నిచ్చే సంబరాల సాంప్రదాయ వరమని అన్నారు. లక్ష్మీ నరసింహ స్వామి ఆశీస్సులతో ప్రతి ఇంట్ల సుఖసంతోషాలు వెల్లి విరిసి ఆయురారోగ్యాలతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వర్గాల ప్రజలు ప్రశాంత జీవితం గడపడంతో పాటు అంతర్గాం టిటిఎస్ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తానని సర్పంచ్ అంగోత్ రవి నాయక్ అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రవి నాయక్ మిత్రులు శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

ప్రజాలక్ష్యం
సంపాదకీయం

## హర్మూజ్ జలసంధి మూతతో ఆయిల్ తిప్పలు !

పిల్లికి చెలగాలటం..ఎలుకకు ప్రాణసంకటం అన్నది సామెత. ఇప్పుడు అమెరికా, ఇజ్రాయిల్ చెలగాటంతో భారత్ సహా అనేక ప్రపంచ దేశాలకు ప్రాణసంకటంగా మారనుంది. ప్రధానంగా ఇంధన రవాణా బంద్ అయితే తట్టుకోవడం కష్టమే. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ దాడులు మధ్యప్రా చ్యాన్ని ఉద్రిక్తతల్లోకి నెట్టాయి. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మరణం తర్వాత ఆందోళనలు తారాస్థాయికి చేరాయి. ఈ యుద్ధం కేవలం రెండు దేశాలకు మాత్రమే పరిమితం కాకుండా, గల్ఫ్ లోని యూఏఈ, సౌదీ అరేబియా, కువైట్, ఖతార్, బహ్రెయిన్ వంటి దేశాలకు కూడా విస్తరిం చింది. ఇరాన్ ఈ దేశాల్లోని అమెరికన్ స్థావరాలపై మిస్సైల్స్, డ్రోన్లతో దాడులకు తెగబడుతోంది. దుబాయ్, దోహా, అబుదాబీ వంటి సిటీలపై దాడులు చేస్తోంది. ఇకపోతే హార్మ్ జ్ జలసంధి మూసివేత, చమురు రవాణాకు ఇబ్బందులు ఏర్పడనున్నాయి. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలక మైన హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసేసింది. ఇది భారత్‌తో పాటు ఇతర ఆసియా దేశాలను తీవ్రంగా ప్రభావితం చేస్తుం ది. గల్ఫ్ నుంచి వచ్చే చమురు ఈ మార్గం ద్వారానే రావాల్సి ఉంటుంది. ప్రపంచంలోని రోజువారీ చమురు వినియోగం లో 20 శాతం ఈ హార్మూజ్ జలసంధి నుంచే ప్రయాణిస్తుం టుంది. ఈ మార్గం గుండా వచ్చే చమురు ఎగుమతుల్లో 82 శాతం ఆసియాకు వెళ్తున్నాయి. ఇందులో భారత్, చైనా, జపాన్, దక్షిణ కొరియా వాటా ఏకంగా 67 శాతం ఉంది. భారత్ ముడి చమురులో 90 శాతం చమురును మిడిల్ ఈస్ట్ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది. ఇందులో 40 శాతం హోర్మూజ్ జలసంధి నుంచే వస్తున్నాయి. ఇరాక్ పై అమెరికా ఇజ్రాయిల్ దళాలు దాడుల నేపథ్యంలో హోర్ముజ్ జలసంధి ద్వారా ఇంధన సరఫరా అంతరాయం కలిగే అవకా శంపై ఆందోళనలు వ్యక్తమవు తున్నాయి. ఈ మార్గంలో ఏ విధమైన సంక్షోభం తలెత్తినా భారతదేశ ఆర్థిక వ్యవస్థ, ఇంధన భద్రతపై తీవ్ర ప్రభావం పడే అవకాశముందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. భారతదేశం దిగుమతి చేసుకునే ముడి చమురులో 50 శాతానికి పైగా హోర్ముజ్ జలసంధి ద్వారానే వస్తుంది. ఇది ముఖ్యంగా సౌదీ అరేబియా, ఇరాక్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కువైట్, ఖతార్ నుంచి సరఫరా అవుతోంది. అదనంగా, భారతదేశ ఎల్‌ఎన్‌జీ దిగుమతుల్లో దాదాపు 60 శాతం, అలాగే ఎల్‌పిజిలో పెద్ద భాగం కూడా ఇదే మార్గం ద్వారా రవాణా అవుతోంది. ప్రపంచ వాణిజ్యాన్ని పర్యవేక్షించే సంస్థ 'కెప్లర్' గణాంకాల ప్రకారం, ఫిబ్రవరి 24 నాటికి రోజుకు సుమారు 2.6 మిలియన్ బ్యారెళ్ల చమురు హోర్ముజ్ మార్గం ద్వారా భారతదేశానికి చేరింది. ప్రపంచ చమురు వాణిజ్యంలో సుమారు 20 శాతం, ఎల్‌ఎన్ జీ వాణిజ్యంలో 30 శాతానికి పైగా ఈ జలసంధి ద్వారానే జరుగుతున్నందున, ఇక్కడి సంక్షోభం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపే ప్రమాదం ఉంది. అమెరికా దాడుల ముప్పు నేపథ్యంలో శుక్రవారం ప్రపంచ చమురు ధరలు బ్యారెల్‌కు 72.87 డాలర్లకు పెరిగాయి. ఒకే రోజులో 6 డాలర్ల పెరుగుదల నమోదైంది. బ్యారెల్‌కు రూ.10 పెరుగు దల చోటుచేసుకుంటే, భారతదేశం దిగుమతులపై సుమారు 140 బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.1.27 లక్షల కోట్లు అదనంగా చెల్లించాల్సి వస్తుందని అంచనా. ఇప్పటికే దేశంలో ఇంధనం, వంటగ్యాస్ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బ ణం వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. హోర్ముజ్ జలసంధిలో అంతరాయం ఏర్పడితే భారతదేశానికి గట్టి దెబ్బ అవుతుందని 'కెప్లర్' హెచ్చరించింది. దేశానికి అవసర మైన ముడి చమురులో దాదాపు 90 శాతం దిగుమతులపైనే ఆధారపడుతున్న నేపథ్యంలో, సరఫరా భద్రత కీలకంగా మారింది. రష్యన్ చమురు దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు కూడా ఇంధన భద్రతపై ప్రభావం చూపవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పెట్రోలి యం మంత్రి హర్దీప్ సింగ్ పూరి చెప్పిన వివరాల ప్రకారం, ఏదైనా సంక్షోభం తలెత్తితే భారత్ వద్ద 74 రోజులకు సరిపడా చమురు నిల్వలు ఉన్నాయి. అయితే, మొత్తం పెట్రోలియం నిల్వల్ని 90 రోజులకు పెంచాలని కేంద్రం భావిస్తోంది. ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లోని భూగర్భంలోని గుహల్లో భద్రపరి చిన స్ట్రాటజిక్ పెట్రోలియం రిజర్వ్ సుమారుగా 9.5 రోజులకు సరిపోతుంది. దీనికి తోడు చమురు మార్కెటింగ్ కంపెనీల వద్ద అందుబాటులో ఉన్న ముడి చమురు, పెట్రోలి యం ఉత్పత్తుల నిల్వ సామర్థ్యం సుమారుగా 67 రోజులకు సరిపడా ఉంది. ఒక బారెల్ ధర ఒక డాలర్ పెరిగితే భారత్ ఏడాదికి 1.4 బిలియన్ డాలర్లు అదనపు ఖర్చు భరించాల్సి వస్తుంది. దీనికి తోడు గ్యాస్ ధరలు కూడా పెరుగుతాయి. భారత్ తన అవసరాలకు అవసరమైన గ్యాస్‌లో 50 శాతం దిగుమతులపైనే ఆధారపడి ఉంది. ప్రస్తుతం, హోర్ముజ్ జల సంధి మూతపడినా, రష్యన్ ఆయిల్ భారత్‌కు అందుబాటులో ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. దీనితోడు వెనిజులా ఆయిల్ కూడా భారత్ కొనుగోలు చేస్తోంది. ఇప్పటికప్పుడు భారత్‌కు వచ్చే ఇబ్బందులు లేవు, కానీ దీర్ఘకాలం హోర్ముజ్ జలసంధి మూతపడితే మాత్రం చమురు ధరలు పెరిగే అవకాశ ఉంది. అంటే అమెరికా హెచ్చిరికలు చూస్తే మరో మూడునాలుగు రోజులు యుద్ధం కొనసాగే ప్రమాదం ఉంది. ఇరాన్ అంతు చూస్తామని ట్రంప్ హెచ్చరికలు చేస్తు న్నారు. కాబట్టి ఇప్పట్లో మంటలు చల్లారేలా లేవు. పైగా యుద్ధం విస్తరిస్తోంది. లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడులకు దిగింది. హిజ్బుల్ లక్ష్యంగా చేస్తున్న దాడుల కారణంగా ఇది విస్తరించడమే తప్ప ఆగిపోతుంద నుకోవడానికి లేదు. అం దువల్ల భారత్ సంయమనంతో ముందుకు సాగాల్సి ఉం టుంది.

# పశ్చిమాసియాలో సంగ్రామ మేఘాలు

## ప్రపంచ శాంతికి కొత్త సవాళ్లు

## ఇరాన్‌పై దాడులు-మహాయుద్ధ అంచున నిలిచిన ప్రపంచం



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

పశ్చిమాసియాలో మళ్లీ సంగ్రామ మేఘాలు కమ్ముకొంటున్నాయి. "ఆపరేషన్ ఎపిక్ ఫూరీ" పేరుతో కొన సాగుతున్న అమెరికా--ఇజ్రాయిల్ సంయుక్త సైనిక చర్యలు, వాటికి ప్రతి స్పందనగా ఇరాన్ చేసిన ప్రతి ఘటన ప్రకటనలు, ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి అత్యవసర సమా వేశం.. ఈ సమస్త పరిణామాలు ప్రపంచ రాజకీయ రంగాన్ని కుదిపేస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ దేశ రక్షణకు ముప్పు కలిగించే శక్తులను అడ్డుకోవడంలో వెనుకాడ బోమని స్పష్టం చేయగా, ఇరాన్ విదేశాంగ మంత్రి హెుస్సేన్ అమీరా బాద్ డొల్లాహియన్ తమ దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవడంలో ఎటువంటి రాజీ ఉండదని ఘాటుగా ప్రకటించారు. మాటల స్థాయిలో ప్రారంభమైన ఈ ప్రతిస్పందనలు క్రమంగా సైనిక కదలికల రూపం లోనూ వ్యక్తమవుతున్నాయి.

ఈ ఉద్రిక్తతకు ప్రధాన కారణంగా ఇరాన్ అణు కార్యక్రమాన్ని అమెరికా-ఇజ్రాయిల్ పేర్కొంటున్నాయి. 2015 సంవత్సరంలో కుదిరిన ఉమ్మడి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక ఒప్పందం ప్రకారం ఇరాన్ అణు శక్తి అభివృద్ధిని నియంత్రించేందుకు అంతర్జాతీయ పర్యవేక్షణకు అంగీకరించింది. అయితే ఆ ఒప్పందం నుంచి అమెరికా వైదొలిగిన తర్వాత అనుమానాలు మళ్లీ పెరిగాయి. ఇరాన్ యురేనియం శుద్ధీకరణ స్థాయిని పెంచుతోందన్న ఆరోపణలతో ఇజ్రాయిల్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. తమ భద్రతకు ప్రత్యక్ష ముప్పు ఏర్పడు తుందనే భావనతో ఇజ్రాయిల్ ఇరాన్‌లోని కొన్ని అణు కేంద్రాలపై గగనతల దాడులు నిర్వహించినట్లు వార్తలు వెలువడ్డాయి. అమెరికా కూడా ఈ చర్యలకు మద్దతు తెలుపుతున్నదనే అభిప్రాయం బలపడు తోంది. ఇరాన్ మాత్రం తన అణు కార్యక్రమం పూర్తిగా శాంతియుత అవసరాలకేనని, విద్యుత్ ఉత్పత్తి మరియు శాస్త్రీయ పరిశోధనల కోసమేనని స్పష్టం చేస్తోంది. అంతర్జాతీయ అణుశక్తి పర్యవేక్షణ సంస్థ పర్యవేక్షణలోనే తమ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని పేర్కొంటోంది. అయితే ఇజ్రాయిల్ దృష్టిలో ఇరాన్ అణు సామర్థ్యం భవిష్యత్తులో ప్రాణాంతక ముప్పుగా మారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అమెరికా-ఇజ్రాయిల్ చర్యలు రక్షణాత్మక చర్యలేనని వారు వాదిస్తున్నారు.

ఈ పరిణామాల నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి అత్యవసర సమావేశం నిర్వహించి తక్షణ సంగ్రామ విరమణకు పిలుపు నిచ్చింది. చర్చల ద్వారానే సమస్య పరిష్కారం సాధ్యమని సభ్యదేశాలు అభిప్రాయ పడ్డాయి. రష్యా, చైనా వంటి దేశాలు ఈ దాడులను తీవ్రంగా ఖండించగా, యూరోపియన్ దేశాలు పరిస్థితి అదుపు తప్పకూడదని హెచ్చరించాయి. ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి శాంతి సాధనకే ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అయితే భద్రతా మండలిలో శాశ్వత సభ్యదేశాల మధ్య ఉన్న విభేదాలు ఏకాభిప్రాయ నిర్ణయానికి అడ్డంకిగా నిలుస్తున్నాయి.

గల్ఫ్ ప్రాంత దేశాలు అత్యవసరంగా సమావేశ మవడం పరిస్థితి తీవ్రతను స్పష్టంగా తెలియ జేస్తోంది. సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతర్, కువైట్ వంటి దేశాలు తమ భూభాగం సంగ్రామ రంగంగా మారుతుందేమోనని ఆందోళన చెందుతు న్నాయి. హోర్ముజ్ సముద్ర మార్గం ప్రపంచ చమురు రవాణాకు కీలక జీవనాధారం. ప్రపంచ చమురు సరఫరాలో పెద్ద భాగం ఈ మార్గం ద్వారా సాగుతుందని అంచనాలు చెబుతున్నాయి. అక్కడ సైనిక ఘర్షణలు ఉద్ధృతమైతే ప్రపంచ ఇంధన సరఫరా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటుంది. ఇప్పటికే చమురు ధరల్లో పెరుగుదల సూచనలు కనిపిస్తున్నాయి.

జర్మనీ, బ్రిటన్ వంటి దేశాలు అమెరికాకు మద్దతుగా నిలిచే అవకాశమున్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి. అయితే ప్రత్యక్ష సైనిక ప్రవేశంపై యూరోపియన్ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. మరోవైపు రష్యా, చైనా ఈ దాడులను ఆధిపత్య రాజకీయాల ప్రతిబింబంగా విమర్శిస్తున్నాయి. ఉక్రెయిన్ సంగ్రామం కారణంగా ఇప్పటికే పాశ్చాత్య దేశాలతో విభేదాలు ఉన్న రష్యా, ఈ సందర్భాన్ని వ్యూహాత్మకంగా వినియోగించుకునే అవకాశముంది.

మూడవ ప్రపంచ సంగ్రామం సంభవిస్తుందా అన్న ప్రశ్న ఇప్పుడు గంభీరంగా వినిపిస్తోంది. ఒకవేళ అమెరికా-ఇజ్రాయిల్-యూరోపియన్ దేశాలు ఒకవైపు, ఇరాన్‌కు మద్దతుగా రష్యా-చైనా మరోవైపు నిలిస్తే ప్రపంచం రెండు శిబిరాలుగా విడిపోయే ప్రమాదం ఉంది. ఆధునిక సంగ్రామ స్వరూపం కేవలం భూయుద్ధం తో పరిమితం కాదు. క్షిపణి దాడులు, మానవ రహిత యంత్ర వాహనాల వినియోగం, సమాచార యుద్ధం, ఉపగ్రహ వ్యవస్థల విధ్వంసం, ఆర్థిక ఆంక్షలు- ఇవన్నీ సమాంతరంగా జరుగుతాయి. అణు ఆయుధాల వినియోగం అనే భయానక అంశం ప్రపంచాన్ని కుదిపేస్తోంది. అణు సంగ్రామం జరిగితే మానవజాతి, పర్యావ రణం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు తిరుగులేని నష్టం సంభవిస్తుంది.

ప్రపంచ ఇంధన మార్కెట్లపై ఈ సంగ్రామ ప్రభావం అత్యంత తీవ్రమైనదిగా ఉంటుంది. చమురు ధరలు పెరిగితే రవాణా వ్య యం, ఉత్పత్తి వ్యయం పెరుగుతాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలు ద్రవ్యోల్బణంతో ఇబ్బందులు ఎదుర్కొంటాయి. అంతర్జాతీయ వాణిజ్యం మందగిస్తుంది. మూలధన ప్రవాహాలు క్షీణిస్తాయి. ఈ ప్రభావాలు సంగ్రామంలో ప్రత్యక్షంగా పాల్గొనని దేశాలకూ తాకుతాయి.



భారత దేశానికి ఈ సంక్షోభం నుంచి మినహాయింపు ఉండదు. భారత్ తన చమురు అవసరాల్లో గల్ఫ్ దేశాలపై ఎక్కువగా ఆధార పడుతోంది. చమురు ధరల పెరుగుదల భారత ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడిని పెంచుతుంది. విదేశీ మారక నిల్వల వినియోగం పెరుగుతుంది. గల్ఫ్ ప్రాంతంలో పనిచేస్తున్న లక్షలాది భారతీయుల భద్రత ప్రశ్నార్థక మవుతుంది. అవసరమైతే వారిని సురక్షితంగా తరలించాల్సిన పరిస్థితి తలెత్తవచ్చు. ఎరువులు, సహజ వాయువు, పెట్రో ధరలను రసాయనాల సరఫరాపై కూడా ప్రభావం పడుతుంది. ఇరాన్ అంతర్గత పరిస్థితులు కూడా ఈ సంగ్రామ వాతావ రణంతో సంక్లిష్టంగా మారుతున్నాయి. ఆర్థిక ఆంక్షలతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న దేశానికి సైనిక ఒత్తిడి మరింత భారంగా మారుతుంది. అయితే విదేశీ దాడులు దేశంలో జాతీయత భావాన్ని పెంచి ప్రభుత్వానికి మద్దతు కూడగట్టే అవకాశమూ ఉంది. అమెరికా-ఇజ్రాయిల్ చర్యలను తమ సార్వభౌమాధికారంపై దాడిగా చిత్రీకరిస్తూ ఇరాన్ ప్రజలను సమీకరించే ప్రయత్నం జరుగుతోంది.

సమగ్రంగా పరిశీలిస్తే ఈ సంక్షోభం కేవలం ప్రాంతీయ ఘర్షణ మాత్రమే కాదు; ప్రపంచ శక్తి సమీకరణాలను ప్రభావితం చేసే పరిణామం. అణు వ్యాప్తి నిరోధక విధానాల భవిష్యత్తు, అంతర్జాతీయ దౌత్య వ్యవస్థ విశ్వసనీయత, ఇంధన భద్రత... ఈ అంశాలన్నీ దీనితో ముడిపడి ఉన్నాయి. మూడవ ప్రపంచ సంగ్రామం అనేది అత్యంత దుర్భర పరిణామం. అది జరిగితే మానవ నాగరికతకే ముప్పు. అందువల్ల ప్రపంచ నాయకులు వివేకంతో వ్యవహరించి చర్చల ద్వారానే శాశ్వత శాంతిని సాధించాలి. శక్తి ప్రదర్శన కంటే పరస్పర గౌరవం, ప్రతీకారం కంటే సంభాషణ, ఆధిపత్యం కంటే సహకారం... ఇవే స్థిరమైన శాంతికి మార్గదర్శ కాలు. ప్రపంచం యుద్ధ అంచున నిలవకుండా, శాంతి మార్గంలో ముందుకు సాగాలని మానవజాతి ఆకాంక్షిస్తోంది.

వ్యాసకర్త సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్.

## ఖమేనీ హత్య కోసం ఇజ్రాయిల్ నిరంతర నిఘా

### - ఏఐ టూల్స్, అల్గారిథమ్స్‌ను ఉపయోగించినట్లు ప్రచారం
### - కమేనీ కదలికలను గుర్తించి... పక్కాగా బాంబింగ్

(ప్రజాలక్ష్యం బ్యూరో)



వాషింగ్టన్, మార్చి 3 : ఆధునిక యుద్ధవిద్యలో పర్చడంలో అమెరికా-ఇజ్రాయెల్ విజయం ముఖ్యంగా పక్కా ప్లాన్‌తో దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ ఎక్కడ ఉంటారు..? ఎవరిని కలుస్తున్నారు..? ప్రాణానికి ఏదైనా హాని ఉంటే ఎక్కడికి వెళ్తారన్న ప్రతి సునిశితంగా అధ్యయనం చేశాయని వెల్లడించాయి. న్నతాధికారుల్ని కూడా ట్రాక్ చేసినట్లు తెలుస్తోంది. గురించి కూడా అంతే బాగా తెలుసు అని ఆ వర్గాలు ఇప్పుడు పక్కాగా సమాచార సేవకరణ, దానిని అమలు సాధించాయని విదేశీ వార్తా సంస్థలు చెబుతున్నాయి. ఖమేనీ అంతమొందించడం సంచలనం సృష్టించింది. ఇతరులతో ఎలా కమ్యూనికేట్ అవుతారు..? తన విషయాన్ని యూఎస్, ఇజ్రాయెల్ నిఘా వర్గాలు ఆయనతో సమావేశమయ్యే రాజకీయ, మిలిటరీ ఉ మాకు జెరూసలెం గురించి ఎంత తెలుసో.. టెహ్రాన్ పేర్కొనడం గమనార్హం. ఎప్పటికప్పుడు సేకరించిన సమాచారాన్ని ఒక క్రమంలోకి తీసుకువచ్చేందుకు ఇజ్రాయెల్ ఏఐ టూల్స్, అల్గారిథమ్స్‌ను ఉపయోగించిందని అంటున్నారు. కొన్నేళ్లక్రితమే సుప్రీంలీడర్‌ను తమ టార్గెట్‌లో పెట్టుకొన్న ఇజ్రాయెల్.. ఆయన కదలికలను పసిగట్టేందుకు ఇరాన్ ట్రాఫిక్ కెమెరా నెట్‌వర్క్, మొబైల్ ఫోన్ సిస్టమ్స్‌ను హ్యాక్ చేసిందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. రాజధాని నగరం టెహ్రాన్‌లోని అన్ని ట్రాఫిక్ కెమెరాలు ఏళ్లపాటు హ్యాకింగ్‌కు గురయ్యాయని ఇజ్రాయెల్ నిఘా విభాగంలో పనిచేసిన అధికారులు వెల్లడించారు. ఆ ఫుటేజీని ఎప్పటికప్పుడు ఎన్‌క్రిప్ట్ చేసి, స్వదేశానికి తెప్పించుకున్నట్లు పేర్కొన్నారు. టెహ్రాన్‌లోని పెస్టర్ స్ట్రీట్ సమీపంలోని సుప్రీంలీడర్‌కు చెందిన కాంపౌండ్‌లో రోజూవారీ కార్యకలాపాలను, ఖమేనీ వ్యక్తిగత భద్రతా సిబ్బంది వాహనాలను పార్క్ చేసిన ప్రదేశాలను ఒక కెమెరాతో నెతన్యాహు ప్రభుత్వం నిత్యం గుర్తించేదని ఆ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇక, ఈ ఫిబ్రవరి 28న కూడా అత్యంత కచ్చితత్వంతో ఖమేనీని టార్గెట్ చేయడానికి ఈ డేటానే ఉపయోగపడింది. ఇరాన్‌లో ప్రతి శుక్రవారం ప్రభుత్వ సెలవుదినం. ఖమేనీ ప్రతీ వారం ప్రారంభం రోజున శనివారం తన అధికారిక నివాసంలో కీలక ప్రభుత్వ పెద్దలు, సైనిక ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించేవారు. టెహ్రాన్ నగర నడిబొడ్డులోని ఒక ప్రభుత్వ ప్రాంగణంలో ఇరాన్ అత్యున్నత స్థాయి అధికారుల సమావేశం ఉంటుందని ఇజ్రాయెల్ తెలుసుకొని దాడి చేసింది. ఈ వ్యవహారంలో అమెరికా నిఘా సంస్థ సీఐఏ ఇచ్చిన సమాచారం కూడా కీలకమైంది. ఇదిలాఉంటే.. శనివారం ఇజ్రాయెల్-యూఎస్‌ఏ చేపట్టిన సంయుక్త ఆపరేషన్‌లో ఇరాన్‌పై సైబర్ దాడులు కూడా జరిగాయని జెరూసలెం పోస్ట్ వెల్లడించింది. అత్యంత కీలకమైన మౌలిక సదుపాయాలతో పాటు సెక్యూరిటీ కమ్యూనికేషన్ సిస్టమ్స్, అధికారిక మీడియా సంస్థల సైట్లు హ్యాక్ అయ్యాయి. దాంతో ఇంటర్నెట్ కనెక్టివిటీ పడిపోయిందని ఆ మీడియా కథనం పేర్కొంది. ఇరాన్ ప్రతిదాడుల సామర్థ్యాన్ని దెబ్బతీసేందుకే ఈ సైబర్ అటాక్ చేసినట్లు తెలుస్తోంది.

## హర్మ్మజ్ జలసంధి మూసివేత

### - ఎవరైనా వెళితే పేల్చేస్తాం - ఇరాన్ వార్నింగ్‌తో చమురు సంక్షోభం

(ప్రజాలక్ష్యం బ్యూరో)

టెహ్రాన్, మార్చి 3 : పశ్చిమాసియాలో ఘర్షణ వాతావరణం రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. ఇప్పటికే ముడిచమురు ధరలు పెరుగుతుండగా.. ఇరాన్ ఇచ్చిన వార్నింగ్ మరింత ఆందోళనకు దారితీస్తోంది. హోర్ముజ్ జలసంధి ని మూసివేశామని, నౌకలు దానిని దాటడానికి ప్రయత్నిస్తే నిప్పు పెడతామని హెచ్చరించింది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్, నౌకాదళ సిబ్బంది ఆ పని చేస్తారని ఇరాన్ హెచ్చరించింది. హోర్ముజ్ జలసంధిని మూసివేశామని, ఆ జలసంధి గుండా వెళ్లేందుకు ప్రయత్నించే ఏ నౌకపైనైనా కాల్పులు జరుపుతామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కమాండర్ ఇన్ చీఫ్ సీనియర్ సలహాదారు ఇబ్రహీం జబారీ ప్రకటించారు. నౌకలు ఈ జలసంధిని దాటడానికి ప్రయత్నిస్తే దాడి చేస్తామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ పేర్కొన్నట్లు అధికారిక మీడియా వెల్లడించింది. ప్రపంచ ఆయిల్ రవాణాలో ఐదవ వంతు ఈ జలసంధి ద్వారానే సరఫరా అవుతుంది. దీంతో ఈ చర్య చమురు ధరలు పెరిగే అవకాశం ఉందని కెప్లర్ గణాంకాలు హెచ్చరించిన సంగతి తెలిసిందే. హోర్ముజ్.. ప్రపంచ ఇంధనానికి జీవనాడి వంటిది. కేవలం కొన్ని కిలోమీటర్ల వెడల్పు ఉన్న ఈ ప్రదేశం నుంచి ప్రపంచం వాడే చమురులో ఐదోవంతు రవాణా అవుతోంది. ఈ జలసంధిలో ఏర్పడే ఏ అంతరాయం అయినా ప్రపంచ వాణిజ్యాన్ని గజగజ లాడిస్తుంది. ఈ మార్గం నుంచి వచ్చే చమురు, ఎల్‌ఎన్‌జీ అత్యధికంగా భారత్, చైనా, దక్షిణ కొరియా, జపాన్ దేశాలకు ఎగుమతి అవుతోంది. ఇంతటి కీలకమైన జలసంధి మూసుకుపోతే.. రవాణా, బీమా ఖర్చులు గణనీయంగా పెరుగుతాయి. ఇప్పటికే ఆ ప్రభావం కనిపిస్తోంది.

## సంపూర్ణ చంద్రగ్రహణంతో ఆలయాల మూసివేత

### - నేడు వేకువ జామున తిరిగి దర్శనాలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద/తిరుపతి, మార్చి 3 : సంపూర్ణ చందగ్రహణం కారణంగా మంగళవారం ఆలయాలు మూతపడ్డాయి. సంప్రదాయ ఆచారాలను అనుసరిస్తూ రెండు తెలుగు రాష్ట్రల్లోనూ ప్రముఖ దేవాలయాలను తాత్కాలికంగా మూసేశారు. గ్రహణం ముగిసిన అనంతరం శుద్ధి కార్యక్రమాల తర్వాత మాత్రమే భక్తులకు దర్శనానికి అనుమతి ఇస్తారు. చందగ్రహణం కారణంగా తిరుమల తిరుపతి దేవస్థానాల పరిధిలోని దాదాపు ఆలయాలన్నీ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7.30 గంటలకు వరకు మూసివేసారు. అనంతరం ఆలయ శుద్ధి కార్యక్రమాలు పూర్తి చేసిన తర్వాత రాత్రి 8.30 గంటల నుంచి భక్తులకు దర్శనాలు పునఃప్రారంభం అవుతాయి. గ్రహణం నేపథ్యంలో టీటీడీ నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ కేంద్రాలు కూడా తాత్కాలికంగా నిలిపివేశారు. చందగ్రహణం కారణంగా దర్శన సమయాల్లో మార్పులు చోటుచేసు కున్నందున, భక్తులు ముందస్తుగా సమాచారం తెలుసుకుని తమ ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. అలాగే, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలం, సింహాచలం, ద్వారకా తిరుమల అత్యంత ప్రసిద్ధ హిందూ పుణ్యక్షేత్రాలతో సహా పలు ఆలయాలు మూసివేశారు. సంపూర్ణ చందగ్రహణం సందర్భంగా తెలంగాణలోని పలు ప్రముఖ ఆలయాలను తాత్కాలికంగా మూసేశారు. జగిత్యాల జిల్లాలోని ధర్మపురి లక్ష్మి నరసింహస్వామి ఆలయాన్ని ఉదయం 9 గంటలకు మూసేశారు. తిరిగి బుధవారం ఉదయం సంప్రోక్షణ, అభిషేక పూజల తర్వాత భక్తులకు దర్శనం కల్పిస్తారు. నిర్మల్ జిల్లా బాసర ఆలయాన్ని కూడా మూసివేశారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం, శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంతో పాటు అనుబంధ ఆలయాలు ఉదయం 6.15 నుంచి సాయంత్రం 7.15 వరకు మూసివేసారు. అనంతరం పుణ్యాహవాచనం, సంప్రోక్షణ నిర్వహించి భక్తులకు దర్శనం అనుమతిస్తారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ప్రధాన ఆలయంతో పాటు ఉప ఆలయాలు కూడా మూసివేసారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు ఆలయం తెరిచి శుద్ధి, సంప్రోక్షణ నిర్వహించి, అనంతరం నిత్యపూజల తర్వాత దర్శనాలు ప్రారంభిస్తారు. ఓదెల మల్లిఖార్జున స్వామి ఆలయాన్ని గ్రహణం కారణంగా మూసి వేసారు. ఉదయం సంప్రోక్షణ, అభిషేక పూజల అనంతరం భక్తులకు అనుమతి ఇస్తారు. కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి ఆలయాన్ని ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 7.30 వరకు మూసివేసారు. ఆలయ శుద్ధి, సంప్రోక్షణ తర్వాత భక్తులకు దర్శనం కల్పిస్తారు. భక్తులు ఆలయ సమయాలను గమనించి దర్శనానికి రావాలని అధికారులు సూచిస్తున్నారు.

# నిబద్ధతకు నిరాదరణేనా ?

## - 'పుచ్చకాయల' సేవలకు గుర్తింపు ఏది ?

## - కష్టకాలంలో జెండా మోసినా... పదవుల పంపకంలో ప్రాధాన్యత శూన్యం...

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



సత్తుపల్లి, మార్చి 3 : ఖమ్మం జిల్లా వేంసూరు మండల కాంగ్రెస్ రాజకీయాల్లో పుచ్చకాయల సోమిరెడ్డి పేరు తెలియని వారుండరు. సామాన్య కార్యకర్తగా ప్రస్థానం మొదలుపెట్టి, జిల్లా ఉపాధ్యక్షుడి స్థాయికి ఎదిగినా... నేడు పార్టీ అధికారంలోకి వచ్చాక ఆయనకు దక్కాల్సిన గౌరవం దక్కడం లేదని స్థానిక క్రింద స్థాయి కార్య కర్తలు మండిపడుతున్నారు. పార్టీ అధికారంలో లేనప్పుడు, ఊరూరా తిరుగుతూ జెండా పట్టి కాంగ్రెస్ ఉనికిని కాపాడిన సోమిరెడ్డిని నేడు అధిష్టానం విస్మరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిరుపేద స్థితిలో ఉన్నప్పటికీ ఏనాడూ పదవుల కోసం ఆశపడకుండా, కార్యకర్తలను కలుపుకుంటూ మండలంలో పార్టీని ముందుకు నడిపిన ఘనత సోమిరెడ్డిదే. అయితే, ఇటీవల పార్టీలోజూనియర్ లకు పదవులు కట్టబెడుతున్నారు. పుచ్చకాయల సోమిరెడ్డి లాంటి నిబద్ధత గల నాయకుడిని పక్కన పెట్టడం వెనుక అంతర్యం ఏమిటని కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా ఆయన ఇటీవల తీవ్ర ప్రమాదానికి గురైనప్పుడు కూడా పార్టీ నుంచి ఆశించిన స్పందన లేకపోవడం, అండగా ఉంటామని చెప్పిన నేతలు మొహం చాటేయడంపై అనుచరులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేంసూరు మండలంలో పార్టీ కార్యక్రమాలు చేయాలంటే ముందుగానే ఆయా గ్రామాల ముఖ్య కార్యకర్తలకు ముందుగా సమాచారం ఇచ్చి అందరినీ కలుపుకొని పార్టీ ఆదేశాలు ప్రకారం కార్యక్రమాలు చేసేవారు. పార్టీ అధికారములో లేనప్పుడు ఎంతో కష్టంగా ఉన్నప్పటికీ పార్టీ కార్యక్రమాలు చేయడములో ఏనాడు ఆయన వెనుకంజ వేయలేదు. పార్టీపేరుచెబితే పారి పోయే వారికి నేడు కొత్త కొత్త పదవులు ఇస్తున్నారని మండలకార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేంసూరు మండలంలో కాంగ్రెస్ జెండా రెపరెపలాడుతోందంటే అందులో సోమిరెడ్డి పాత్ర ఎంతో ఉందని, అలాంటి నాయకుడికి ఉన్నతమైన పదవి కట్టబెట్టడం ద్వారానే అసలైన కార్యకర్తలకు న్యాయం జరుగుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రతిపక్ష పార్టీకి ఏనాడు లొంగలేదు, ఏనాడు భయపడలేదు, తనకు ఆర్థిక బలం లేనప్పటికీ క్రింది స్థాయి కార్యకర్తలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకునేవారని కార్యకర్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా జిల్లా, రాష్ట్ర స్థాయి నేతలు స్పందించి, పార్టీకి రుణపడి ఉన్న పుచ్చకాయల సోమిరెడ్డికి సముచిత స్థానం కల్పించాలని కాంగ్రెస్ శ్రేణులు డిమాండ్ చేస్తున్నాయి.

# మతసామరస్యాన్ని చాటుతూ లౌకిక విలువలను కాపాడుకుందాం

## - ప్రజల మధ్య ఐక్యత భావం పెంచుతున్న 'ఇఫ్తార్'.

## - 'ఇఫ్తార్' విందులో కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు.

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, మార్చి 3 : మతసామరస్యాన్ని చాటుతూ లౌకిక విలువలను కాపాడుకోవడం మనందరి బాధ్యతని, అందుకు పండుగలు దోహదపడతాయని భద్రాద్రి జిల్లా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని జామ మసీదులో ఇఫ్తార్ కార్యక్రమానికి అయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. ప్రత్యేక నమాజు అనంతరం ఉపవాస దీక్ష విరమించిన ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో కూనంనేని మాట్లాడుతూ రంజాన్ మాసంలో నిర్వహిస్తున్న ఇఫ్తార్ విందు కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యతాభావం పెంచుతున్నాయని అన్నారు. పవిత్ర రంజాన్ మాసం సమాజంలో శాంతిని నెలకొల్పుతుందని, ప్రజల, కులాలు, మతాల మధ్య గద్వేషాలను దూరం చేస్తుందన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు చేపట్టిన కఠినమైన ఉపవాస దీక్షలు వారి కుటుంబాలతో పాటు సమాజంలో శాంతిని, ప్రేమను నెలకొల్పడానికి, సోదర భావం, దాతృత్వాన్ని పెంచడానికి దోహదపడుతుందని, ప్రజాస్వామ్య దేశంలో కులమతాలకతీతంగా మతసామరస్యాన్ని చాటి చెబుతోందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికోసం, ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులకు తాను చేస్తున్న కృషికి ప్రజలు, అధికారులు సహకరించి మరింతగా ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కె.సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ



సభ్యులు ముత్యాల విశ్వనాథం, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, ముస్లిం మైనార్టీ నాయకులు నయీమ్ ఖురేషి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచంద్రరావు ఉప్పుశెట్టి రాహుల్, కార్పొరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వరరావు, గుర్రం వెంకటేశ్వర్లు, సీపీఐ నాయకులు ఇట్టి వెంకట్రావు, గౌతమి కృష్ణ, వల్లపు యాకయ్య, వైస్ గిరి, ఉప్పుశెట్టి రాకేష్, వెంకటరత్నం, కర్రు రమేష్, మస్తాన్, ఆదినారాయణ, దినేష్, రామాచారి, అల్లి వెంకటేశ్వర్లు, బీమా నాయక్, వెంకటేశ్వర్లు, లాల్ పాషా, మసీదు పెద్దలు ఫయాజ్, అభిద్, అక్బర్, మస్తాన్, గౌస్, కృర్షిద్, ముత్తు జాలి, కురిషి, రషీద్, రెహమాన్, గౌస్, అంజద్, పాల్గొన్నారు.

# నేడు జైలు నుంచి బాల్క సుమన్ విడుదల



## ర్యాలీ కోసం బిఆర్ఎస్ నేతల సన్నాహాలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మంచిర్యాల, మార్చి 3 : క్యాతన్‌పల్లి మున్సిపల్ ఎన్నిక సందర్భంగా కేసులతో జైలులో ఉన్న మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ , బీఆర్ఎస్ నాయకులు బుధవారం విడుదల కానున్నారు. బెయిల్ పిటిషన్ పై సోమవారం వాదనలు విన్న జిల్లా సెషన్స్ కోర్టు సోమవారం బెయిల్ మంజూరు చేసింది. అయితే చెన్నూర్ కోర్టులో ఉన్న మరో కేసులో పీటీ వారెంట్ ఫిటిషన్‌పై విచారణను ఆ కోర్టు ఈ నెల 5వ తేదీకి వాయిదా వేసింది. బాల్కసుమన్‌కు ఈ కేసులోనూ బెయిల్ రావాల్సి ఉండటంతో ఐదో తేదీ తర్వాతే ఆయన జైలు నుంచి బయటికి వస్తారని అంతా భావించారు. ఈ నేపథ్యంలో మంగళవారం చెన్నూర్ కోర్టులో పీటీ వారెంట్ ఫిటిషన్ పై విచారణ జరపాలని బాల్కసుమన్ అడ్వొకేట్లు మరో ఫిటిషన్ వేయడంతో కోర్టు విచారణను స్వీకరించింది. బాల్కసుమన్ తరుపు న్యాయవాదులు వాదనల అనంతరం పెట్టిన కేసు బెయిలెబుల్ అఫెన్స్ కావడంతో బెయిల్ మంజూరు చేసింది. దీంతో బాల్కసుమన్ సహా ఆయనతో పాటు అరెస్టయిన బీఆర్ఎస్ నాయకులు జైలు నుంచి విడుదల కానున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే అన్ని ఫార్మాలిటీస్ పూర్తి చేశామని, రేపు ఉదయం 7 గంటలకు బాల్కసుమన్ జైలు నుంచి బయటికి వస్తారని ఆయన తరుపు న్యాయవాదులు తెలిపారు. బాల్కసుమన్ బయటికి రానున్న నేపథ్యంలో చెన్నూర్ లో బీఆర్ఎస్ నాయకులు సంబురాలు చేసుకున్నారు. జైలు నుంచి బయటికి వచ్చిన బాల్కసుమన్ సహా ఇతర బీఆర్ఎస్ నాయకులను వందలాది వాహనాల్లో ర్యాలీగా క్యాతన్‌పల్లికి తీసుకురానున్నారు. వచ్చే మార్గంలో మంచిర్యాల జిల్లా పరిధిలోని ప్రధాన రహదారి మార్గాల్లోని పలు అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేస్తూ, మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి సుమన్ పూలమాల వేస్తారని అక్కడి నుంచి నేరుగా క్యాతన్‌పల్లిలోని తన నివాసానికి చేరుకుంటారని బీ ఆర్ఎస్ నాయకులు తెలిపారు.

# విద్యుత్ వినియోగంలో అరుదైన మైలురాయి

## - వేసవి ప్రారంభంలోనే 18,139 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్

## - పటిష్ట విద్యుత్ విధానం అవలంబించడంతోనే సాధ్యం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మార్చి 3 : వేసవి మొదలై అప్పుడే ఎండలు ముదురుతున్నాయి. గత మూడు రోజులుగా ఎండల తీవ్రత క్రమంగా పెరుగుతోంది. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రం విద్యుత్ వినియోగంలో మరో అరుదైన మైలురాయిని అధిగమించింది. మార్చి 3వ తేదీ మంగళవారం ఉదయం 11:01 గంటలకు రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా 18,139 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదైంది. వేసవి కాలం ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతున్న తరుణంలో, ఇంతటి భారీ స్థాయిలో విద్యుత్ అవసరం ఏర్పడినప్పటికీ, ఎక్కడా చిన్నపాటి అంతరాయం కూడా లేకుండా సరఫరాను కొనసాగించి రాష్ట్ర విద్యుత్ సంస్థలు తమ సమర్థతను చాటుకున్నాయి. గతేడాది మార్చిలో నమోదైన 15,623 మెగావాట్ల రికార్డును, అలాగే గత నెలలో నమోదైన గణాంకాలను ఈ కొత్త రికార్డు వెనక్కి నెట్టేసింది. రాష్ట్రంలో పారిశ్రామికాభి వృద్ధి, ఐటీ రంగ విస్తరణతో పాటు ఎత్తిపోతల పథకాలు, వ్యవసాయానికి అందిస్తున్న నిరంతర ఉచిత విద్యుత్ సరఫరా ఈ భారీ డిమాండ్‌కు ప్రధాన కారణాలని అధికారులు విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా సాగునీటి అవసరాల కోసం రైతాంగం మోటార్లను పెద్ద ఎత్తున వినియోగిస్తుండటం, పట్టణ ప్రాంతాల్లో ఏసీల వాడకం పెరగడం వంటి అంశాలు విద్యుత్ వినియోగాన్ని గరిష్ట స్థాయికి చేర్చాయి. భౌగోళికంగా చిన్న రాష్ట్రమైనప్పటికీ, విద్యుత్ డిమాండ్ విషయంలో తెలంగాణ ఇప్పుడు రాజస్థాన్ , మధ్యప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రాలతో పోటీ పడుతోంది. పంజాబ్, హర్యానా వంటి పారిశ్రామిక రాష్ట్రాల కంటే తెలంగాణలో డిమాండ్ ఎక్కువగా ఉండటం ఇక్కడి ఆర్థిక పురోగతికి నిదర్శనమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ చారిత్రాత్మక ఘనతపై ఉప ముఖ్యమంత్రి , ఇంధనశాఖ మంత్రి భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేశారు. రికార్డు స్థాయి డిమాండ్‌ను సమర్థవంతంగా హ్యాండిల్ చేసిన ట్రాన్స్‌కో, జెన్‌కో అధికారులను , సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రం ఎంతటి భారీ డిమాండ్‌నైనా తట్టుకునేలా సబ్-స్టేషన్ల పటిష్ఠత, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు వంటి ముందస్తు చర్యలు తీసుకోవడం వల్లే ఇది సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. రానున్న ఏప్రిల్, మే నెలల్లో విద్యుత్ డిమాండ్ 19,000 మెగావాట్లను దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామని, దానికి తగినట్లుగా 'సమ్మర్ యాక్షన్ ప్లాన్'తో ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు.

# భద్రాద్రి జిల్లాలో హెల్త్ మిషన్-100 డేస్ క్యాంపెయిన్

## - ప్రజలు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి - జిల్లా కలెక్టర్, జిల్లా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మార్చి 3 : భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా ప్రజల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా ప్రత్యేకంగా రూపొందించిన "హెల్త్ మిషన్ -- 100 డేస్ క్యాంపెయిన్" కార్యక్రమాన్ని ఈ నెల 4వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని లిభద్రాద్రి కొత్తగూడెం జిల్లాలిలో జిల్లా కలెక్టర్ మేజిస్ట్రేట్ మరియు జిల్లా వైద్య అండ్ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో దశల వారీగా అమలు చేయనున్నారు. మార్చి 4 నుంచి మార్చి 31 వరకు మొదటి దశలో జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో శిశు వైద్యుడు, స్త్రీ రోగ నిపుణుడు, జనరల్ ఫిజీషియన్, దంత వైద్యుడు, కంటి నిపుణుడు, ఎముకల వైద్య నిపుణుడు సేవలు అందుబాటులో ఉంటారు. అలాగే అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలను ఆర్‌బీఎస్‌కే బృందాలు సందర్శించి విద్యార్థులకు స్త్రీ రోగ నిపుణుడు లేదా ఫిజీషియన్, దంత వైద్యుడు, కంటి నిపుణుడు మూడు విభాగాల నిపుణుల ద్వారా స్క్రీనింగ్, కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఏప్రిల్ 1నుంచి15 వరకు రెండవ దశలో స్క్రీనింగ్, చికిత్స, రిఫరల్, ఫాలోఅప్ కార్యక్రమాలుచేపడతారు. జిల్లాలో క్యాన్సర్ రిజిస్ట్రీ ఏర్పాటుచేసి, డీసీసీసీ ద్వారాక్యాన్సర్ స్క్రీనింగ్, చికిత్స, రిఫరల్, ఫాలోఅప్ సేవలు అందించనున్నారు. ఏప్రిల్ 16 నుంచి మే 15 వరకు మూడవ దశలో సంక్రమణ వ్యాధుల స్క్రీనింగ్‌తో పాటు ప్రజారోగ్య సిద్ధతచర్యలుచేపడతారు. వేసవి దృష్ట్యా హీట్ స్ట్రోక్ రూమ్‌లను ప్రారంభించనున్నారు. మే 16 నుంచి జూన్ 9 వరకు నాలుగవ దశలో అన్ని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎనిమిది స్పెషలిస్ట్ క్లినిక్స్ ఏర్పాటు చేసి, తృతీయ స్థాయి ఆసుపత్రులపై భారం తగ్గించనున్నారు. 100 రోజుల పాటు స్వయం సహాయక సంఘాల మహిళలకు 30 ప్రాథమిక పరీక్షలతో ఆరోగ్య ప్రొఫైలింగ్ నిర్వహించడంతో పాటు, ఆరోగ్య కేంద్రాల ప్రమాణీకరణ (ఐ.పి.హెచ్.ఎస్., ఎన్.క్యూ.ఏ.ఎస్., కాయకల్ప) చేపడతారు. ఈ ప్రత్యేక ఆరోగ్య శిబిరాలను జిల్లా ప్రజలంతా వినియోగించుకుని తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని జిల్లా కలెక్టర్ అండ్ మేజిస్ట్రేట్ అంకిత్ తో పాటు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రజల ఆరోగ్యమే తమ ప్రధాన లక్ష్యమని వారు స్పష్టం చేశారు.

# జింఖానా గ్రౌండ్స్ వద్ద ధర్నా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మార్చి 3 : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ హెచ్‌సీఏకు వ్యతిరేకంగా జింఖానా గ్రౌండ్స్ వద్ద స్పోర్ట్స్ స్టూడెంట్ పెడరేషన్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. క్రీడాకారులకు అన్యాయం చేసి, ప్రైవేటు వ్యక్తులు డబ్బులు దండుకుంటున్నారని ఆరోపించారు. విశాక ఇండస్ట్రీస్‌కు బదిలీ చేసిన రూ. 68.73 కోట్లు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళన కారులను పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు తనపై వస్తున్న ఆరోపణలను హెచ్‌సీఏ అధ్యక్షుడు అమర్నాథ్ ఖండించారు. తాను బాధ్యతలు తీసుకున్న తర్వాత ఏ చెక్కులపైనా సంతకాలు చేయలేదన్నారు. రూ. 68.73 కోట్లు హెచ్‌సీఏ నుంచి కంపెనీకి చెల్లింపులో తన ప్రమేయం లేదన్నారు. తాను బాధ్యతలు తీసుకోకముందే చెల్లింపుల ప్రాసెస్ జరిగిందని చెప్పారు. డబ్బులు చెల్లించాలని కోర్టు ఆదేశించినట్లు అమర్నాథ్ పేర్కొన్నారు.



# భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా ఘనంగా హోలీ వేడుకలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మార్చి 3 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా మంగళవారం హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పిల్లలు మొదలుకొని పెద్దల వరకు అందరూ హోలీ వేడుకల్లో మునిగితేలారు. పరస్పరం రంగులు చల్లుకొని హోలీ సంబరాలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. చంద్రగ్రహణం సందర్భంగా మంగళవారం ఉదయం నుంచి ఆలయాలను మూసివేశారు. సంప్రోక్షణ తర్వాత బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శన సౌకర్యాన్ని కల్పించి తీర్థప్రసాదాలను అందజేయనున్నారు.



# పాపన్నపేట మండలంలో ఘనంగా ఘనంగా హోలీ సంబరాలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, మార్చి 03 : పాపన్నపేట మండలంలో మంగళవారం రోజు హోలీ పండుగ సంబురాలు అంబరానంటాయి. ఈ సందర్భంగా యువతీ, యువకులు, స్నేహితులు, పిల్లలు చిన్నా పెద్ద తేడా లేకుండా ఉత్సాహంగా హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. ఉదయం నుంచే పాపన్నపేట పుర వీదులో, ప్రధాన వీధుల గుండా తిరుగుతూ రంగులు చళ్ళు కుంటు హోలీ పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. స్నేహితులు, పరిచయస్తులు ఒకరి నొకరు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. యువకులు ప్రధాన కూడళ్లలో గుంపులుగా చేరి రంగుల పండుగను ఆనందంగా ఆస్వాదించారు. పింక్, బ్లూ, గ్రీన్ రంగులతో ఒకరినొకరు అలంకరించుకుంటూ సంతోషంగా కేరింతలు కొడుతూ గడిపారు. కొందరు సెల్ఫీలు దిగుతూ మధుర క్షణాలను స్మృతులుగా నిలుపు కున్నారు. సరదాగా రంగులు చల్లుకుంటూ స్నేహబంధాలను మరింత బలపరిచారు. ఇళ్ల వద్ద చిన్నపిల్లలు కూడా నీటి గన్‌లతో రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. మహిళలు ప్రత్యేక వంటకాలు సిద్ధం చేసి కుటుంబ సభ్యులతో కలిసి పండుగను ఆనందంగా గడిపారు. కొన్ని ప్రాంతాల్లో డీజే, సంగీతం మధ్య యువత నృత్యాలతో హోలీ ఉత్సాహాన్ని రెట్టింపు చేశారు. పోలీసులు, సిబ్బంది శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు చేపట్టడంతో ఎవరికి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదు. ప్రజలు పరస్పర గౌరవంతో, స్నేహభావంతో పండుగను జరుపుకోవాలని అధికారులు సూచించారు. మొత్తంగా పాపన్నపేట మండల కేంద్రంలో హోలీ పండుగ ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహిం చుకున్నారు.

# రాజ్యసభకు బిజెపి అధ్యక్షుడు బీహార్ నుంచి ఎంపిక చేసిన బిజెపి

## - మొత్తం 9మంది అభ్యర్థలను ప్రకటించిన పార్టీ

(ప్రజాలక్ష్యం బ్యూరో)

న్యూఢిల్లీ, మార్చి 3 : ఈ నెల16న జరుగనున్న రాజ్యసభ ఎన్నికలకు భారతీయ జనాతా పార్టీ 9 మంది అభ్యర్థుల పేర్లను మంగళవారం నాడు ప్రకటించింది. బిహార్ నుంచి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ పోటీ చేయనున్నారు. బిహార్ నుంచి నితిన్ నబీన్, శివేష్ కుమార్, అస్సాం నుంచి తారేష్ గోవాలా, జోగెన్ మోహన్, ఛత్తీస్‌గఢ్ నుంచి లక్ష్మీవర్మ,-హర్యానా నుంచి సంజయ్ భాటియా, ఒడిశా నుంచి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మన్‌మోహన్ సామల్, సుజీత్ కుమార్,-పశ్చిమబెంగాల్ నుంచి రాహుల్ సిన్హాలను ఎంపిక చేసింది. సంజయ్ భాటియా 2019 నుంచి 2024 వరకూ కర్నాల్ లోక్‌సభ ఎంపీగా ఉన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఆనయ కర్నాల్ నుంచి రికార్డు స్థాయిలో 6,56,142 ఓట్ల అధిక్యంతో గెలిచారు. జోగెన్ మోహన్ ప్రస్తుతం హిమంత బిశ్వా శర్మ ప్రభుత్వంలో రవాణా, హిల్ ఏరియాస్ డవలప్‌మెంట్, కో-ఆపరేషన్ తదితర శాఖలు నిర్వహిస్తున్నారు. తారేష్ గోవాలా అసోంలోని డిబ్రూగఢ్ జిల్లా దులియాజన్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఉన్నారు. శివేష్ కుమార్ ఇంతకుముందు బిహార్‌లోని అజియోన్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా పనిచేశారు. రాహుల్ సిన్హా బీజేపీ పశ్చిమబెంగాల్ విభాగం మాజీ అధ్యక్షుడుగా ఉన్నారు. లక్ష్మి వర్మ ఛత్తీస్‌గఢ్ బీజేపీలో సీనియర్ మహిళా నేతగా ఉన్నారు. పార్టీ రాష్ట్ర విభాగం ఉపాధ్యక్షురాలిగా సేవలందిస్తున్నారు. సుజీత్ కుమార్ గతంలో బిజూ జనతా దళ్ (బీజేడీ) సభ్యుడిగా ఉండేవారు. అయితే 2024లో ఆ పార్టీకి, రాజ్యసభ సీటుకు ఆయన రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ఉప ఎన్నికల్లో అదే స్థానానికి ఆయన పోటీ చేసి తిరిగి ఎన్నికయ్యారు.

# స్థిరంగా బంగారం ధరలు

(ప్రజాలక్ష్యం బ్యూరో)

న్యూఢిల్లీ, మార్చి 3 : అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయ కారణాల నేపథ్యంలో బంగారం, వెండికి డిమాండ్ కొనసాగుతోంది. ఇటీవలి కాలంలో కాస్త స్థిరంగా కొనసాగిన బంగారం, వెండి ధరలు ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల కారణంగా ఒక్కసారిగా పెరిగాయి. యుద్ధం కారణంగా మరింత భారీగా పెరిగే అవకాశముందని అంచనాలు వెలువడుతున్నాయి. మార్చి 3న మంగళవారం ఉదయం 6:30 గంటల సమయంలో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ. 1,70,500 దగ్గర ఉంది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,56,290 దగ్గర ఉంది. ఇక, దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రేటు రూ. 1,70,650కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ. 1,56,440కి చేరుకుంది. మరోవైపు వెండి ధర కూడా స్థిరంగా కొనసాగుతోంది. మూడు లక్షల రూపాయల మార్క్‌ను దాటేసింది.

# నైని బొగ్గు గనికి నాలుగు జాతీయ భద్రతా పురస్కారాలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మార్చి 3 : సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సిసిఎల్) కు చెందిన నైని బొగ్గు గని ప్రతిష్ఠాత్మకంగా నాలుగు అవార్డులు సాధించి మరోసారి సంస్థకు కీర్తి తెచ్చింది. 2025-26 సంవత్సరానికి గాను నిర్వహించిన వార్షిక మైన్స్ సేఫ్టీ ఫోర్ట్‌నైట్ బహుమతుల ప్రదానోత్సవం మార్చి 1, 2026న సంబల్పూర్లోని మహానది కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ ప్రధాన కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని భువనేశ్వర్ రీజియన్-జోన్-2 డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేడుకలో నైని గని సి-గ్రూప్ (కాన్షియస్‌నెస్, పబ్లిసిటీ అండ్ (ప్రాపగాండా) విభాగంలో మొత్తం రెండో బహుమతి, జనరల్ సేఫ్టీ పబ్లిసిటీ విభాగంలో మొదటి బహుమతి, 12వ సేఫ్టీ కాన్ఫరెన్స్ అమలు అండ్ చట్టబద్ధ రికార్డులు విభాగంలో మొదటి బహుమతి, హాల్ రోడ్ అండ్ డస్ట్ సప్రెషన్ విభాగంలో మొదటి బహుమతి అవార్డులను కైవసం చేసుకుంది. ఈ ఘనత నైని గనిలోని ప్రతి కార్మికుడు, అధికారి, ఫ్రంట్‌లైన్ సిబ్బంది ప్రదర్శించిన అంకితభావం, క్రమశిక్షణ, భద్రతకే ప్రథమ



ప్రాధాన్యం ఇచ్చే దృక్పథానికి నిదర్శనంగా నిలిచింది. ఉత్పాదకతతో పాటు భద్రత, స్థిరత్వం, బాధ్యతాయుత గనుల నిర్వహణలో నైని గనిని ఆదర్శంగా తీర్చిదిద్దాలన్న సింగరేణి సంస్థ నిబద్ధతను ఈ విజయం మరింత బలపరిచింది. ఈ సందర్భంగా సింగరేణి యాజమాన్యం నైని గని బృందానికి అభినందనలు తెలియజేస్తూ, ఒడిశాలో సురక్షిత గనుల నిర్వహణలో నైని కొత్త ప్రమాణాలు నెలకొల్పుతోందని ప్రశంసించింది.

# బహ్రాయిన్‌లో చిక్కుకున్న తెలుగువారు

### - వారిని రప్పించాలంటూ కేంద్రమంత్రి రామ్మోహన్‌కు వినతి
### - లేఖ రాసిన విజయనగరం ఎంపి కలిశెట్టి

(ప్రజాలక్ష్యం బ్యూరో)

న్యూఢిల్లీ, మార్చి 3 : పశ్చిమాసియా దేశాల్లో యుద్ధ వాతావరణం కారణంగా బహ్రెయిన్ విమానాశ్రయంలో చిక్కుకుపోయిన 65 మంది తెలుగువారిని స్వదేశానికి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు.. పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడిని కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం కేంద్రమంత్రికి లేఖ రాశారు. అక్కడ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 39 మంది, తెలంగాణకు చెందిన 26 మంది చిక్కుకుపోయారంటూ వారి పేర్లు, పాస్‌పోర్టు వివరాలు, ఫోన్ నంబర్లను కేంద్రమంత్రికి పంపిన లేఖతో జతచేశారు. బాధితుల్లో వర్కర్లు, విద్యార్థులు, పర్యటకులు ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం నెలకొన్న యుద్ధ వాతావరణం కారణంగా విమానాల రాకపోకలు నిలిచిపోయి వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అందువల్ల కేంద్ర ప్రభుత్వం స్పందించి వారిని ఆదుకోవాలని కోరారు. విదేశాంగ శాఖ, బహ్రెయిన్‌లోని భారత రాయబార కార్యాలయం అధికారులతో మాట్లాడి వారిని క్షేమంగా వెనక్కి రప్పించే ప్రయత్నం చేయాలని అప్పలనాయుడు కోరారు.

# పరస్పర దాడులతో దద్దరిల్లుతున్న పశ్చిమాసియా

### - ఇజ్రాయిల్ దాడులకు ప్రతిగా ఇరాన్ ప్రతిదాడులు - టెహ్రాన్ లక్ష్యంగా ఇజ్రాయిల్ బాంబుల దాడి
### - కొత్త రక్షణ మంత్రి సైయద్ మాజిద్ అల్-రేజా హతమైనట్లు ప్రకటన
### - ఇజ్రాయెల్‌తో పాటు మధ్యప్రాచ్యంలోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ దాడి

(ప్రజాలక్ష్యం బ్యూరో)

టెహ్రాన్, మార్చి 3 : ఇజ్రాయెల్, అమెరికా దాడులు... ఇరాన్ ప్రతిదాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. వరుస బాంబు దాడులతో దద్దరిల్లుతున్నాయి. పశ్చిమాసియాలో నాలుగో రోజు కూడా దాడులు, ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. అమెరికా మద్దతుతో ఇరాన్‌పై ఇజ్రాయెల్ మిస్సైళ్లతో విరుచుకుపడుతోంది. ఇరాన్ రాజధాని నగరం టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ దాడులను ఉధృతం చేసింది. సోమవారం రాత్రి పక్కా ఇంటిలిజెన్స్ సమాచారంతో టెహ్రాన్ నడిబొడ్డున ఉన్న పలు కీలక ప్రాంగణాలపై దాడులు జరిపామని, అధ్యక్ష కార్యాలయం, సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ భవనంపై బాంబులు జారవిడిచామని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ తెలిపింది. ఇదే ఏరియాలోని ఇరాన్ మిలటరీ అధికారులకు శిక్షణ ఇచ్చే సంస్థపైన, ఇతర మౌలిక సదుపాయాలపైన కూడా దాడి చేసినట్టు చెప్పింది. కాగా, తమ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీతో పాటు పలువురు సైనిక ఉన్నతాధికారులను కోల్పోవడంతో ఇరాన్ సైతం ప్రతీకార దాడులు కొనసాగిస్తోంది. ఇజ్రాయెల్‌తో పాటు మధ్యప్రాచ్యంలోని అమెరికా సైనిక స్థావరాలపై క్షిపణులు, డ్రోన్‌లతో దాడులు చేస్తోంది. రియాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయాన్ని ఇరాన్ డ్రోన్ ఒకటి మంగళవారంనాడు ఢీకొంది. దీంతో మంటలు చెలరేగాయి. అయితే స్వల్పనష్టమే జరిగినట్టు సౌదీ అరేబియా తెలిపింది. కువైట్‌లోని అమెరికా ఎంబసీని కూడా ఇరాన్ డ్రోన్ ఢీకొనడంతో తాత్కాలికంగా ఎంబసీని మూసివేశారు. కాగా, ఇరాన్ దాడులపై ట్రంప్ మంగళవారంనాడు మరోసారి హెచ్చరికలు చేశాయి. సుదీర్ఘమైన దాడులకు తాము సిద్ధమని, తొలుత నాలుగు, ఐదు వారలు అనుకున్నప్పటికీ అంతకంటే ఎక్కువ రోజులు కొనసాగించే సత్తా కూడా తమకుందని చెప్పారు. తాజా దాడుల్లో ఇరాన్ కొత్త రక్షణ మంత్రి సైయద్ మాజిద్ అల్-రేజా మృతి చెందినట్టు 'ది స్పెక్టేటర్ ఇండెక్స్' వెల్లడించింది. రెండు రోజుల క్రితమే ఇరాన్ రక్షణ మంత్రి అమీర్ సనీర్జాదే ఇజ్రాయెల్ దాడుల్లో మృతి చెందాడు. దీంతో వెంటనే కొత్త రక్షణ మంత్రిగా అల్-రేజా బాధ్యతలు చెపట్టారు. అల్ రేజా ఇంతకుముందు డిప్యూటీ రక్షణ మంత్రిగా ఉండేవారు. తాజాగా అల్‌రేజా కూడా తమ దాడుల్లో మరణించినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. అయితే ఇరాన్ మాత్రం అధికారికంగా ఈ వార్తను ధ్రువీకరించలేదు. ఇరాన్‌లోని సైనిక స్థావరాలు, చమురు క్షేత్రాలు, అణుశుద్ధి కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తోంది. ఈ దాడుల్లో ఇరాన్‌లోని నటాంజ్ అణు శుద్ధి కేంద్రంపై దాడి జరిగినట్టు ఇరాన్ ఇప్పటికే ప్రకటించింది. తాజాగా ఈ దాడిని ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ (ఎంఇం) ధ్రువీకరించింది. దాడుల తర్వాత సేకరించిన హై రిజల్యూషన్ ఉపగ్రహ చిత్రాలను విశ్లేషించామని, నటాంజ్ న్యూక్లియర్ సైట్ వద్ద స్ట్రక్చరల్ డ్యామేజ్ జరిగిందని తెలిపింది. ఫెసిలిటీ ప్రవేశద్వారం వద్ద ఉన్న భవంతులకు నష్టం జరిగినట్టు కనిపిస్తోందని పేర్కొంది. అయితే రేడియేషన్ లీక్ అయిన సంకేతాలు ఏమీ లేవని వెల్లడించింది. ఇజ్రాయెల్ గత ఏడాది ఇరాన్‌పై 12 రోజుల పాటు దాడి జరిపింది. ఆ దాడిలో నటాంజ్ అణుశుద్ధి కేంద్రానికి భారీ నష్టం వాటిల్లింది. ఆ సమయంలో అమెరికా సైతం నటాంజ్, మరో రెండు అణు కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిపింది. తాజాగా మరోసారి నటాంజ్ న్యూక్లియర్ సైట్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడి చేసినట్టు ఐఏఈఏలో ఇరాన్ రాయబారి ఆదివారంనాడు వెల్లడించారు. అయితే దీనిని ఐక్యరాజ్యసమితి అణు నిఘా సంస్థ డైరెక్టర్ జనరల్ రాఫెల్ గ్రాస్సీ తోసిపుచ్చారు. దాడి జరిగిందనడానికి ఎలాంటి సాక్ష్యం లేదన్నారు. వాస్తవ సమాచారం కోస ఇరాన్ న్యూక్లియర్ రెగ్యులేటరీ అథారిటీని సంప్రదిస్తున్నట్టు చెప్పారు. కాగా, ఇజ్రాయెల్ దాడులు మొదలు పెట్టినప్పటి నుంచి ఇంతవరకూ 787 మంది పౌరులు మరణించినట్టు ఇరాన్ అధికారులు తెలిపారు. వీరిలో ఇరాన్ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనీ, ఆయన కుటుంబానికి చెందిన మరో నలుగురు, పలువురు సైనిక ఉన్నతాధికారులు ఉన్నారు. ఇజ్రాయెల్ దాడిని దురాక్రణ చర్యగా అభివర్ణించిన ఇరాన్.. వెనక్కి తగ్గేదిలేదని, ప్రతీకారం తీర్చుకుంటామని ప్రకటించింది.

# ఇరాన్ చర్చల ప్రతిపాదన

### - తోసిపుచ్చిన అమెరికా అధ్యక్షుడు
### - ఇప్పటికే ఆలస్యమైందని ట్రంప్ వ్యాఖ్య
### - ఆయుధ నిల్వలపై అనుమానాలొద్దని వెల్లడి

(ప్రజాలక్ష్యం బ్యూరో)

న్యూయార్క్, మార్చి 3 : ఇరాన్‌పై యుద్ధం కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. చర్చలకు సిద్ధమని ఇరాన్ నేతలు చెప్పారని.. అయితే, ఇప్పటికే ఆలస్యమైందని చెప్పినట్టు పేర్కొన్నారు. ఇరాన్ నాయకత్వంతోపాటు ఆ దేశ గగనతల రక్షణ, వాయుసేన, నౌకాదళ వ్యవస్థలన్నీ తుడిచిపెట్టుకుపోయినట్టు తెలిపారు. ఈ మేరకు సొంత సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. వాల్‌స్ట్రీట్ జర్నల్‌లో వచ్చిన ఓ కథనాన్ని ట్రంప్ ఖండించారు. ఆ పత్రిక అభిప్రాయంతో ఏకీభవించడం లేదన్నారు. అమెరికా ఆయుధ నిల్వలు తక్కువగా ఉన్నాయని, ఎక్కువ కాలం యుద్ధం కొనసాగితే అవి నిండుకునే ప్రమాదం ఉందన్న వార్తలను అధ్యక్షుడు తోసిపుచ్చారు. మధ్యస్థ, ఉన్నతస్థాయి ఆయుధాలు అపరిమిత సంఖ్యలో ఉన్నాయని, అవి చాలా శక్తిమంతమైనవన్నారు. ఇరాన్‌తో ఘర్షణల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. తమవద్ద లెక్కలేనన్ని ఆయుధాలు ఉన్నాయని పోస్టు పెట్టారు. విజయవంతంగా ఎప్పటికీ యుద్ధం చేస్తూనే ఉండగలమని రాసుకొచ్చారు. అమెరికా కోసం ఉన్నతశ్రేణి ఆయుధాలను ఇతర దేశాల్లో కూడా నిల్వ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా మాజీ అధ్యక్షుడు జో బైడెన్‌పై విమర్శలు గుప్పించారు. ఆయన ఆయుధాల నిల్వలను సరిగా నిర్వహించలేదని, ఉక్రెయిన్‌కు భారీఎత్తున అధునాతన ఆయుధాలను పంపారని విమర్శించారు. 'అదృష్టవశాత్తూ నా తొలివిడత పాలనలోనే మిలిటరీని మెరుగుపర్చాను. అమెరికా వద్ద నిల్వలు భారీ విజయాలు సాధించేంతగా ఉన్నాయి' అని తన పోస్టులో పేర్కొన్నారు. ఇదిలాఉంటే.. ఇరాన్‌పై దాడుల గురించి కాంగ్రెస్ (అమెరికా చట్టసభలు)కు ట్రంప్ అధికారికంగా వెల్లడించారని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. దేశ ప్రజల ప్రయోజనాల కోసమే ఈ చర్యలు తీసుకున్నట్లు అధ్యక్షుడు సమర్థించుకున్నారు. అలాగే రానున్న 24 గంటల్లో ఇరాన్‌పై భీకర దాడులు చేయనున్నట్లు ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. తాము ఇప్పటివరకు పెద్ద దాడులే చేయలేదని వ్యాఖ్యలు చేయడం ఆందోళన రేకెత్తిస్తోంది.

# పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు

### వివిధ దేశాధినేతలతో ప్రధాని మోడీ సంప్రదింపులు

(ప్రజాలక్ష్యం బ్యూరో)

న్యూఢిల్లీ, మార్చి 3 :ఇజ్రాయెల్, అమెరికా దాడులు.. ఇరాన్ ప్రతిదాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఘర్షణల్లో ఇప్పటివరకు భారత్‌కు చెందిన ముగ్గురు మృతి చెందారు. ఈ పరిణామాల నడుమ ఒమన్, కువైట్, ఖతార్ పాలకులతో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడారు. ఆయా దేశాలపై జరుగుతున్న దాడులపై ఆందోళన వ్యక్తం చేశారు. ఒమన్ సుల్తాన్ హైథమ్ బిన్ తారిఖ్, కువైట్ యువరాజు సభా అల్-ఖాలీద్ అల్-సభా, ఖతార్ ఎమిర్ తమీమ్ బిన్ హమద్ అల్ థానీలతో ప్రధాని మోదీ (ఔజీసుniటసజీ ఓనీటతి) ఫోన్‌లో వేర్వేరుగా మాట్లాడారు. ఈ దేశాలపై దాడులను ఖండించారు. అక్కడి భారతీయుల క్షేమ సమాచారం గురించి ఆరా తీశారు. వారి భద్రత గురించి చర్చించారు. దౌత్యమార్గాలు, చర్చల ద్వారా ప్రాంతీయ శాంతి, స్థిరత్వాన్ని పునరుద్ధరించాలని నేతలంతా ఏకాభిప్రాయానికి వచ్చారు' అని అధికార వర్గాలు తెలిపాయి. అమెరికా స్థావరాలపై దాడుల పేరిట పశ్చిమాసియాలోని దేశాలపై ఇరాన్ డ్రోన్లు, క్షిపణులు ప్రయోగిస్తున్న విషయం తెలిసిందే. ప్రధాని మోదీ ఇప్పటికే బహ్రెయిన్, సౌదీ అరేబియా, జోర్డాన్, యూఏఈ తదితర దేశాల అధినేతలతో మాట్లాడారు. పశ్చిమాసియాలో దాదాపు 90 లక్షలమంది భారతీయులు నివసిస్తున్నారు. ఇజ్రాయెల్‌లో 40 వేలమంది, ఇరాన్‌లో 10 వేలమంది ఉన్నారు.

# ఇజ్రాయిల్‌తో ప్రపంచానికి చేటు - మండిపడ్డ పాక్ రక్షణ మంత్రి

(ప్రజాలక్ష్యం బ్యూరో)

ఇస్లామాబాద్, మార్చి 3 : మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తతలపై పాకిస్థాన్ తొలిసారిగా స్పందించింది. చర్చలకు ఇరాన్ సిద్ధంగా ఉన్నా బలవంతంగా యుద్ధాన్ని రుద్దారని పాక్ రక్షణ శాఖ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్ ప్రాబల్యాన్ని పాక్ సరిహద్దుల వరకూ విస్తరించే లక్ష్యంతో రూపొందించిన విస్తృత జియోనిస్టు ఎజెండాలో ఇది భాగమని అన్నారు. ఈ కుట్రను పాక్ అర్థం చేసుకోవాలని అన్నారు. జియోనిజమ్‌తో మానవాళికి ముప్పు పొంచి ఉందని మంత్రి ఖవాజా ఆసిఫ్ అన్నారు. పాలస్తీనా భూభాగంలో ఇజ్రాయెల్ దేశాన్ని ఏర్పాటు చేసిన నాటి నుంచీ నేటి వరకూ ఇస్లామిక్ ప్రపంచం ఎదుర్కొన్న ప్రతి యుద్ధం వెనుక జియోనిస్ట్ భావజాలం పాత్ర ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉందని అన్నారు. దాదాపు 100 ఏళ్లుగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థను జియోనిస్టు భావజాలమే నియంత్రిస్తోందని చెప్పారు. ప్రపంచంలోని శక్తిమంతమైన దేశాలు ఈ సిద్ధాంతానికి బందీలుగా మారాయని వ్యాఖ్యానించారు. అఫ్ఘనిస్థాన్, ఇరాన్, భారత్‌లు కేంద్రంగా ఉన్న ఎజెండాకు పాక్ టార్గెట్ అవుతుందని కూడా మంత్రి ఖవాజా ఆసిఫ్ హెచ్చరించారు. అన్ని వైపులా శత్రువులు చుట్టుముడతారని అన్నారు. చివరకు పాక్ ఒక సామంత రాజ్యంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అయితే, పాకిస్థాన్ సైనిక, అణు శక్తిని ప్రపంచమంతా గుర్తించిందని కూడా పాక్ మంత్రి చెప్పారు. పాక్ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు అమరులైన ప్రతి ఒక్కరికీ దేశం రుణపడి ఉంటుందని మంత్రి అన్నారు. పాక్ ఎప్పటికీ శక్తిమంతంగా ఉండాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్టు తెలిపారు.



# ఎల్ సి ఈ ఎస్ వేడుకలు సేవా పురస్కారము అందుకున్న కంచర్ల మల్లికార్జున రావు

కందుకూరు, ఫిబ్రవరి 3 : ఒంగోలు నగరంలోని కేశవస్వామిపేట వద్ద శ్రీప్రసన్న చెన్న కేశవ స్వామి ఆలయంలో జాతీయ పురస్కార వేడుకలు ఎస్ ఎల్ సి పి ఎస్ కళానిలయము ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఆధ్యాత్మిక సేవా సంస్థ ఆద్వరశీలో అత్యంత వైభవంగా సోమవారం జరిగాయి. ఈ కార్యక్రమానికి సంస్థ సెక్రటరీ కె.బుచ్చేశ్వర్ రావు అధ్యక్షత వహించారు. ఈ వేడుకలకు సేవా పురస్కారం అందుకున్న సామాజికవేత్త , సీనియర్ జర్నలిస్ట్ కంచర్ల మల్లికార్జున రావు మాట్లాడుతూ సేవా సంస్థ సెక్రెటరీ బుచ్చేశ్వర్ రావు భవిష్యత్తులో ఎన్నో కార్యక్రమాలనునిర్వహించాలని సూచించారు. ఆయనకు ఆరోగ్య ,ఐశ్వర్యంలను ప్రసాదం చాలని చెప్పారు. పలువురిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల పరిరక్షణ కమిటీ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కే శృతి,.నేషనల్ డైరెక్టర ఇండస్ట్రియల్ రిలేషన్స్ వర్కర్స్ బోర్డ్. షేక్ సిద్ధాంబి కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ . కొలకలూరి రవిబాబు, సెక్రెటరీ బుచ్చేశ్వర్ రావు, వరల్డ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ జాతీయ ఉపాధ్యక్షురాలు డాక్టర్ కే శృతి, తదితరులు పాల్గొన్నారు..

# ఇరాన్‌పై అమెరికా దాడులు - తొలిసారిగా స్పందించిన చైనా

### వెంటనే కాల్పుల విరమణ ప్రకటించాలని డిమాండ్

(ప్రజాలక్ష్యం బ్యూరో)

బీజింగ్, మార్చి 3 :ఇరాన్‌పై అమెరికా దాడులను చైనా ఖండించింది. తక్షణం కాల్పుల విరమణ ప్రకటించాలని సూచించింది. లేని పక్షంలో ఈ ఘర్షణలు ఇతర దేశాలకు విస్తరించే ప్రమాదం ఉందని హెచ్చరించింది. గల్ఫ్ ప్రాంతంలోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ దాడులు చేస్తున్న నేపథ్యంలో చైనా విదేశాంగ శాఖ ఈ ప్రకటనను విడుదల చేసింది. అన్ని సైనిక చర్యలకూ ముగింపు చెప్పడం తక్షణ అవసరమని వ్యాఖ్యానించింది. చర్చల ద్వారా వివాదాలను పరిష్కరించుకోవాలని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి సూచించారు. అమెరికా నేతృత్వంలో జరుగుతున్న దాడులు అంతర్జాతీయ చట్టాలకు వ్యతిరేకమని కూడా చైనా కామెంట్ చేసింది. ఈ దాడులకు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి అనుమతి లేదని పేర్కొంది. ఉద్రిక్తతలు అంతకంతకూ పెరుగుతున్న నేపథ్యంలో భద్రతా మండలి అత్యవసర ప్రాతిపదికన సమావేశం కావాలని చైనా సూచించింది. గల్ఫ్ దేశాల సార్వభౌమత్వం, భద్రత, ప్రాదేశిక సమగ్రతను గౌరవించాలని స్పష్టం చేసింది. రష్యా విదేశాంగ శాఖ మంత్రి సెర్గీ లావ్రోవ్‌తో చైనా విదేశాంగ శాఖ మంత్రి వాంగ్ ఈ విషయమైన ఫోన్‌లో మాట్లాడారు. శాంతి నెలకొల్పే దిశగా ప్రయత్నాలు జరగాలని చెప్పారు. త్వరలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో ఇరు దేశాలు నిరంతరం టచ్‌లో ఉన్నాయని కూడా విదేశాంగ శాఖ ప్రతినిధి తెలిపారు. ఇక ఇరాన్‌లో చిక్కుకున్న చైనీయులను స్వదేశానికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని కూడా చైనా ప్రభుత్వం తెలిపింది. ఇప్పటికే 3 వేల మంది చైనీయులను స్వదేశానికి తీసుకొచ్చామని పేర్కొంది.

# ఇళ్ళ నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలి : కలెక్టర్

ఒంగోలు, మార్చి 3 : ఒంగోలు నగర కార్పోరేషన్ పరిధిలో పేదల గృహ నిర్మాణాలకు నిర్దేశించిన లే అవుట్స్ లో అర్హులైన లబ్దిదారులకు వీలైనంత తొందరగా ఇళ్ళ నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీ పి. రాజాబాబు, అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ శ్రీ రాజాబాబు, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు శ్రీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఒంగోలు శాసన సభ్యులు శ్రీ దామచర్ల జనార్ధన రావు లతో కలసి మున్సిపల్, రెవెన్యు అధికారులతో సమావేశమై ఒంగోలు నగర కార్పోరేషన్ పరిధిలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పేదలకు ఇళ్ళ నిర్మాణాలు చేపట్టాలన్న లక్ష్యంతో ఒంగోలు నగర కార్పోరేషన్ పరిధిలో అగ్రహారం, యరజర్ల వద్ద లే అవుట్స్ ను వేయడం జరిగిందని, ఈ రెండు లే అవుట్స్ లో అర్హులైన లబ్దిదారులకు వీలైనంత తొందరగా ఇళ్ళ నిర్మాణాలు చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఒంగోలు నగరంలో నిరుపయోగంగా, ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో పిపిపి పద్దతిలో నగర కార్పోరేషన్ కు ఆదాయం వచ్చేలా షాప్స్, మాల్స్ నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్, అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఒంగోలు రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీమతి లక్ష్మి ప్రసన్న, ఒంగోలు మున్సిపల్ కమీషనర్ శ్రీ వెంకటేశ్వర రావు, ఒంగోలు తహసిల్దార్ శ్రీ మధుసూదన్ రావు, రిజిస్ట్రేషన్, సర్వే అధికారులు పాల్గొన్నారు.

# అమెరికాలో భారత యువతి హత్య

### ఇరాన్ ఉగ్ర కుట్రపై పోలీసుల ఆరా

(ప్రజాలక్ష్యం బ్యూరో)

న్యూయార్క్‌మార్చి 3 : ఆస్టిన్‌లో (టెక్సాస్) ఆదివారం జరిగిన కాల్పుల ఘటనలో భారతీయ యువతి సహా ముగ్గురు మరణించడం స్థానికంగా కలకలం రేపుతోంది. ఈ కాల్పుల ఘటన వెనుక ఇరాన్ ఉగ్ర కుట్ర ఉందా అన్న కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. వెస్ట్ సిక్స్త్ వీధిలో బ్యూఫోర్డ్ బార్న్ వద్ద ఈ ఘటన జరిగింది. నిందితుడు విచక్షణా రహితంగా కాల్పులకు దిగడంతో ముగ్గురు మరణించగా 14 మంది గాయపడ్డారు. గాయపడ్డ వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. ఇక నిందితుడు కూడా పోలీసులు కాల్పుల్లో మరణించాడు. దీంతో, మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. కాల్పులకు బలైన భారతీయ యువతిని సవిత షన్ముఖ సుందరంగా పోలీసులు గుర్తించారు. ఆమె యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లో చదువుకునే వారు. మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్, ఎకనమిక్స్‌లో డ్యూయెల్ డిగ్రీతో ఆమె చదువు మే నెలలో పూర్తి కావాల్సి ఉంది. ఇంతలోనే ఆమె కన్నుమూశారు. సవిత మృతిపై యూనివర్సిటీ వర్గాలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశాయి. తమ యూనివర్సిటీలోని సూపర్ స్టార్ స్టూడెంట్స్‌లో ఆమె కూడా ఒకరని అక్కడి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఒకరు తెలిపారు. చదువు పూర్తయ్యాక ఆమె ఒక ప్రముఖ సంస్థలో చేరాల్సి ఉండగా ఈ ఘోరం జరిగిందని విచారం వ్యక్తం చేశారు.

# జిల్లెళ్ళమూడిలో రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేసిన - ఎమ్మెల్యే శ్రీ వేగేశన నరేంద్ర వర్మ రాజు





(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

బాపట్ల, మార్చి3:బాపట్ల మండలం జిల్లెళ్ళ మూడి గ్రామంలో రీ-సర్వే ప్రక్రియ పూర్తయిన అనంతరం, అత్యాధునిక భద్రతా ప్రమాణాలు, రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను బాపట్ల శాసనసభ్యులు శ్రీ వేగేశన నరేంద్ర వర్మ రాజు గారు ఈరోజు రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమం లో ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ రీ-సర్వే ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ప్రతి రైతుకుతనభూమిపై పూర్తిహక్కులు కల్పించడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారిక ముద్రతో కూడిన ఈ పాస్ పుస్తకాలు అత్యంత ప్రామాణికమైనవని, వీటి ద్వారా రైతులకు బ్యాంక్ రుణాలు మరియు ఇతరప్రభుత్వ పథకాలు పొంద డం సులభతరమవు తుందని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అర్హులైన ప్రతిరైతుకుసకాలంలో సేవలం దించాలని అధికారులను ఆదేశించారు. గతంలో భూ రికార్డుల విషయంలో రైతులు పడ్డ ఇబ్బంది లను దృష్టిలో ఉంచుకుని, ప్రస్తుత ప్రభుత్వం అత్యం త ప్రతిష్టాత్మ కంగా రీ-సర్వేను పూర్తి చేసిందని ఆయన తెలిపారు. రాజముద్రతో కూడిన ఈ పాస్ పుస్తకాలు రైతులకు పూర్తిస్థాయి భద్రతను ఇస్తాయని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో జరిగిన ఈసర్వేవల్ల సరిహద్దు వివాదాలకు తావుం డదని, రైతులు కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉ ండకూడదన్నదే తమ సంకల్పమని ఎమ్మెల్యే గారు స్పష్టం చేశారు. రెవెన్యూ యంత్రాంగం నిరంతరం రైతులకు అందుబాటులో ఉండి, క్షేత్రస్థాయిలో ఉ న్న చిన్న చిన్న సమస్యలను కూడా వెంటనే పరిష్కరిం చాలని ఆయన అధికారుల ను ఆదేశించారు. దశాబ్దాల కాలంగా తమ భూములకు సంబంధించి ఎదురుచూస్తున్న స్పష్టత ఇప్పుడు లభించిందని జిల్లెళ్ళమూడి గ్రామ రైతులు ఆనందం వ్యక్తం చేశారు. తమ గ్రామానికి స్వయంగా వచ్చి పాస్ పుస్తకాలు అందజేసిన ఎమ్మెల్యేగారికి వారు కృతజ్ఞత లు తెలిపారు. ఆర్.డి. ఓ గ్లోరియా , తాసిల్దార్ సలీమా, బాపట్ల నియోజకవర్గ పరిశీలకులు బొంతు శివసాంబిరెడ్డి, జనసేన పార్టీ బాపట్ల నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, బాపట్ల మండల పార్టీ అధ్యక్షుడు ముక్కామల సాంబశివరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు గండికోట పోతురాజు, ప్రధాన కార్యదర్శి ఖగ్గా నాగరాజు, స్థానిక రెవెన్యూ అధికారులు, నాయకులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఐపిఎస్ ఆదేశాలతో గంజాయి రహిత జిల్లా దిశగా కార్యాచరణ చేపడుతున్న జిల్లా పోలీస్ అధికారులు

- మాదకద్రవ్యాల నిర్మూలనపై ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం
-మాదకద్రవ్యాల వలన కలిగే అనర్థాల గురించి రూపొందించిన అవగాహన పోస్టర్లను ఆటోలలో అతికించిన జిల్లా పోలీసులు
-అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న చీరాల డిఎస్పి ఎండి.మోయిన్





(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

బాపట్ల, మార్చి 3 : మాదకద్రవ్యాల మహమ్మారిని జిల్లా నుండి పూర్తిగా తుడిచిపెట్టే లక్ష్యంతో జిల్లా ఎస్పీ శ్రీ బి.ఉమామహేశ్వర్ ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు మంగళవారం చీరాల పట్టణంలోని స్థానిక సెయింట్ మార్క్స్ కమ్యూనిటీ హాల్ ఆవరణలో చీరాల డిఎస్పి ఎండి. మోయిన్ ఆధ్వర్యంలో నిషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఆటో డ్రైవర్లకు డ్రగ్స్ వలన కలిగే దుష్ప్రభావాల గురించి అవగాహన కల్పించి, సమాజంలో చైతన్యం నింపేలా రూపొందించిన ప్రత్యేక పోస్టర్స్ ఆటోలకు అతికించారు. ఈ సందర్భంగా డిఎస్పీ గారు మాట్లాడుతూ సాధారణంగా పాఠశాలలు, కళాశాలలు, జనసమ్మర్థం గల ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంటామన్నారు. అయితే, సామాన్య ప్రజలలో సైతం ఈ అంశంపై పూర్తి అవగాహన పెంపొందించేందుకు ఈసారి ఆటోలను ప్రచార వాహనాలుగా ఎంచుకున్నామన్నారు. ఆటోలలో నిత్యం వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు కాబట్టి, ఆటో లోపల, బయట అతికించిన పోస్టర్ల ద్వారా ప్రయాణికులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాల గురించి సమాచారం సులభంగా చేరువవుతుందన్నారు. ఈ వినూత్న మార్గం ద్వారా ప్రతి ఒక్కరూ డ్రగ్స్ లేని సమాజం కోసం ఆలోచిస్తారనే సదుద్దేశంతో ఈ చర్యలు చేపట్టామని తెలిపారు. ఆటో డ్రైవర్లు నిత్యం ప్రజల మధ్య ఉంటూ పట్టణంలోని మారుమూల ప్రాంతాలకు కూడా వెళ్తుంటారు కాబట్టి వారు సమాజ రక్షణలో కీలక పాత్ర పోషించాలని కోరారు. ఎక్కడైనా గంజాయి సేవించినా లేదా విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ లు 1972, 112 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. బాపట్ల జిల్లాను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు జిల్లా ఎస్పీ గారు అనేక వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారని, వీటికి ప్రజల నుండి కూడా పూర్తి సహకారం లభిస్తే ఆశించిన లక్ష్యాన్ని సులభంగా చేరుకోవచ్చని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చీరాల డిఎస్పి ఎండి.మోయిన్, చీరాల 1టౌన్ ఇన్స్పెక్టర్ ఎస్.సుబ్బారావు, స్టేషన్ ఎస్.ఐ లు, సిబ్బంది, ఈగల్ టీమ్, పట్టణంలోని ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

# స్వయంగా రక్తదానం చేసిన చీరాల డిఎస్పి ఎండి.మోయిన్

- ఉత్సాహంగా పాల్గొన్న పోలీస్ అధికారులు, సిబ్బంది, స్థానిక యువత, ఆటో డ్రైవర్లు - పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెడికల్ క్యాంపులో విద్యార్థినిలకు వైద్య పరీక్షలు





(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

బాపట్ల,మార్చి 3 :అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా సాధికారత వారోత్సవాలను జిల్లా పోలీస్ యంత్రాంగం అత్యంత ఘనంగా నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా జిల్లా ఎస్పీ శ్రీ బి.ఉమామహేశ్వర్ ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు మంగళవారం చీరాల పట్టణంలోని స్థానిక సెయింట్ మార్క్స్ కమ్యూనిటీ హాల్ లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక రక్తదాన శిబిరాన్ని, మెడికల్ క్యాంప్ లను ఏర్పాటు చేశారు. అత్యవసర సమయాల్లో మహిళలకు, రోగులకు రక్తం అందుబాటులో ఉండాలనే మానవీయ దృక్పథంతో ఈ కార్యక్రమాలను చేపట్టారు. దానితోపాటు చీరాల పట్టణంలోని ఎస్.సి హాస్టల్ విద్యార్థినులు, మహిళా పోలీస్ సిబ్బందికి మెడికల్ క్యాంప్ లో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో చీరాల డీఎస్పీ ఎండి. మోయిన్ గారు స్వయంగా పాల్గొని రక్తదానం చేసి సిబ్బందిలో ఉత్సాహాన్ని నింపారు. డీఎస్పీ గారితో పాటు చీరాల వన్ టౌన్ పోలీస్ అధికారులు, సిబ్బంది, స్థానిక యువత, ఆటో డ్రైవర్లు పెద్ద ఎత్తున స్పందించి రక్తదానం చేశారు. సుమారు 50 మంది ఈ కార్యక్రమంలో పాల్గొని రక్తదానం చేయడం విశేషం. రక్తదాన శిబిరం నిర్వహించడమే కాకుండా, స్వయంగా రక్తదానం చేసిన డీఎస్పీ గారిని, ఇతర పోలీస్ అధికారులను, సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చిన యువతను, ఆటో డ్రైవర్లను జిల్లా ఎస్పీ గారు ప్రత్యేకంగా అభినందించారు. సమాజ సేవలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని, ముఖ్యంగా మహిళల ఆరోగ్యం, రక్షణ విషయంలో ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని ఎస్పీ గారు తెలిపారు. ఏవైనా అత్యవసర ఆపరేషన్లు, మహిళలకు కాన్పు సమయంలో రక్తం ఎంతో అవసరం అవుతుందన్నారు. మన దేశంలో అవసరానికి సరిపడా రక్త నిల్వలు లేవని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని సూచించారు. రక్తం దానం చేయడం ద్వారా మరొకరి ప్రాణాన్ని కాపాడవచ్చని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా ఇలాంటి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఎస్పీ గారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చీరాల 1టౌన్ సిఐ ఎస్.సుబ్బారావు, ఎస్.ఐ రాజ్యలక్ష్మి, వెంకటేశ్వరరెడ్డి, ట్రాఫిక్ ఎస్.ఐ పవన్ కుమార్, శక్తి టీమ్ సభ్యులు సుబ్బారావు, పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయండి

- ప్రజా సంక్షేమానికి బాటలు వేయండి - దేశాభివృద్ధిలో భాగస్వామ్యులవ్వండి
-పాత్రికేయులకు సూచించిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

చిత్తూరు, మార్చి 3 :కేంద్ర ప్రభుత్వం అమలు చేసే ప్రతి సంక్షేమ పథకం గ్రామీణ ప్రజలకు తెలియజేయవలసిన బాధ్యత మీడియా రంగంపై ఉన్నదనిచిత్తూరు ఎంపి దుగ్గిమల్ల ప్రసాదరావు పేర్కొన్నారు. మంగళవారం చిత్తూరు పట్టణంలోని హోటల్ ప్రభ ఇన్ నందు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సంస్థ విజయవాడ ఆధ్వర్యంలో "వార్తాలాప్ - మీడియా వర్కషాపు" నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పి ఐబి డైరెక్టర్ సురేష్ కుమార్, ఎల్ డి ఎం హరీష్ కుమార్, జిల్లా ఐఔపీూ పిడి రవికుమార్, రాష్ట్ర యాక్ట్ గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు సరైన సమాచారం చేరినప్పుడే అభివృద్ధి ఫలాలు అందరికీ చేరుతాయి" అని అన్నారు. గ్రామీణ స్థాయిలో పథకాల అవగాహన పెంచేందుకు జర్నలిస్టులు ముందుండాలని ఆయన కోరారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసి ప్రతి సంక్షేమ కార్యక్రమాలు అమల లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని బాధ్యతగా అమలు చేయుచున్నావని తెలిపారు, కేంద్ర ప్రభుత్వం 60% రాష్ట్ర ప్రభుత్వం 40 శాతంతో అమలలో గ్రామీణ ఆర్థిక జీవన ప్రమాణాలు పెరుగుతున్నాయని తెలిపారు, యువతకు, రైతులకు, మహిళలకు, వైద్యరంగం, విద్యారంగం, గృహం నిర్మాణంలో, కేంద్ర ప్రభుత్వం పారదర్శకంగా పథకాలు అమలు చేయుచున్నదని తెలిపారు. అనేది గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను విస్తరించేందుకు, మౌలిక వసతులను బలోపేతం చేయేందుకు రూపొందించిన సమగ్ర చట్టం. ఇది పూర్వపు ఉపాధి హామీ విధానాలను మరింత విస్తరించి, గ్రామీణాభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రతి గ్రామీణ కుటుంబానికి సంవత్సరానికి పెరిగిన ఉపాధి రోజులు అని పేర్కొన్నారు.

అనంతరం రాష్ట్ర ఎదీ-+ =ూవీ + ప్రతినిధి గోపీచంద్ మాట్లాడుతూనీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ, గ్రామీణ రహదారుల నిర్మాణంవ్యవసాయ అనుబంధ కార్యకలాపాలకు మద్దతుమహిళల ఉపాధి భాగస్వామ్యాన్ని పెంపుడిజిటల్ పర్యవేక్షణ, బయోమెట్రిక్ హాజరు విధానం గ్రామ పంచాయతీ స్థాయిలో ప్రణాళికలు రూపొందింపుజియోట్యాగింగ్, ఆన్లైన్ మానిటరింగ్ వ్యవస్థ సామాజిక ఆడిట్ ద్వారా పారదర్శకత నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు వేతనాల జమ, ద్వారా ఉపాధి హామీతో పాటు స్థిరమైన గ్రామీణ మౌలిక వసతుల నిర్మాణం జరుగుతుంది. ఇది 'వికసిత భారత్ 2047' లక్ష్యానికి దోహదం చేస్తుంది" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సంపూర్ణ చంద్రగ్రహణంతో ఆలయాల మూసివేత

- నేడు వేకువ జామున తిరిగి దర్శనాలు

హైదరాబాద/తిరుపతి,మార్చి3 : సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా మంగళవారం ఆలయాలు మూతపడ్డాయి. సంప్రదాయ ఆచారాలను అనుసరిస్తూ రెండు తెలుగు రాష్ట్రల్లోనూ ప్రముఖ దేవాలయాలను తాత్కాలికంగా మూసేశారు. గ్రహణం ముగిసిన అనంతరం శుద్ధి కార్యక్రమాల తర్వాత మాత్రమే భక్తులకు దర్శనానికి అనుమతి ఇస్తారు. చందగ్రహణం కారణంగా తిరుమల తిరుపతి దేవస్థానాల పరిధిలోని దాదాపు ఆలయాలన్నీ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7.30 గంటలకు వరకు మూసివేసారు. అనంతరం ఆలయ శుద్ధి కార్యక్రమాలు పూర్తి చేసిన తర్వాత రాత్రి 8.30 గంటల నుంచి భక్తులకు దర్శనాలు పునఃప్రారంభం అవుతాయి. గ్రహణం నేపథ్యంలో టీటీడీ నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ కేంద్రాలు కూడా తాత్కాలికంగా నిలిపివేశారు. చందగ్రహణం కారణంగా దర్శన సమయాల్లో మార్పులు చోటుచేసు కున్నందున, భక్తులు ముందస్తుగా సమాచారం తెలుసుకుని తమ ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. అలాగే, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలం, సింహాచలం, ద్వారకా తిరుమల అత్యంత ప్రసిద్ధ హిందూ పుణ్యక్షేత్రాలతో సహా పలు ఆలయాలు మూసివేశారు. సంపూర్ణ చందగ్రహణం సందర్భంగా తెలంగాణలోని పలు ప్రముఖ ఆలయాలను తాత్కాలికంగా మూసేశారు. జగిత్యాల జిల్లాలోని ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని ఉదయం 9 గంటలకు మూసేశారు. తిరిగి బుధవారం ఉదయం సంప్రోక్షణ, అభిషేక పూజల తర్వాత భక్తులకు దర్శనం కల్పిస్తారు. నిర్మల్ జిల్లా బాసర ఆలయాన్ని కూడా మూసివేశారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం, శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంతో పాటు అనుబంధ ఆలయాలు ఉదయం 6.15 నుంచి సాయంత్రం 7.15 వరకు మూసివేసారు. అనంతరం పుణ్యాహవాచ నం, సంప్రోక్షణ నిర్వహించి భక్తులకు దర్శనం అనుమతిస్తారు.

# ఆరోగ్యం

## కొలెస్ట్రాల్ సమస్యకు దివ్యౌషధం..

### ఈ కూరగాయ తింటే చెరకు రసం పిండినట్లుగా కొలెస్ట్రాల్ ను పిండేస్తది



ప్రస్తుతం చాలామందిని ఇబ్బందిపెడుతున్న ఆరోగ్య సమస్య అధిక కొలెస్ట్రాల్. ఇది రక్తనాలాల్లో పేరుకుపోయి రక్త ప్రసరణకు అడ్డుగోడగా మారుతుంది. ఫలితంగా గుండెపోటు, స్ట్రోక్, అధిక రక్తపోటు వంటి ప్రాణాంతక సమస్యలు దాడి చేస్తాయి. దీనంతటికి ముఖ్య కారణం మన లైఫ్ స్టైయిల్, మన ఆహార అలవాట్లు మారడమే. ఏది పడితే అది తినడం వల్ల కొలెస్ట్రాల్ పెరగడం..దీంతో హాస్పిటల్స్ చుట్టూ తిరిగి లక్షల రూపాయలు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. అయితే కొలెస్ట్రాల్ సమస్యకు సంజీవని మీ వంటగదిలోనే ఉందని మీకు తెలుసా? చాలామంది చూడగానే ముఖం తిప్పేసుకునే కూరగాయల్లో సొరకాయ ఒకటి. కొంతమంది ఈ పేరు వింటేనే వేరే కూర లేదా అబ్బా సొరకాయ అని డల్ అయిపోతుంటారు. వాస్తవానికి సొరకాయ అందించే ప్రయోజనాలు తెలిస్తే ఆ మాట మీ నోట రాదు. ఇదేం కూర అని ఛీత్కరించుకునే ఈ సొరకాయ మన శరీరానికి ఒక ఔషధ గని. చెడు కొలెస్ట్రాల్ ను సిరల నుండి చెరకు రసం పిండినట్లుగా పిండి బయటకు పంపగల శక్తి దీనికి ఉంది. ప్రతి రక్తపు చుక్కను శుభ్రపరిచే అద్భుతమైన గుణాలు ఇందులో ఉన్నాయి. సొరకాయతో కొలెస్ట్రాల్ కు ఎలా చెక్ పెడుతుంది సొరకాయలో సమృద్ధిగా ఉండే కరిగే ఫైబర్..శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇది ప్రేగుల్లోని కొలెస్ట్రాల్ శోషణను అడ్డుకుని దాన్ని శరీరం నుండి బయటకు పంపుతుంది. సొరకాయలో కొవ్వు లేదా ఫ్యాట్ దాదాపుగా ఉండదు. దీనిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల బరువు అదుపులో ఉంటుంది. అధిక బరువు కారణంగా పెరిగే కొలెస్ట్రాల్ కూడా కంట్రోల్ లోకి వస్తుంది. సొరకాయలో ఉండే పొటాషియం రక్తపోటును నియంత్రిస్తుంది. విటమిన్ %జ% ఒక శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్‌గా పనిచేసి రక్తనాళాల గోడలను చాలా ఆరోగ్యంగా, దృఢంగా ఉంచుతుంది. సొరకాయ శరీరంలోని విషతుల్యాలను బయటకు పంపి కాలేయాన్ని శుభ్రపరుస్తుంది. ఆరోగ్యకరమైన కాలేయం కొలెస్ట్రాల్ లెవల్స్ ని సమర్థవంతంగా కంట్రోల్ చేస్తుంది.

ఎలా, ఎంత తీసుకోవాలి? ఆరోగ్య నిపుణుల ప్రకారం ప్రతిరోజూ 100 నుండి 200 గ్రాముల సొరకాయను వండుకుని తినడం ఎంతో మేలు చేస్తుంది. దీనిని కూర, పులుసు, సూప్ లేదా రసం రూపంలో తీసుకోవచ్చు. సొరకాయ రసం తాగాలనుకుంటే అది కచ్చితంగా తాజాగా ఉండాలి. పరగడుపున తాగడం వల్ల కొందరిలో గ్యాస్ లేదా ఎసిడిటీ సమస్యలు రావచ్చు. అత్యంత ముఖ్యంగా రసం తాగే ముందు కొద్దిగా రుచి చూడండి. చేదుగా ఉంటే అస్సలు తాగవద్దు, అది ఆరోగ్యానికి హానికరం. %ణఅం-ఎశ్రీఖఅఎవతీ%: ఈ ఆర్టికల్ లో అందించిన సమాచారం సాధారణ సమాచారం,విద్యా ప్రయోజనాల కోసం మాత్రమే. ఇది వృత్తిపరమైన వైద్య సలహా, రోగ నిర్ధారణ లేదా ట్రీట్మెంట్ కు ప్రత్యామ్నాయంగా ఉద్దేశించబడలేదు. వైద్య పరిస్థితికి సంబంధించి మీకు ఏవైనా ప్రశ్నలు ఉంటే మీ డాక్టర్ లేదా సంబంధిత నిపుణుల సలహా తీసుకోండి.

## అన్నం కూర ఎందుకు.. ఈ ప్రొటీన్ రిచ్ ఖిచిడి తింటే బోలెడు మేలు..






దాల్ కిచిడి..మనదేశంలో చాలా ప్రసిద్ధి చెందిన, పోషకమైన వంటకం. రెసిపి ప్రాంతాన్ని బట్టి టేస్ట్ మారుతూ ఉంటుంది. అయితే దీన్ని మన తెలుగువారి స్టైల్ లో చేస్తే ఆ టేస్ట్ జన్మలో మర్చిపోరు. మన దగ్గర రెస్టారెంట్లలో లేదా హెూటల్స్ లో దొరికే దాల్ ఖిచిడి వెల్లుల్లి గుబాళింపుతో అదిరిపోతుంది. ఎదురుగా పెడితే ఎవరైనా యమ్మీ యమ్మీ అని లొట్టలేసుకుంటూ తింటారు. అయితే దీనిని ఇంట్లో కూడా రెస్టారెంట్ స్టైల్ తో ఈజీగా తయారుచేసుకోవచ్చు. బ్యాచిలర్స్ కూడా ఈజీగా తయారుచేసుకునే రెసిపి ఇది. అంతేకాకుండా ఇది ఆరోగ్యానికి బోలెడు మేలు చేస్తుంది. రెస్టారెంట్ స్టైల్ దాల్ కిచిడిని ఇంట్లోనే తయారుచేయడానికి కావాల్సిన పదార్థాలు,తయారీ విధానం ఇక్కడ చూడండి.

తయారీకి కావాల్సిన పదార్థాలు -పెసరపప్పు -బియ్యం -ఆయిల్ -నెయ్యి -జీలకర్ర -ఎండుమిర్చి -పచ్చిమిర్చి -అల్లం తరుగు -వెల్లుల్లి తరుగు -కారం -పసుపు -ధనియాల పొడి -జీలకర్ర పొడి -ఉప్పు -కొత్తిమీర -టమాటో -ఇంగువ

తయారీ విధానం -ముందుగా అరకప్పు బియ్యం, అరకప్పు పెసరపప్పు విడివిగా కనీసం గంట సేపు నానబెట్టాలి.

తర్వాత స్టవ్ మీద కుక్కర్ పెట్టి అందులో నానిన బియ్యం, నానిన పెసరపప్పు వేసి అందులోనే కొంచెం ఉప్పు, చిటికెడు పసుపు, 3 కప్పుల నీళ్లు, అర టీస్పూన్ నెయ్యి పోసి కుక్కర్ మూతపెట్టి మీడియం మంట మీద 4-5 విజిల్స్ రానివ్వాలి.

-తర్వాత స్టవ్ మీద బాండీ పెట్టి అందులో 3 టేబుల్ స్పూన్ల ఆయిల్ వేడి చెయ్యాలి. ఆయిల్ వేడెక్కిన తర్వాత రెండు చీరిన పచ్చిమిర్చి, అర టీస్పూన్ జీలకర్ర, 1 టేబుల్ స్పూన్ వెల్లుల్లి తరుగు, అర టేబుల్ స్పూన్ అల్లం తరుగు, చిటికెడు ఇంగువ వేసి తాళింపు ఎర్రగా వేగాలి. -ఇప్పుడు అందులో 1 ఉల్లిపాయ తరుగు వేసి అవి మెత్తబడి గోల్డెన్ బ్రౌన్ కలర్ లోకి వచ్చేదాకా వేయించుకున్నాక అందులో 1 పెద్ద టమాటో తరుగు వేసి ముక్కలు గుజ్జుగా అయ్యేదాకా వేయించాలి.

-టమాటో ముక్కలపై స్కిన్ సపరేట్ అయ్యాక అందులో పావు టీస్పూన్ పసుపు, 1 టీస్పూన్ ధనియాల పొడి,అర టీస్పూన్ కారం, అర టీస్పూన్ వేయించిన జీలకర్ర పొడి వేసి వేయించాలి. -తర్వాత అందులో ఉడికించిన అన్నం వేసి ఇందులో ముప్పావు కప్పు వేడి నీళ్లు పోసి అన్నాన్ని గరిటతో బాగా కలుపుకోవాలి. గుజ్జుగా కావాలనుకుంటే మాష్ చేయండి లేదంటే అలానే వదిలేయండి. -ఇప్పుడు అందులో రుచికి సరిపడా ఉప్పు, కొత్తిమీర తరుగు వేసి కలిపాక మరో ముప్పావు కప్పు వేడి నీళ్లు పోసి కలిపి 4-5 నిమిషాలు అది దగ్గరపడేదాకా ఉడికించాలి. -తర్వాత స్టవ్ మీద మరో బాండీ పెట్టి అందులో 2 టేబుల్ స్పూన్ల ఆయిల్ వేడి చేశాక అందులో 1 టేబుల్ స్పూన్ వెల్లుల్లి తరుగు, 2 ఎండుమిర్చి,పావు టీస్పూన్ ఇంగువ వేసి వేయించి స్టవ్ ఆఫ్ చేసి అందులో రుచికి సరిపడా కశ్మీరీ కారం వేసి కలిపండి.

-ఈ తాళింపుని కిచిడీలో వేసి కలుపుకుంటే టేస్టీ దాల్ ఖిచిడీ రెడీ. దీనిని రైతాతో కలిపి తింటే అదిరిపోతుంది.

కొన్ని ప్రయోజనాలు దాల్ ఖిచిడి చాలా తేలికైన ఆహారం, సులభంగా జీర్ణం అవుతుంది. అందుకే అనారోగ్యంగా ఉన్నప్పుడు ముఖ్యంగా కడుపు నొప్పితో బాధపడుతున్నప్పుడు దీనిని సూచిస్తారు. బియ్యం, పప్పుల కలయిక జీర్ణవ్యవస్థపై భారం తగ్గించి, శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తుంది. ఇది కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు, ఫైబర్, విటమిన్లు, ఖనిజాలకు మంచి మూలం. ఇందులో ఉండే కార్బోహైడ్రేట్లు,ప్రోటీన్లు శరీరానికి నిరంతర శక్తిని అందిస్తాయి. దాల్ ఖిచిడిలో ప్రోటీన్ మరియు ఫైబర్ అధికంగా ఉండటం వల్ల త్వరగా కడుపు నిండిన భావన కలుగుతుంది, తద్వారా అతిగా తినడం తగ్గుతుంది. ఇది బరువు తగ్గాలనుకునే వారికి, కండరాలను పెంచుకోవాలనుకునే వారికి మంచి ఆహారం.

## మామిడి తాండ్ర ఎలా చేసుకోవాలంటే



మామిడి తాండ్ర తయారీకి కావాల్సిన పదార్థాలు -మామిడికాయలు -చక్కెర లేదా బెల్లం -నెయ్యి లేదా ఆయిల్ -మ్యాంగ్ ఎసెన్స్ -నిమ్మరసం.

మామిడి తాండ్ర తయారీ విధానం -ముందుగా బాగా పండిన 1 కేజీ మామిడికాయ ముక్కలు తీసుకోండి. ముక్క కోసుకునే మామిడిపండ్లు అయితే కరెక్ట్ గా ఉంటుంది. -మామిడి పండ్ల ముక్కలపై ఉండే తొక్కను తీసేసి వాటిని మిక్సీ గిన్నెలో వేసి ఫైన్ పేస్ట్ లా గ్రైండ్ చేసుకోవాలి. -తర్వాత స్టవ్ మీద మందంగా ఉండే కడాయిని పెట్టి అందులో గ్రైండ్ చేసుకున్న మామిడి పేస్ట్, పావు కేజీ చక్కెర లేదా బెల్లం తురుము అయినా వేసి అది కరిగేవరకు తక్కువ మంట మీద ఉంచాలి. -తర్వాత అందులో 1 టీస్పూన్ నిమ్మరసం, పావు టీస్పూన్ మ్యాంగో ఎసెన్స్ వేసి కలిపి 10-15 నిమిషాలు తక్కువమంట మీద ఉడికించాలి. మధ్య మధ్యలో కలుపుతూ ఉండాలి. -మ్యాంగో మిశ్రమాన్ని మరీ దగ్గరికి అయ్యేట్లు ఉడికించకూడదు.కొంచెం జెల్లీలా అయిన తర్వాత స్టవ్ ఆఫ్ చేసేసి లైట్ గా చల్లారనివ్వాలి. -ఇప్పుడు ఓ స్టీల్ ప్లేట్ తీసుకొని దానీమిద 3 నెయ్యి చుక్కలు లేదా నూనె బొట్లు వేసి ప్లేట్ మొత్తం రుద్దాలి. -తర్వాత మ్యాంగో మిశ్రమాన్ని దానిమీద సన్నని లేయర్ గా స్ప్రెడ్ చేయండి. -ఇప్పుడు ఆ ప్లేట్ ని ఎండలో పెట్టి దానిమీద డస్ట్ పడకుండా పల్చటి గుడ్డ కప్పండి. -2-3 రోజులు బాగా ఎండిన తర్వాత గట్టి లేయర్ గా ఏర్పడుతుంది. ఇప్పుడు దాన్ని ప్లేట్ లో నుంచి ఎడ్జెట్ ను జరుపుతూ మెల్లిగా తీసేయండి. అంతే మామిడి తాండ్ర రెడీ. దీనిని మీకు నచ్చిన షేపులో కట్ చేసుకొని వాటిని బాక్సుల్లో పెట్టుకుంటే సంవత్సరం మొత్తం వీటిని ఆస్వాదించవచ్చు.

## ఈ మిల్లెట్ ఇడ్లీ వారానికోసారైనా తినాలి




మన తెలుగు ప్రజలు ఎక్కువగా తినే బ్రేక్ ఫాస్ట్ లలో ఇడ్లీ ప్రధానమైనది. అయితే ఎక్కవగా తెల్ల ఇడ్లీనే తింటుంటారు. అయితే రెగ్యులర్ గా అవే ఇడ్లీ తిని తిని కొందరికి బోర్ కొట్టేస్తుంటది? అయితే ఇళ్లల్లో మాత్రం అమ్మలు ఆరోగ్యానికి మంచిది అని ఇడ్లీనే ఎక్కువగా తయారుచేస్తుంటారు. అయితే మీ ఇళ్లల్లో కూడా పిల్లలు,పెద్దలు ఇడ్లీ బోర్ కొడుతుంది తినబుద్ధి కావట్లేదు అంటుంటే టేస్టీగా అదే సమయంలో ఆరోగ్యానికి మేలుచేసేలా సజ్జ ఇడ్లీ చేసి పెట్టండి. ఒక్కసారి తిన్నారంటే మళ్లీ మళ్లీ చేసిపెట్టాలని బతిమాలతారు. సజ్జలలో ఐరన్, జింక్ ఎక్కువగా ఉండటం వల్ల ఎముకలు ఉక్కులా బలంగా మారుతాయి. ఫైబర్ కంటెంట్ కూడా ఎక్కువగా ఉండటం వల్ల మలబద్దకం సమస్య ఉన్నోళ్లకి, డైట్ ఫాలో అయ్యేవాళ్లకి సజ్జలతో చేసిన ఇడ్లీ చాలా మేలు చేస్తుంది. టేస్టీగా,మెత్తడి దూదిలాంటి సజ్జ ఇడ్లీ ఎలా తయారుచేసుకోవాలో ఇక్కడ చూడండి.

సజ్జ ఇడ్లీ తయారీకి కావాల్సిన పదార్థాలు -మినపగుళ్లు -సజ్జ రవ్వ -ఉప్పు -వంటసోడా

సజ్జ ఇడ్లీ తయారీ విధానం -ముందుగా ఒక పెద్ద గిన్నె తీసుకొని అందులో 1 గ్లాసు మినపగుళ్లు వేసి నీళ్లు పోసి రెండుసార్లు శుభ్రంగా కడగండి. - తర్వాత నీళ్లు పోసి 4-5 గంటలు నానబెట్టుకోవాలి. - తర్వాత నానిన మినపగుళ్లలోని నీటిని 90శాతం వంపేసి మిగతావాటిని మినపగుళ్లతో సహా మిక్సీ గిన్నెలో వేసి వీలైనంత సాఫ్ట్ గా గ్రైండ్ చేసుకోవాలి. -తర్వాత ఓ పెద్ద గిన్నెలో 2 గ్లాసుల సజ్జ రవ్వ పోసి నీళ్లు పోసి శుభ్రంగా కడిగి నీళ్లు వంపేసి సజ్జ రవ్వను పక్కనపెట్టుకోండి. -ఇప్పుడు ఓ హాట్ బాక్స్ లేదా పెద్ద గిన్నెలో గ్రైండ్ చేసుకున్న పిండిని, కడిగిన సజ్జ రవ్వను వేసి బాగా కలిసేలా కలిపి మూతపెట్టేసి రాత్రంతా లేదా 7-8 గంటలు పక్కన ఉంచాలి. -తర్వాత మూత తీసి పులిసిన పిండి ఒకసారి కలిపి అందులో రుచికి సరిపడా ఉప్పు, పావు టీస్పూన్ వంటసోడా వేసి కలుపుకోవాలి. పిండి మరీ గట్టిగా ఉంటే కొన్ని నీళ్లు పోసుకొని కలపండి. -ఇప్పుడు ఇడ్లీ పాత్రలోకి పిండిని పెట్టి ఉడికించుకోవాలి. అంతే సజ్జ ఇడ్లీ రెడీ. దీనిని నచ్చిన చట్నీతో లేదా కారం పొడులతో తింటే టేస్ట్ ఇంకా అదిరిపోతుంది. కొన్ని ప్రయోజనాలు సజ్జ ఇడ్లీలు రుచికరమైనవే కాకుండా, ఆరోగ్యానికి కూడా చాలా మంచివి. మీ దినచర్యలో వీటిని చేర్చుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు పొందవచ్చు. సజ్జల్లో ఫైబర్ ఎక్కువ ఉండటం వల్ల కొద్దిగా తిన్నా కడుపు నిండిన భావన కలుగుతుంది. దీనివల్ల అతిగా తినడం తగ్గి, బరువు అదుపులో ఉంటుంది. అదేవిధంగా సజ్జల్లో ఉండే ప్రోటీన్ కండరాల నిర్మాణానికి, కణజాల మరమ్మత్తుకు సహాయపడుతుంది. సజ్జ పిండి శరీరంలోని విష పదార్థాలను బయటకు పంపడంలో సహాయపడుతుంది. దీనివల్ల మూత్రపిండాలు, కాలేయ సమస్యల నుండి రక్షణ పొందవచ్చు. సజ్జలకు తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంటుంది. అంటే ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను నెమ్మదిగా పెంచుతాయి కాబట్టి షుగర్ పేషెంట్లకు ఇవి చాలా మంచివి. సజ్జల్లో మెగ్నీషియం, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, గుండెపోటు, స్ట్రోక్ వంటి వాటిని నివారించడంలో తోడ్పడతాయి

# సినిమా న్యూస్



## హీరోగా తొలి ప్రయత్నంలో బ్లాక్ బాస్టర్ సక్సెస్ అందుకున్న డైరెక్టర్స్ వీళ్లే!



సినిమా ఇండస్ట్రీలో ఒక్కోసారి ఊహించని మలుపులు చోటుచేసుకుంటాయి. యాక్షన్ అని చెప్పే దర్శకులే మేకప్ వేసుకుని కెమెరా ముందుకు వచ్చి హీరోలుగా మారడం మనం చూస్తూనే ఉంటాం. అయితే, డైరెక్షన్ సీటు వదిలి హీరోగా అదృష్టాన్ని పరీక్షించుకుని, మొదటి సినిమాతోనే బాక్సాఫీస్ దగ్గర బ్లాక్‌బస్టర్ హిట్లు కొట్టిన కొందరు టాలెంటెడ్ దర్శకుల గురించి మీకు తెలుసా? మెగాఫోన్ పట్టిన చేతులతోనే మెగా హిట్లు కొట్టి హీరోలుగా సెటిల్ అయిన ఆ స్టార్ డైరెక్టర్ల సక్సెస్ స్టోరీస్ ఇప్పుడు చూద్దాం..

**క్రేజీ కాన్సెప్ట్‌లతో కట్టిపడేసిన యంగ్ డైరెక్టర్స్:**

ప్రస్తుత తరం దర్శకుల్లో ప్రదీప్ రంగనాథన్ పేరు మారుమోగిపోతోంది. 'కోమాలి' సినిమాతో డైరెక్టర్‌గా సత్తా చాటిన ఈ కుర్రాడు, తన రెండో సినిమా 'లవ్ టుడే'తో హీరోగా మారిపోయాడు. యువతకు కనెక్ట్ అయ్యే కథతో వచ్చి బాక్సాఫీస్‌ను షేక్ చేసి ఓవర్‌నైట్ స్టార్ అయ్యాడు. ఇక మన తెలుగు డైరెక్టర్ తరుణ్ భాస్కర్ కూడా 'పెళ్లి చూపులు'తో సెన్సేషన్ క్రియేట్ చేసి, ఆ తర్వాత 'మీకు మాత్రమే చెప్తా' సినిమాతో హీరోగా ఎంట్రీ ఇచ్చి మంచి విజయాన్ని అందుకున్నాడు. వీరు కేవలం డైరెక్షన్‌లోనే కాదు, యాక్టింగ్‌లో కూడా తమదైన మార్క్ చూపిస్తూ యూత్‌లో భారీ క్రేజ్ సంపాదించుకున్నారు.

**లెజెండరీ దర్శకుల సంచలన అడుగులు:**

ఒకప్పుడు డైరెక్టర్‌గా కల్ట్ క్లాసిక్ సినిమాలు తీసిన ఉపేంద్ర, ఎస్.జె. సూర్య వంటి వారు హీరోలుగా మారి సృష్టించిన ప్రభంజనం అంతా ఇంతా కాదు. కన్నడ ఇండస్ట్రీలో తన మార్క్ డైరెక్షన్‌తో షేక్ చేసిన ఉపేంద్ర, అప్పట్లో 'ఎ' సినిమాతో హీరోగా మారి సెన్సేషనల్ హిట్ అందుకున్నారు. ఇప్పటికీ ఆ సినిమా ఒక ట్రెండ్ సెట్టర్. అలాగే తమిళంలో 'వాలి', 'ఖుషి' వంటి బ్లాక్‌బస్టర్లు తీసిన ఎస్.జె. సూర్య, 'న్యూ' అనే సినిమాతో హీరోగా మారి తన విలక్షణ నటనతో అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇక రీసెంట్‌గా అభిషన్ జీవింత్ 'టూరిస్ట్ ఫ్యామిలీ' తర్వాత 'జీవింత్ విత్ లవ్' చిత్రంతో హీరోగా మారి తొలి సినిమాతోనే మంచి విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు.

**వారి సక్సెస్ సీక్రెట్ ఇదే:**

ఈ డైరెక్టర్లందరూ హీరోలుగా సక్సెస్ అవ్వడానికి ప్రధాన కారణం వారికి సినిమాపై ఉన్న ఇష్టం. కథలో ఏ ఎమోషన్ పండుతుందో, ఆడియన్స్‌కి ఏం కావాలో వారికి బాగా తెలుసు. అందుకే వారు హీరోలుగా మారినప్పుడు పాత్రల్లో పరకాయ ప్రవేశం చేసి ఆకట్టుకుంటున్నారు. ఇక వీరు కేవలం ఒక్క సినిమాకే పరిమితం కాకుండా హీరోలుగా వరుస అవకాశాలు అందుకుంటూ, అటు డైరెక్షన్‌ను ఇటు యాక్టింగ్‌ను బ్యాలెన్స్ చేస్తున్నారు. డైరెక్టర్ విజన్ కలిగిన హీరోలు కాబట్టే వీరి సినిమాలు నాచురల్ కు దగ్గరగా ఉంటూ బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తున్నాయి.దర్శకత్వం వహించడం ఒక ఎత్తు అయితే, కెమెరా ముందు నటిస్తూ మెప్పించడం మరో ఎత్తు. కానీ ఈ టాలెంటెడ్ డైరెక్టర్లు ఆ రెండు పడవల ప్రయాణాన్ని సక్సెస్ ఫుల్ గా సాగిస్తున్నారు. అటు మెగాఫోన్ పట్టినా.. ఇటు మేకప్ వేసినా.. వారి లక్ష్యం మాత్రం ప్రేక్షకులను అలరించడమే.


## ఆ దర్శకుడు అమాయకంగా కనిపిస్తాడు కానీ..



టాలీవుడ్ దర్శకుల్లో బుచ్చిబాబు సానా అదో రకం. తన అప్పీయరెన్స్ చూస్తే.. ఇతనేం డైరెక్టర్ అన్నట్లుగా ఉంటుంది. సుకుమార్ లాంటి పెద్ద దర్శకుడి స్కూల్ నుంచి వచ్చినప్పటికీ, తొలి సినిమా 'ఉప్పెన'తో వంద కోట్ల వసూళ్లు రాబట్టినప్పటికీ.. అతనేమీ బిల్డప్ ఇవ్వడు. ఇప్పటికీ సుకుమార్ దగ్గర అసిస్టెంట్ లాగే ప్రవర్తిస్తుంటాడు. సుకుమార్ దగ్గరే కాదు.. ఇంకే ఫిలిం సెలబ్రెటీ పక్కన ఉన్నా సరే.. చేతులు కట్టుకుని నిలబడతాడు. కుచించుకుపోయినట్లు కనిపిస్తాడు. స్టేజ్ మీద మాట్లాడేటపుడు కూడా అదే తీరు. తాజాగా అతను అల్లు శిరీష్ ప్రి వెడ్డింగ్ రిసెప్షన్‌కు వచ్చాడు. అక్కడ కూడా చేతులు కట్టుకుని వినమ్రంగా నిలబడ్డాడు. ఈ విషయంలో అతి వినయం ప్రదర్శిస్తాడంటూ అతణ్ని ట్రోల్ చేసే వాళ్లు కూడా లేకపోలేదు. కానీ అతడిలో ఏ మార్పూ ఉండదు. ఏ మాత్రం ఆత్మవిశ్వాసం లేనట్లు, అమాయకుడన్నట్లుగా కనిపిస్తాడు కానీ.. తన పనితనం చూస్తే మాత్రం ఆశ్చర్యం కలగక మానదు.రామ్ చరణ్ లాంటి టాప్ స్టార్‌తో 'పెద్ది' సినిమా చేస్తున్న బుచ్చిబాబు.. ఈ మూవీ నుంచి రిలీజ్ చేసిన ప్రతి ప్రోమోతోనూ అమితంగా ఆకట్టుకున్నాడు. ఫస్ట్ గ్లింప్స్ ఎంత వైరల్ అయిందో తెలిసిందే. ముఖ్యంగా బ్యాటింగ్ మూమెంట్ అంతర్జాతీయ స్థాయికి వెళ్లిపోయింది. తర్వాతి చికిరి పాట అంతకుమించి సెన్సేషన్ క్రియేట్ చేసింది. తాజాగా 'రారా రైరా' అంటూ సాగే పాటను రిలీజ్ చేస్తే.. ఇదీ ఇన్‌స్టంట్ హిట్టయింది. ఇందులో విజువల్స్, ఫ్రేమ్స్, చరణ్ డ్యాన్స్ మూమెంట్స్ చూసి అందరూ షాకైపోయారు.

ఒక చిన్న సినిమా తీసిన దర్శకుడు చరణ్ లాంటి టాప్ స్టార్‌ను డీల్ చేస్తున్న విధానం.. టెక్నీషియన్ల నుంచి రాబట్టుకుంటున్న పనితనం.. ఓవరాల్ ఔట్ పుట్.. ఆ క్వాలిటీ అదీ చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారు. ఒక స్పెషల్ మూవీ చూడబోతున్న ఫీలింగ్ అతను తెప్పిస్తున్నాడు. తెలుగు సినిమాలతో పెద్దగా అసోసియేషన్ లేని ఏఆర్ రెహమాన్‌ను 'పెద్ది'ని ఇంతగా ఓన్ చేసుకుని అదిరిపోయే పాటలు ఇస్తుండడంలోనూ బుచ్చిబాబు శ్రద్ధ స్పష్టంగా కనిపిస్తోంది. పైకి అమాయకంగా కనిపిస్తాడు కానీ.. బుచ్చిబాబు అసాధ్యుడు అనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. మొత్తంగా సినిమాలోనూ ఇదే ఔట్ పుట్ తీసుకురాగలిగితే 'పెద్ది'తో అతడి రేంజే మారిపోవడం ఖాయం.

## ట్రోలింగ్‌కు బ్రేక్... సోషల్ మీడియాకు దూరంగా ఆలియా భట్!



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఆలియా భట్ మరోసారి వార్తల్లో నిలిచారు. సెలబ్రిటీలు తరచుగా సోషల్ మీడియా విమర్శలు, ట్రోలింగ్, వ్యక్తిగత ఒత్తిళ్ల మధ్య దాన్నుంచి కొంత విరామం తీసుకోవడం సాధారణమే. ఇప్పటికే పలువురు స్టార్‌లు ఇలాంటి నిర్ణయాలు తీసుకున్న నేపథ్యంలో, తాజాగా ఆలియా కూడా సోషల్ మీడియా బ్రేక్ తీసుకోవాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం.

ఆలియా స్టేజ్ షో పై సోషల్ మీడియాలో విమర్శలు

ఇటీవలి కాలంలో ఆమె ఇంటర్నేషనల్ స్టేజ్‌లపై చేసిన ప్రదర్శనలు, ఫ్యాషన్ అప్పియరెన్సులు సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీశాయి. కొంతమంది నెటిజన్లు ఆమె స్టైల్, ఎంపికలపై విమర్శలు గుప్పించగా, మరికొందరు వ్యక్తిగత వ్యాఖ్యలు కూడా చేశారు. ఈ ట్రోలింగ్ ఆమెను లోపల నుంచి ప్రభావితం చేసినట్టుగా సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. బయటకు ఎంత నిర్లక్ష్యంగా కనిపించినా, నిరంతర విమర్శలు ఎంతటి వారినైనా మానసికంగా కలవరపెడతాయని ఆమెకు దగ్గరైన వ్యక్తులు వెల్లడించారు.


సోషల్ మీడియాకు దూరంగా ఆలియా

ఈ నేపథ్యంలో, ఆలియా కొంతకాలం పాటు సోషల్ మీడియా దూరంగా ఉండి, పూర్తిగా తన కెరీర్ పరమైన కమిట్‌మెంట్స్‌పై దృష్టి సారించాలని భావిస్తున్నట్టు సమాచారం. ముఖ్యంగా ప్రముఖ డైరెక్టర్ సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కిస్తున్న లవ్ అండ్ వార్ సినిమాపై ఆలియా స్పెషల్ ఫోకస్ చేయనున్నట్టు తెలుస్తోంది. ఈ సినిమాలో ఆలియా తన భర్త రణ్‌బీర్ కపూర్‌తో కలిసి నటించనున్నారు. సినిమా రిలీజ్ టైమ్ కు మాత్రమే ఆమె ప్రమోషన్ల కోసం మళ్లీ ప్రజల్లోకి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఫ్యామిలీకి టైమ్ కేటాయించాలని నిర్ణయం

అప్పటివరకు పబ్లిక్ అపియరెన్సులు, ఈవెంట్లు, అవార్డు ఫంక్షన్లు వంటి కార్యక్రమాలకు విరామం ఇవ్వాలని ఆలియా నిర్ణయించుకున్నట్టు సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి. వ్యక్తిగతంగా కుటుంబంతో గడిపే సమయాన్ని పెంచుకోవాలనే ఆలోచన కూడా ఈ నిర్ణయానికి కారణమై ఉండొచ్చని తెలుస్తోంది. తన కూతురితో ఎక్కువ టైమ్ గడపాలని ఆలియా భావిస్తున్నారని సమాచారం. సోషల్ మీడియా ప్రస్తుతం సెలబ్రిటీలకు ఫ్యాన్స్ తో డైరెక్ట్ గా అనుసంధానం కల్పించే ప్రధాన వేదిక. అయితే అదే సమయంలో విమర్శలు, అపోహలు, అసత్య ప్రచారాలకు కూడా దారి తీస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో మానసిక ప్రశాంతత కోసం కొంత విరామం తీసుకోవడం సహజమేనని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ఆలియా భట్ తీసుకున్న ఈ నిర్ణయం తాత్కాలికమేనా, లేక దీర్ఘకాలికమా అన్నది ఇంకా స్పష్టత రాలేదు. అయితే ఆమె ఫ్యాన్స్ మాత్రం సోషల్ మీడియాలో ఆమె అప్డేట్స్ కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. తన టాలెంట్ తో, సెలెక్షన్ తో ఎప్పటికప్పుడు కొత్తదనం చూపించే ఆలియా, ఈ విరామం అనంతరం మరింత ఉత్సాహంతో తిరిగి వస్తారనే నమ్మకం అభిమానుల్లో వ్యక్తమవుతోంది.

## 'టాక్సిక్' బజ్ ఓకే..కానీ ఆ ధైర్యమేంటో!



పాన్ ఇండియా వైడ్‌గా సంచలనం సృష్టించిన –కేజీఎఫ్–కి ముందు యష్ అంటే కన్నడలో తప్ప ఇతర దక్షిణాది భాషల్లో ఎవరో ఎవరికీ తెలియదు. అలాంటి యష్‌ని దేశ వ్యాప్తంగా పాపులర్ అయ్యేలా చేయాడమే కాకుండా కన్నడ ఇండస్ట్రీకి దేశ వ్యాప్తంగా తిరుగులేని క్రేజ్‌ని తెచ్చి పెట్టింది. దీంతో కన్నడ సినిమాకు పాన్ ఇండియా వైడ్‌గా మంచి బజ్ క్రియేట్ అయింది. అలా కేజీఎఫ్ పుణ్యమా అని కన్నడ స్టార్స్ పాన్ ఇండియా సినిమాలకు శ్రీకారం చుట్టడం మొదలు పెట్టారు. అయితే ఈ విషయంలో రిషభ్ శెట్టి సక్సెస్ అయ్యాడే కానీ మిగతా వారు సక్సెస్ కాలేకపోయారు. దీంతో యష్ అంటే కర్ణాటకలోనే కాకుండా దక్షిణాదితో పాటు ఉత్తరాదిలోనూ మంచి క్రేజ్ ఏర్పడింది. –కేసీఎఫ్ 2– బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకున్న తరువాత యష్ నుంచి –కేజీఎఫ్ 3– వస్తుందని అంతా ఊహించారు. అయితే దానికి భిన్నంగా లేడీ డైరెక్టర్ గీతూ మోహన్ దాస్‌తో యష్ –టాక్సిక్– మూవీని చేయడం తెలిసిందే. అత్యంత భారీ బడ్జెట్‌తో హాలీవుడ్ సినిమాల స్థాయిలో రూపొందిన ఈ సినిమా ఇప్పటికే విడుదల చేసిన గ్లింప్స్ విమర్శల్ని ఎదుర్కోవడంతో టాక్సిక్ దేశ వ్యాప్తంగా వైరల్ అయింది. నెగెటివ్ ప్రచారం జరిగినా భారీ స్థాయిలో ఈ మూవీకి ఫ్రీ ప్రమోషన్ లభించింది. అఫీషియల్ టీజర్‌ని జనవరి 20న విడుదల చేశారు. దీంతో సినిమాపై అంచనాలు తారా స్థాయికి చేరుకున్నాయి. సినిమా బిజినెస్ రికార్డు స్థాయిలో జరిగింది. బజ్ కూడా భారీగానే ఉంది. మార్చి 19న దక్షిణాది భాషలతో పాటు హిందీ, ఇంగ్లీష్ భాషల్లో భారీ స్థాయిలో రిలీజ్ కు ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే ఏరియాల వైజ్‌గా బిజినెస్ కూడా పూర్తయింది. గ్లింప్స్, టీజర్‌లతో దేశ వ్యాప్తంగా ఈ మూవీపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే రిలీజ్ సమయం దగ్గరపడుతున్నా టీమ్‌లో ఎలాంటి పరుగు కనిపించకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. బజ్‌కు తగ్గట్టుగా మేకర్స్ ప్రమోషన్స్ ఎందుకు చేయడం లేదని, పేరే తెలియని డైరెక్టర్ సినిమా విషయంలో ఇంత ధైర్యం ఏంటో అని కన్నడ ఆడియన్స్ వాపోతున్నారు. ప్రమోషన్స్ విషయంలో స్పీడు పెంచాల్సింది పోయి ఇలా నత్తనడకన పని చేస్తున్నారనే కామెంట్‌లు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఈ రేంజ్ సినిమాని ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లేది పాటలే. అవే ఇప్పుడు –టాక్సిక్–కు మైనస్ అవుతున్నాయి. రీసెంట్‌గా –తబాహి– పాటని విడుదల చేశారు. యష్, కియారాలపై షూట్ చేసిన ఈ పాటకు సంబంధించిన విజువల్స్ లేకుండానే కేవలం ఒక ఫోటోతో పాటని రిలీజ్ చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మిగతా సినిమాలు ఇప్పటికే ఆడియోతో నేషనల్ వైడ్‌గా సెన్సేషన్ క్రియేట్ చేస్తూ సినిమాపై భారీ బజ్‌ని సొంతం చేసుకుంటుంటూ –టాక్సిక్– టీమ్ మాత్రం ప్రమోషన్స్‌ని అనుకున్న స్థాయిలో చేయడం లేదని పలువురు వాపోతున్నారు. మార్చి 19నే సంచలన మూవీ –ధురంధర్ 2– కూడా రిలీజ్ అవుతున్న నేపథ్యంలో అందుకు తగ్గట్టుగా ప్రమోషన్స్‌తో అదరగొట్టాల్సిన –టాక్సిక్– చాలా కూల్‌గా వ్యవహరిస్తుండటం, ఎలాంటి హడావిడీని ప్రదర్శించకపోవడం షాక్‌కు గురి చేస్తోంది. ఇప్పటి వరకు ట్రైలర్ రిలీజ్ చేయలేదు. మరి ట్రైలర్‌తో దేశ వ్యాప్తంగా హంగామా మొదలు పెడతారో వేచి చూడాల్సిందే.

### తొలి దళిత స్పీకర్ బాలయోగి వర్ధంతి సందర్భంగా

# లోకేష్ నివాళులు



మార్చి 3 : లోక్‌సభ తొలి దళిత స్పీకర్, టీడీపీ సీనియర్ నాయకుడు జీఎంసీ బాలయోగి వర్ధంతి సందర్భంగా రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ నివాళులర్పించారు. సామాన్య కుటుంబంలో జన్మించి లోక్‌సభ సభాపతిగా ఎదిగి.. దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు.'లోక్‌సభ తొలి దళిత స్పీకర్, టీడీపీ సీనియర్ నేత స్వర్గీయ జీఎంసీ బాలయోగి గారి వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పిస్తున్నాను. ఆయన.. దళితులు, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషిచేశారు. సామాన్య కుటుంబంలో జన్మించి లోక్‌సభ స్పీకర్‌గా ఎదిగారు. దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు. దేశానికి, రాష్ట్రానికి వారు అందించిన సేవలు చిరస్మరణీయం. కోనసీమ ముద్దుబిడ్డ బాలయోగి గారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరం కృషిచేద్దాం' అని తన ఎక్స్ ఖాతాలో రాసుకొచ్చారు లోకేశ్. 1951లో జన్మించిన బాలయోగి.. 1991లో తెలుగుదేశం పార్టీ తరఫున 10వ లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1996లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ రాజకీయంగా తన ఉనికిని కొనసాగించారు. ఆ తర్వాత ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఉప ఎన్నికలో ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఎన్నికయ్యారు. ఆ తర్వాత రాష్ట్ర ఉన్నత విద్యా మంత్రిగా సేవలందించారు. 1998లో మరోసారి ఆయన పార్లమెంటుకు ఎన్నికయ్యారు. దాంతో లోక్‌సభ స్పీకర్‌గా నియమితులై.. తొలి దళిత వ్యక్తిగా గుర్తింపు పొందారు. చివరకు 2002 మార్చి 3న ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా కైకలూరులో బెల్ 206 హెలికాప్టర్ ప్రమాదంలో బాలయోగి మృతిచెందారు.

## రాజ్యసభ రేసులో నలుగురు బీసీ నేతలు

మొదటిపేజీ తరువాయి

పాకిస్థాన్‌తో చర్చలకు ఒప్పుకున్న మోదీ మావోయిస్టులతో చర్చలకు ఒప్పుకోలేదని విమర్శించారు. వారి సిద్ధాంతంతో తమకు భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, ప్రజల కోసం పోరాడిన వారిపై గౌరవం ఉంటుందని చెప్పారు. తామైనా, మావోయిస్టులయినా పేద ప్రజల కోసమే పోరాటం చేశామని.. లొంగిపోయిన మావోయిస్టులు కాంగ్రెస్ పార్టీలోకి వస్తే ఆహ్వానిస్తామని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

## ప్రభుత్వ ఆలోచనలు, ప్రజల ఆకాంక్షల మేరకు పనిచేయండి

మొదటిపేజీ తరువాయి

మీ భవిష్యత్తుకు పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం గత రెండేళ్లలో పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని మంత్రి గుర్తు చేశారు. ఈ పథకాలను అర్హులైన ప్రతి పేదవాడికి చేర్చవలసిన బృహత్తర బాధ్యత కలెక్టర్లదేనని ఆయన స్పష్టం చేశారు. సంక్షేమం , అభివృద్ధిని బ్యాలెన్స్ చేస్తూ జిల్లాను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.ప్రజాపాలనలో 'ప్రజలే కేంద్రంగా' పాలన సాగాలని మంత్రి కలెక్టర్లకు దిశానిర్దేశర చేశారు. ప్రభుత్వ ప్రాధాన్యతలను అర్థం చేసుకుంటూనే, స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా పని చేయాలి. అధికార యంత్రాంగం అంతా ఒక టీమ్‌లా కలిసి పనిచేసి, ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవాలని ఆయన చెప్పారు. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉండి, క్షేత్రస్థాయిలో అన్ని అంశాలపై పట్టు సాధించాలని ఆయన అధికారులకు సూచించారు.

## ఆ ఐదు గ్రామాలను తెలంగాణలో కలపాలి

మొదటిపేజీ తరువాయి

సంస్థల్లో కఠినమైన పాలసీలు తీసుకురావటం ద్వారానే లడ్డూ కల్తీ లాంటి సమస్యలు ఆగుతాయని స్పష్టం చేశారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు నిజాయితీగా ఉంటే ఎవరూ ఏమీ చేయలేరని, శ్రీలక్ష్మి చేసిన చిన్న తప్పిదం వలన ఆమె కెరీర్ దెబ్బతిందన్నారు. బాధ్యతాయుతంగా ఉండాల్సిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ప్రలోభాలకు లొంగడంతోనే వ్యవస్థలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాకినాడ లో జరిగిన దుర్ఘటనకు పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే అని నారాయణ పేర్కొన్నారు. కల్తీ పాలు తాగటం వలన ప్రజలు చనిపోతున్నారని, డెయిరీలపై ప్రభుత్వ నియంత్రణ ఏమైందని ప్రశ్నించారు. నక్సలైట్లను చంపవచ్చు కానీ నక్సలిజాన్ని అంతం చేయలేరన్నారు. పేదరిక నిర్మూలన జరిగితే నక్సలిజం అవసరమే రాదన్నారు. అరవింద్ కేజ్రీవాల్‌ను అణగదొక్కాలని అవినీతి మరక అంటించారని ఆరోపించారు. ప్రధాని మోడీ, అమిత్ షా కనుసన్నల్లోనే సీబీఐ పనిచేస్తుందన్నారు. గత ప్రభుత్వానికి కూటమి ప్రభుత్వానికి తేడా ఏమీ లేదన్నారు. అగ్రిగోల్డ్ ఆస్తులు ఆరు వేల కోట్లు ఉన్నాయని.. రెండు వేల కోట్లు విడుదల చేస్తే బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు. అగ్రిగోల్డ్ కేసును సీఎం చంద్రబాబు మధ్యవర్తిత్వానికి అప్పగించాలని నారాయణ కోరారు. అమెరికాకు ఎవరు ఎదురు తిరిగినా వారిపై ఆ దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దాడులకు దిగడం దారుణమని సీపీఐ జాతీయ నేత నారాయణ అన్నారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దేశాల యుద్ధం ఆందోళన కలిగిస్తుందన్నారు. ఇరాన్ తన స్వయం ప్రతిపత్తిని కాపాడుకునే ప్రయత్నంగా యుద్ధం చేస్తుందన్నారు. దురాక్రమణ చేసేందుకే పలు కారణాలు చూపి యుద్ధం ప్రారంభించిందని అమెరికాపై మండిపడ్డారు. ప్రధాని మోడీ చొరవ తీసుకుని ప్రపంచ దేశాల సమన్వయంతో ట్రంప్‌తో మాట్లాడి యుద్ధం ఆపేలా ప్రయత్నం చేయాలని కోరారు.

# జిల్లాలో హౌస్ లిస్టింగ్, హౌస్ సెన్సెస్ పై మార్చి 3 వ తేదీ నుండి మూడు రోజులు శిక్షణా తరగతుల నిర్వహణ

### జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్



తిరుపతి, మార్చి 3 : సెన్సెస్-2027 లో భాగంగా మొదటి విడతలో హౌస్ లిస్టింగ్, హౌస్ సెన్సెస్ చేపట్టడం జరుగుతుందని, పూర్తి డిజిటల్ విధానం లో నిర్వహించే ప్రక్రియ పై మార్చి 03 నుండి 05 వ తేదీ వరకు మూడు రోజులు శిక్షణా తరగతులు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం తిరుపతి ఎస్ వి యూనివర్సిటీ ప్రకాశం భవన్ లో జిల్లాలో నిర్వహించనున్న సెన్సెస్ -2027 లో భాగంగా మొదటి విడతలో నిర్వహించే హౌస్ లిస్టింగ్, హౌస్ సెన్సెస్ పై జిల్లా స్థాయి మరియు సంబంధిత అధికారులకు నిర్వహించనున్న మూడు రోజుల శిక్షణ తరగతులను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ క్రమంలో జే సి ఆర్. గోవిందరావు, ట్రైనీ కలెక్టర్ రఘు వాన్సీ, డి ఆర్ ఓ, రాష్ట్ర స్థాయి సెన్సెస్ అసిస్టెంట్ డైరెక్టర్ కే.సుప్రీజ్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న సెన్సెస్-2027 కార్యక్రమం దాదాపు 15 సం.ల అనంతరం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియ గతం కంటే భిన్నంగా పూర్తి డిజిటల్ విధానంలో నిర్వహించడం జరుగుతుందని, ఇందుకు గానూ సెన్సెస్ మేనేజ్మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ (జవీమీా) ను రూపొందించిందన్నారు. హౌస్ లిస్టింగ్, హౌస్ సెన్సెస్ ప్రక్రియను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించవలసి ఉంటుందని. అధికారులు తమ విధిని నిబద్ధత తో నిర్వహించాలన్నారు. జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ ప్రధాన సెన్సెస్ అధికారిగా వ్యవహరిస్తారని, జాయింట్ కలెక్టర్ అదనపు సెన్సెస్ అధికారిగా, డి ఆర్ ఓ జిల్లా సెన్సెస్ అధికారిగా ఉంటారన్నారు. కార్పొరేషన్ స్థాయిలో కమిషనర్ ప్రధాన సెన్సెస్ అధికారిగా వ్యహరిస్తారన్నారు. మండల స్థాయిలో సూపర్వైజర్ లు, ఎన్యూమరేటర్లు ఉంటారన్నారు. ఈ ప్రక్రియలో పాల్గొంటున్న సిబ్బంది ఎప్పటికప్పుడు తమ పై అధికారుల సూచనలను పాటించవలసి ఉంటుందన్నారు. శిక్షణా తరగతులలో భాగంగా మెటీరియల్ ను అందించడం జరుగుతుందన్నారు. మెటీరియల్ చదివి పూర్తి అవగాహనతో ఎన్యూమరేటర్లకు వివరించాలన్నారు. జిల్లాలో సెన్సెస్ కార్యక్రమం ను రాష్ట్ర స్థాయి నుండి ఒక ప్రత్యేక అధికారి పర్యవేక్షించడం జరిగిందన్నారు. మాస్టర్ ట్రైనర్ లను త్వరలో ఎంపిక చేసి ఫీల్డ్ ట్రైనర్ లకు శిక్షణ ఇస్తారని, ఫీల్డ్ ట్రైనర్ లు మండల, మున్సిపల్ పరిధిలో ఛార్జ్ ఆఫీసర్ లకు, సూపర్వైజర్ లు, ఎన్యూమరేటర్లకు శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. డిజిటల్ విధానంలో నిర్వహించే ప్రక్రియను నిర్దేశించిన విధానంలో తప్పులు లేకుండా నిర్వహించాలన్నారు.

## ఇరాన్ అధినేతను హత్య చేసినా నోరు మెదపరా

మొదటిపేజీ తరువాయి

ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా బి.వి.రాఘవులు మాట్లాడుతూ వెంటనే ఈ దాడులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. నేడు అమెరికా పలు అబద్ధాలను చెప్పి ప్రపంచ ప్రజానీకాన్ని మభ్యపెట్టి యుద్ధాన్ని మారణహోమాన్ని సమర్థించుకుంటుందని, ట్రంప్ ప్రయత్నాన్ని ప్రపంచ ప్రజలంతా, శాంతి కాముకులంతా ఖండించాలని కోరారు. అన్ని సందర్భాలలో భారతదేశానికి గట్టి మిత్రుడిగా ఉన్న ఇరాన్ పై మరో దేశం దాడి చేసి ధ్వంసం చేస్తుంటే దాన్ని ఖండించాల్సిందిపోయి ఇంతవరకు భారత ప్రధాని నోరు మెదపకపోవడం దుర్మార్గమన్నారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దుర్మార్గంగా జరుపుతున్న దాడిని కేంద్రంలో భాగస్వామిగా ఉన్న టిడిపి, జనసేన కూటమి, ప్రతిపక్ష వైసిపి ఖండించాలని బి.వి.రాఘవులు కోరారు. ప్రధాని మోడీ ఇజ్రాయిల్ నాయకత్వంతో మాట్లాడి వచ్చిన తరువాతే ఇరాన్‌పై దాడి జరిగిందని, దాడి గురించి ముందే మోడీకి తెలిసి ఉండాలని అన్నారు. బలమైన నిఘా వ్యవస్థ ఉందని చెబుతున్న కేంద్రం దీన్ని ఎందుకు పసిగట్టలేకపోయిందో చెప్పాలన్నారు. లేక దాడి విషయం ముందే తెలిసి ఇజ్రాయిల్ ప్రధానిని కలిశారా? అదైనా బయటపెట్టాలన్నారు. ఇరాన్ అన్ని సందర్భాల్లోనూ భారత దేశానికి మంచి మిత్రుడిగా ఉందని, అయినా ఆ దేశ అధినాయకుడిని చంపేస్తే స్పందించకుండా యుఏఈలో అమెరికా ఎయిర్‌బేస్‌ను ధ్వంసం చేశారనే అంశంపై మాత్రమే స్పందించడం అన్యాయమని తెలిపారు. ఇరాన్‌పై దాడితో ప్రపంచ ఆర్థిక పరిస్థితి ముఖ్యంగా ఇండియా పరిస్థితి దెబ్బతినే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇరాన్‌పై దాడిని నిలిపేయాలని అన్ని దేశాలూ డిమాండు చేయాలని అన్నారు. ఇరాన్‌తో చర్చలు జరుగుతున్నాయని, సఫలమవుతున్నాయని అనుకున్న సమయంలోనే అమెరికా, ఇజ్రాయిల్ దాడి చేసి చర్చలకు విఘాతం కలిగించాయని అన్నారు. అప్రజాస్వామికంగా స్కూళ్లపై దాడిచేసి విద్యార్థులను చంపేసిందని తెలిపారు. తమపై దాడి చేస్తారనే ఉద్దేశంతోనే తాము దాడిచేశామని ట్రంప్ చెబుతున్న మాటలు అబద్ధాలని, ఇరాన్ అటువంటి ఆలోచనలు చేయడం లేదని పెంటగాన్ నివేదిక తెలిపినా దాడి చేశారని తెలిపారు. అయితే మోడీ దెబ్బతినిపోతున్న ఇరాన్ తరుపున కాకుండా దాడి చేస్తున్న దేశం తరుపున ' మిత్రులు, శత్రువులకు తేడా తెలియకుండా వ్యవహరించారని అన్నారు. ఈ విషయంలో అమెరికా వ్యూహంలో మోడీ భాగస్వామ్యం అయ్యారని, ఇజ్రాయిల్ తరుపున స్పందించి దేశ ప్రతిష్టను దిగజార్చారని తెలిపారు. ఇరాన్‌లో శుద్ధి కేంద్రాలను ధ్వంసం చేశామని గతంలోనే చెప్పిన అమెరికా అదే సాకుతో ఇప్పుడు దాడిచేయడం అమానుషం అన్నారు. కేంద్రం తీసుకొస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై మార్చి 24వ తేదీన సిపిఎం ఆధ్వర్యాన ఢిల్లీలో ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నామని రాఘవులు తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బతీసే విధంగా చట్టాలు అమలు చేస్తోందని, వాటిని ఉపసంహరించుకోవాలని డిమాండు చేస్తున్నామని అన్నారు. జీరాంజీ కొత్త చట్టాన్ని తీసుకురావడం వల్ల పేదలు ఉపాధి కోల్పోయారని, దీన్ని ఉపసంహరించాలనేది ప్రధాన డిమాండని పేర్కొన్నారు. నాలుగు లేబర్‌కోడ్‌లు వెనక్కు తీసుకోవాలని, విద్యుత్ సవరణ చట్టాన్ని, న్యూక్లియర్ లయబిలిటీ బిల్లునూ తీసుకువచ్చారని, వాటిని రద్దు చేయాలని సిపిఎం డిమాండు చేస్తోందని పేర్కొన్నారు. ఇవి కాకుండా విదేశీ విత్తన కంపెనీల కోసం సీడ్‌బిల్లును తీసుకువస్తుందని అన్నారు. మరోవైపు అమెరికా 18 శాతం ట్యాక్సు విధించిందని తెలిపారు. వీటికి వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యాన దేశ వ్యాప్తంగా ప్రదర్శనలు జరిపి మార్చి 24న డిల్లీలో కార్యక్రమాలు చేస్తున్నామని అన్నారు.

## ప్రజలకు సంక్షేమ పథకాలు చేరవేయాలి

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా చర్చించారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.మరోవైపు పలువురు కలెక్టర్లపై సీఎం సీరియస్ అయ్యారు. కొంత మంది కలెక్టర్లు జిల్లా హెడ్ క్వార్టర్ లో ఉండటం లేదన్నారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి క్షేత్రస్థాయిలో అందుబాటులో లేకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. అలాంటి వారు తమ పని తీరు మార్చుకోవాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. 99 రోజుల పాటు జిల్లా విడిచి వెళ్లొద్దని ఆదేశించారు. ఈ గడువులోగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పాలనను పరుగులు పెట్టించాలని సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశర చేశారు. 99రోజుల పాటు జిల్లాను విడిచి వెళ్లొద్దని సీఎం ఆదేశించారు. రాజధాని శివారు జిల్లాల కలెక్టర్లు.. సీఎస్ కె.రామకృష్ణారావు అనుమతి లేకుండా హైదరాబాద్ వస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో వేగం పెంచే లక్ష్యంతో ఈ నెల 6 నుంచి జూన్ 12 వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక పేరుతో 99 డేస్ యాక్షన్ ప్లాన్ అమలు చేయబోతోందన్నారు. జిల్లాల్లో బాగా పని చేసిన కలెక్టర్లకు సీఎం గ్రేడింగ్ ఇవ్వబోతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తాజా మీటింగ్‌లో పనితీరు ఆధారంగా కలెక్టర్లకు సీఎం గ్రేడింగ్ ఇవ్వనున్నారని ఆశించిన మేరకు పని తీరు చూపని కలెక్టర్లకు దిశానిర్దేశర చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో పలువురు మంత్రులు, సీఎస్, ఉన్నతాధికారులు, కలెక్టర్లు పాల్గొన్నారు. ఈనెల 6 నుంచి జూన్ 12 వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికను నిర్వహిస్తుంది. అయిదు దశల్లో 99 రోజుల పాటు జరిగే కార్యక్రమానికి నోడల్ శాఖ గా వ్యవహరిస్తున్న ప్రణాళిక శాఖ యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసింది. ఏప్రిల్ 2న గ్రామ స్థాయిలో గ్రామ సభల నిర్వహణ, ఏప్రిల్ 16న మండల స్థాయిలో, మే 2న నియోజకవర్గ స్థాయి , మే 22న జిల్లా స్థాయిలో కార్యక్రమాలు ఉంటాయని ఆ శాఖ వెల్లడించింది. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుక నిర్వహించనున్నట్లు తెలిపింది. 10 వివిధ థీమ్‌లతో శాఖల వారీగా 99 రోజుల కార్యక్రమం ఉంటుందని వివరించింది. మొదటి థీమ్‌లో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ ఆఫీసుల్లో పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్ , రెండవ థీమ్‌లో ఆరోగ్యం 3లో అరైవ్.. అలైవ్, 4లో సంక్షేమం , 5లో పిల్లల భద్రత.. డ్రగ్స్ కు అడ్డుకట్ట, 6లో రైతు సంక్షేమం.. వ్యవసాయంపై కార్యక్రమాల నిర్వహణ ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. 7లో విద్య, 8లో యువత.. క్రీడలు, 9లో మహిళలు , 10వ థీమ్‌లో పర్యావరణంపై సమావేశాలు జరుగుతాయని తెలిపారు. మార్చి 6న అన్ని ఉమ్మడి జిల్లాల్లో మంత్రుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు , 99 రోజుల్లో శాఖల వారీగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలుంటాయని వివరించింది. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమ పర్యవేక్షణకు ప్రత్యేక మొబైల్ యాప్‌ను తయారు చేశామని వెల్లడించింది.

## ఖజానా ఖాళీ పేరుతో హామీలకు ఎగనామం

మొదటిపేజీ తరువాయి

వివరించారు. ఇందులో పన్నుల వాటా రూ.2.5 లక్షల కోట్లు, రహదారులు రూ.1.85 లక్షల కోట్లు, రైల్వే బ్జడెట్ కేటాయింపులు రూ.36000 కోట్లకు పైగా, రైల్వే పనులకు మరో రూ. 50,000 కోట్లు, ఉపాధి హామీ రూ.40,000 కోట్లు, విద్యుత్ ప్రాజెక్టులు రూ.12,000 కోట్లు, పీఎం కిసాన్ నిధులు రూ.14,000 కోట్లు, ఉచిత రేషన్ రూ.50,000 కోట్లు, ఎరువుల సబ్సిడీ కోసం రూ.80,000 కోట్లు, విద్య.. క్రీడలకు రూ.21,000 కోట్లు, ఆరోగ్య సంరక్షణకు రూ.9,000 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. కేంద్రప్రభుత్వం గత 12 సంవత్సరాల కాలంలో రైతుల నుంచి వరి సేకరణకు రూ.2.6 లక్షల కోట్లు, పత్తి సేకరణకు రూ.60,000 కోట్ల కనీస మద్దుత ధర చెల్లించినట్లు తెలిపారు. కేంద్ర ఆర్థిక సంస్థల ద్వారా రూ.10 లక్షల కోట్ల ఋణాలు అందించారని చెప్పారు. 'స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ పథకం కింద వడ్డీ రహిత ఋణాలుగా రూ.10,000 కోట్లు పైగా ఇచ్చి మూలధన ప్రాజెక్టులకు సహకరించారని కేంద్రమంత్రి వివరించారు. ఈ నిధులతో మురుగునీటి నాళాలు, రోడ్లు, రైల్వేలు, బ్రిడ్జిలు, ఆసుపత్రులు, మెడికల్- నర్సింగ్ కాలేజీలు, పాఠశాలలు, హాస్టళ్లు, పర్యాటక ప్రాంతాలలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఓఆర్ఆర్-ఆర్ఆర్ఆర్ మధ్య రేడియల్ రోడ్ల నిర్మాణం, గోదావరి-మూసీ నది అనుసంధానం, మూసీ నది సుందరీకరణ, స్మార్ట్ సిటీ మిషన్‌లో రాష్ట్ర వాటా నిధులు, వరదల వలన పాడైపోయిన నిర్మాణాల పునరుద్ధరణ, ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజనలో రాష్ట్ర వాటా నిధులు వంటి అనేక ప్రాజెక్టులకు సాస్కి నిధులను ఖర్చు చేశారు. ముఖ్యంగా ఎంఎంటీఎస్ ఫేజ్-ఎఎ కోసం రూ.200 కోట్లు, మనోహరాబాద్-కొత్తపల్లి రైల్వేలైన్ కోసం రూ.114 కోట్లు, స్మార్ట్ సిటీస్ పథకం కోసం రూ.315 కోట్లు, పీఎం గ్రామ సడక్‌యోజన కోసం రూ. 674 కోట్లు, ఓఆర్ఆర్-ఆర్ఆర్ఆర్ మధ్య రేడియల్ రోడ్ల నిర్మాణం కోసం రూ.200 కోట్లు, సిద్ధిపేట బైపాస్ రోడ్డు కోసం రూ.110 కోట్లు, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలల కోసం రూ. 388 కోట్లు, పలు హాస్టళ్ల నిర్మాణం కోసం రూ.300 కోట్లు వంటి ప్రాజెక్టులు ఉన్నాయని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం.. జీతాలు, సంక్షేమ పథకాలు, రైతు భరోసా వంటి వాటికి కూడా ఋణాలపై ఆధారపడుతోందని కేంద్రమంత్రి తెలిపారు. రాష్ట్ర తలసరి అప్పు పెరుగుతోందన్నారు. 2014 లో మిగులు నిధులతో ఏర్పడిన రాష్ట్రానికి గత 10 సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో, గత 27 నెలల కాంగ్రెస్ పాలనలో తెలంగాణకు పట్టిన దుస్థితికి నేటి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అద్ధం పడుతోందని విమర్శించారు. మార్చి 16 నుంచి ప్రారంభమయ్యే రాష్ట్ర బ్జడెట్ సమావేశాలకు ముందుగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై పూర్తిస్థాయి శ్వేతపత్రం విడుదల చేయాలని లేఖలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

## వేసవి డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ప్రణాళిక

మొదటిపేజీ తరువాయి

కాలం నేపథ్యంలో విద్యుత్ వినియోగం గరిష్ఠంగా ఉంటుం దని... అందుకు తగిన అవసరాల కోసం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. తెలంగాణలో రికార్డు స్థాయిలో విద్యుత్ డిమాండ్ ఉంటుందన్నారు. అందుకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు. కోతలు లేకుండా.. ఎటువంటి అంతరా యం కలగకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యుత్ సంస్థలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అభినందనలు తెలిపారు. పెద్ద రాష్ట్రాలతో సమానంగా తెలంగాణ రికార్డు సృష్టించిందని వివరించారు. ఉదయం 8.00 గంటలకే నింగిలో భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. మధ్యాహ్నానికి సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. దీంతో ఇళ్లలోనే ప్రజలు ఉండి పోతున్నారు. ఏసీలు, ఫ్రిజ్‌లు ఆన్ చేసి.. ఉంచుతున్నారు. దాంతో విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోంది.

## మూసీ ఒడ్డున భారీ అక్రమ నిర్మాణం

మొదటిపేజీ తరువాయి

ఆరోపించారు. నది పరివాహక ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా ఈ వెంచర్ సాగుతోందని ఆమె మండిపడ్డారు. ఈ అక్రమ నిర్మాణాల వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ ప్రాజెక్టుపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు పేరుతో సామాన్యుల ఇళ్లను తొలగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఈ భారీ వెంచర్‌ను ఎందుకు చూడటంలేదని ఆమె నిలదీశారు. పేదల గూడు చెడగొట్టే హైడ్రా అధికారులకు ఈ అక్రమ నిర్మాణాలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. చట్టం అందరికీ సమానంగా వర్తించాలని, కేవలం పేదలపైనే ప్రతాపం చూపడం సరికాదని కవిత హితవు పలికారు. రియల్ ఎస్టేట్ మాఫియా అండతోనే ఇలాంటి భారీ అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఆమె విమర్శించారు. సామాన్యుల పక్షాన నిలబడి తమ పోరాటం కొనసాగిస్తామని ఈ సందర్భంగా కవిత స్పష్టం చేశారు. ప్రకృతి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆమె గుర్తు చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి దోషులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఇరాన్‌పై దాడి పట్ల మౌనమెందుకు

మొదటిపేజీ తరువాయి

సుమారు కోటిమంది భారతీయులతో సహా కోట్లాది మంది ప్రజలు అనిశ్చితిని ఎదుర్కొంటున్నారని అన్నారు. భద్రతాపరమైన ఆందోళనలు వాస్తవమే అయినప్పటికీ, సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించే దాడులు సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తాయి. ఇరాన్‌పై ఏకపక్ష దాడులు, అలాగే ఇతర మధ్యప్రాచ్య దేశాలపై ఇరాన్ దాడులను ఖండించాలి. ఘర్షణలు మరింత ఘర్షణలకు దారితీస్తాయి. చర్చలు మరియు సంయమనం శాంతికి ఏకైక మార్గం అని అన్నారు. భారతదేశం నైతికంగా స్పష్టంగా ఉండాలి. అంతర్జాతీయ చట్టం మరియు మానవుల ప్రాణాలను కాపాడుకోవడంలో మనం స్పష్టంగా మాట్లాడే ధైర్యం కలిగి ఉండాలి. మన విదేశాంగ విధానం సార్వభౌమాధికారం మరియు వివాదాల శాంతియుత పరిష్కారాన్ని సూచిస్తుంది. అది స్థిరంగా ఉండాలని అన్నారు. మధ్యప్రాచ్యం సంఘర్షణపై ప్రధాని మోడీ మాట్లాడాలని పునరుద్ఘాటించారు. ప్రపంచ క్రమాన్ని నిర్వచించే మార్గంగా ఒక దేశాధినేత హత్యను సమర్థిస్తారా అని ప్రధాని మోడీని నిలదీశారు.

## తెలంగాణ హైకోర్టుకు బాంబు బెదిరింపు

మొదటిపేజీ తరువాయి

దిగి ప్రతి మూలను జాగ్రత్తగా పరిశీ లిస్తున్నాయి. వారం రోజుల వ్యవధిలో రెండోసారి బాంబు బెదిరింపు రావడం గమనార్హం. ఇటీవల కూడా ఇలాంటి ఈ-మెయిల్ రావడంతో భద్రతా చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే. తెలంగాణ కోర్టులను లక్ష్యంగా చేసుకుని తమిళనాడు పేరుతో ఈ-మెయిల్ పంపినట్లు సమాచారం. ఈ -మెయిల్ మూలాన్ని గుర్తించేందుకు సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రస్తుతం హైకోర్టు ప్రాంగణంలో భద్రతను మరింత పెంచి, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచారు.

## మూడు వారాల్లోగా ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎన్నిక

మొదటిపేజీ తరువాయి

19వ కార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ ఆకుల యాదగిరి కనిపించకుండా పోయాడు. దీంతో తన తండ్రిని ప్రత్యర్థి పార్టీ నేతలు కిడ్నాప్ చేశారంటూ యాదగిరి కుమారుడు హైకోర్టులు హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు.ఈ పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక పక్రియపై స్టే విధించింది. మంగళవారం ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను మూడు వారాల్లోపు పూర్తి చేయాలని తుది తీర్పును వెలువరించింది .

# నేటినుండి ధర్మపురీశుల తెప్పోత్సవాలు

## కోనేటి నీటిపై నారసింహ, వేంకటేశ్వర ప్రదక్షిణలు

(రామ కిష్టయ్య సంగన భట్ల)



దక్షిణ కాశిగా, హరిహర క్షేత్రంగా, నవనారసింహ క్షేత్రాలలో నొకటిగా వాసికెక్కిన సాంప్రదాయాల సిరియైన ధర్మపురి క్షేత్రంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో అంతర్భాగంగా శ్రీ ఉగ్ర నారసింహ, శ్రీవేంకటేశ్వర స్వాముల తెప్పోత్సవ, డోలోత్సవాలు మార్చి 4,5వ తేదీలలో బుధ, గురు వారాలలో వరుసగా జరుగ నున్నాయి. ధర్మ పురి పట్టణ నడి బొడ్డున వెలసి విశేష పౌరాణిక, చారిత్రిక, ఐతి హాసిక ప్రాధాన్యతను కలిగిన, దక్షిణ భారతావని లోనే అతిపెద్దదిగా భావించబడే బ్రహ్మ పుష్కరిణి (కోనేరు )లో మూడు రోజులు పగలు మూడు గంటల నుండి రాత్రి తొమ్మిది వరకు నిర్వహించే కార్యక్రమాలలో స్వాముల ఉత్సవ మూర్తులను ప్రత్యేక ప్రత్యేక నిర్మిత బల్లకట్టుపై ఆశీనుల గావించి, కోనేటి నీటిపై ఐదు ప్రదక్షిణలు గావించడం అనా దీగా క్షేత్రంలో ఆచరిస్తున్న సత్సాంప్రదాయం. హిరణ్య కశిపుని సంహారానంతరం, ఉగ్రనారసింహుని శాంతింప జేసేందుకు బ్రహ్మాది దేవతలు తపో, యజ్ఞ ధ్యానాది సత్కర్మల నొనరించిన నేపథ్యంలో, బ్రహ్మ తన మంత్ర దండంతో ఈ క్షేత్రంలో భూమిన త్రవ్వి కుండమును నిర్మించి, అందలి జలమున స్నానమాడి, శ్రీనృసింహుని గురించి తపమొనరించి, అనుగ్రహం పొంది ఆ దేవదేవుని మందిరాన వసింపుమని వరం పొందడం జరిగిం దని, బ్రహ్మ దేవుడు స్నానమాచరించిన స్థలానికే "బ్రహ్మ పుష్కరిణి", యని పేరు వచ్చినదని పృథు మహారాజుకు నారదమునీం ద్రుడు వివరించి నట్లు నైమిశా రణ్యంలో శౌనకాది మహర్షులకు సూత పౌరాణికులు చెప్పినట్లు స్కంద, బ్రహ్మాండ పురాణ అంతర్గత క్షేత్ర మహాత్మ్యం ప్రాచీన గ్రంథాలు విశదీకరిస్తున్నాయి. సంతాన హీనుడైన లక్ష్మణుడను బోయరాజు, నారద మునీంద్రుని ద్వారా నారసింహ మంత్రో పదేశం గావింపబడి, ఆ మంత్ర జప బల ముచే పుత్ర ప్రాప్తి నొందెనని, అయితే లక్ష్మణునకు ధర్మపురి క్షేత్రంలో నిద్రించిన సమయంలో స్వప్నమందు శ్రీనృసింహుడు దర్శనమిచ్చి బ్రహ్మ పుష్కరిణికి నలు వైపులా సోపానాలు , మధ్య బాగాన వేదికను, శ్వేత వరాహ తీర్థం నుండి కోనేరు లోనికి జలము వచ్చు మార్గమును నిర్మింపుమని ఆజ్ఞాపించెను అని, భగవదా దేశానుసారం, ఆ ఎరుకల రాజు అన్నియూ నిర్మించి, అందులకై అయిన ఖర్చును రాసి పెట్టెనని, ఫలితంగా నృసింహుడు ఆగ్రహించి పుష్కరిణికి రానని ప్రకటించి, తిరిగి లక్ష్మణుని ప్రార్థన పై, ప్రతి సంవత్సరం పాలుణ శుక్ల పూర్ణిమనాడు, విహారార్థం సుముఖుడనై ఏతెంచ గలనని వరమిచ్చినట్లు పురాణాలు స్పష్ట పరుస్తున్నాయి. ఉదయగిరి సీమను ఏలిన రాయల దండులో కరీంనగరం మండలం లోనికి ప్రవేశించిన జూపల్లి సంతతిలోని వాడగు జూపల్లి ధర్మా రాయుడు , తన నాటికేయున్న బ్రహ్మపుష్కరిణి నలువైపులా సోపానాలను, మధ్యలో వేదికను నిర్మింప జేసెనని, తరువాత శాలివాహన శకం 1566 పార్థివ సంవత్సరంలో (క్రీ.శ.1645 ) చింతల నరుస బోయని కుమారుడగు తిరుమలయ పుష్కరిణి చుట్టూ ప్రాకారం మధ్య వేదికపై భోగ మండపం నిర్మింప జేసి దీపారాధనలతో, ఓడలోన మహోత్సవముతో శ్రీనృసింహుని కొలిచెనని పుష్కరిణిలోని శాసనం ద్వారా తెలుస్తున్నది. ఇంతటి పౌరాణిక, చారిత్రిక నేపథ్యం కలిగిన స్వామివారి కోనేరులో స్థానిక దైవాల తెప్పోత్సవ, డోలోత్సవాల నిర్వహణకై దేవసానం సకల ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నది. ఈఓ శ్రీనివాస్, జక్కు రవీందర్ నేతృత్వంలోని ధర్మ కర్తల మండలి సభ్యులు, సూపరింటెండెంట్ కిరణ్, సిబ్బంది విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

# తడిసి మోపెడు అవుతున్న యుద్ధం ఖర్చు

## - అమెరికా నెత్తిన భారీగా భారం పడడం ఖాయం - ఇప్పటికే 7వేల కోట్లు ఖర్చయినట్లు అంచనాలు

(ప్రజాలక్ష్యం బ్యూరో)

వాషింగ్టన్, మార్చి 3 : 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' మొదలైన తర్వాత తొలి 24 గంటల్లో అగ్రరాజ్యం దాదాపు 779 మిలియన్ డాలర్లను అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.7వేల కోట్లు ఖర్చు చేసినట్లు అంచనాలు వెలువడుతున్నాయి. ఇదికాకుండా.. దాడులకు ముందే పలు యుద్ధ విమానాలు, నౌకలు, సైనిక బలగాలను అమెరికా పశ్చిమాసియాలో మోహరించింది. ఇందుకోసం అదనంగా మరో 630 మిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ.5,700 కోట్లకు పైమాటే వెచ్చించి ఉండొచ్చని రక్షణరంగ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడులు చేపట్టాయి. ఇప్పటివరకు వందల సంఖ్యలో లక్ష్యాలపై దాడులు చేశామని, టెహ్రాన్‌కు చెందిన 11 నౌకలను ధ్వంసం చేశామని యూఎస్ మిలిటరీ వెల్లడించింది. గగనతల, భూతల, సముద్ర దాడుల కోసం దాదాపు 20కి పైగా ఆయుధ వ్యవస్థలను అమెరికా వినియోగిస్తోంది. అయితే, ప్రస్తుతం దాడులు కొనసాగుతున్నందున.. ఈ ఘర్షణలకు అమెరికా వెచ్చించే ఖర్చెంతో ఇప్పుడే అంచనాకు రావడం కష్టమే. ప్రస్తుతం అమెరికా-ఇజ్రాయెల్ దళాల వద్ద ఈ వ్యవస్థలు పరిమిత సంఖ్యలోనే ఉన్నాయి. అగ్రరాజ్యం కొన్నింటిని ఉక్రెయిన్‌కు పంపించింది. మరికొన్ని ఆసియా, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో మోహరించాయి. అందువల్ల ఆయుధ వ్యవస్థలను నష్టపోవడం ఆందోళనకరమే' అని అమెరికా మేథో సంస్థ స్టిమ్సన్ సెంటర్‌లో పనిచేసే సీనియర్ నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేశారు. కాగా.. 2023 అక్టోబరు 7న జరిగిన హమాస్ దాడి తర్వాత నుంచి ఇజ్రాయెల్‌కు అమెరికా 21.7 బిలియన్ డాలర్ల విలువైన సైనిక సాయాన్ని అందించినట్లు బ్రౌన్ యూనివర్సిటీ అధ్యయనం వెల్లడించింది. ఇది కాకుండా.. యెమెన్, ఇరాన్, పశ్చిమాసియాలో ఇజ్రాయెల్‌కు మద్దతుగా అమెరికా సాగిస్తోన్న ఆపరేషన్ల కోసం మరో 9.65 బిలియన్ డాలర్ల నుంచి 12.07 బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తోంది. ఇవన్నీ కలిపి చూస్తే.. రెండేళ్లకు పైగా పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వల్ల అమెరికాకు ఇప్పటివరకు అయిన ఖర్చు 31.35 బిలియన్ డాలర్ల నుంచి 33.77 బిలియన్ డాలర్ల అంటే దాదాపు రూ.3.1 లక్షల కోట్లకు పైమాటే. ఇప్పుడు ఇరాన్ ఘర్షణలు మరింతకాలం కొనసాగితే.. ఈ ఆర్థిక భారం మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. సెంటర్ ఫర్ న్యూ అమెరికన్ సెక్యూరిటీ గణాంకాల ప్రకారం.. యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డ్ వంటి యుద్ధ విమాన వాహకనౌకను నిర్వహించాలంటే రోజుకు 6.5 మిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ.59 కోట్లు చొప్పున ఖర్చవుతుందట.

అమెరికా-ఇరాన్ మధ్య సుదీర్ఘకాలంగా ఉన్న శత్రుత్వం గతవారం నుంచి మరింత ముదిరింది. ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై అగ్రరాజ్యం విరుచుకుపడటంతో పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు చెలరే గాయి. ఈ ఉద్రిక్తతలు నానాటికీ మరింత తీవ్రంగా మారుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇరాన్‌పై యుద్ధం నాలుగైదు వారాలు కొనసాగొచ్చు అని స్వయంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అంటే సుదీర్ఘ కాల ఘర్షణలకు వాషింగ్టన్ సిద్ధమవుతోందా? అలాగైతే ఈ యుద్ధం వల్ల అమెరికాపై పడే భారమెంత అన్న భయాలు కలుగుతున్నాయి. ఇవిగాక, యుద్ధంలో ధ్వంసమైన ఆయుధ పరికరాల నష్టం అదనపు భారమే. ఈ ఘర్షణల సమయంలో కువైట్‌లో అమెరికాకు చెందిన మూడు యుద్ధ విమానాలు కూలిపోయాయి. ఫ్రెండ్లీ ఫైర్‌లో భాగంగానే అవి కూలినట్లు అగ్రరాజ్యం చెబుతున్నా.. ఆర్థిక స్థిరత్వం, సాంకేతికతపరంగా ఇది ఆందోళనకర అంశమే. ఖర్చు పరంగా చూస్తే అమెరికాకు పెద్ద విషయం కాకపోవచ్చు. ఎందుకంటే అగ్రరాజ్య రక్షణ బ్జడెట్ ప్రస్తుతం ట్రిలియన్ డాలర్ల పైనే ఉంది. ఇప్పుడు దానిని 1.5 ట్రిలియన్ డాలర్ల వరకూ పెంచే అవకాశం ఉంది. కానీ, సమస్య ఏంటంటే ఘర్షణల్లో అమెరికా ఆయుధాలను కోల్పోవడమే. ఉద్రిక్తతలు నిరవధికంగా కొనసాగితే క్షిపణులను అడ్డుకునే వ్యవస్థలు పనిచేయడం కష్టం.

# జడ్చర్ల ప్రభుత్వాసుపత్రిలో దారుణ ఘటన

## ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమన్న మాజీమంత్రి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబ్‌నగర్, మార్చి 3 : జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన సంఘటన దారుణమని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. గతంలో ఎప్పుడూ చూడని విధంగా మార్చురీ గదిలో మృతదేహాన్న కుక్క పీక్కుతినడం వైద్య అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు.ఆసుపత్రిలో అడుగడుగునా నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని పేర్కొన్నారు. జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ,వంద పడకల ఆసుపత్రిని,నూతనంగా నిర్మించిన మార్చురీ బిల్డింగును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియా తో మాట్లాడారు. మార్చురీ గదిలో ఫ్రీజర్లు లేవని, మృతదేహాలను స్ట్రెచర్ పై కాకుండా నేలపై పెట్టడం దురదృష్టకరమని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రులను పట్టించు కోవడం లేదని వెల్లడించారు. కనీస సౌకర్యాలు కల్పించక హాస్పిటళ్లు దీనావస్థకు చేరుకుంటున్నాయని వివరించారు. వసతులు లేవు. మందులు లేవని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హాస్పిటళ్లను అన్ని రకాలుగా అభివృద్ధి చేశామని, కొత్త హాస్పిటల్స్ నిర్మించాం. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించామని వెల్లడించారు. పాత రోజులు తెస్తామని చెప్పి కాంగ్రెస్ పార్టీ నిజం చేసిందన్నారు. కొత్త హాస్పిటల్‌లో 2024 జూన్ లోనే మార్చురీ బిల్డింగ్ పూర్తి అయినా వాడుకోలేదని పేర్కొన్నారు. మార్చురీని ఎందుకు మార్చలేదని, పాత దాంట్లో ఫ్రీజర్,స్ట్రెచర్ ఎక్కడ పోయాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పాలన గాలికి వదిలేసిందని విమర్శించారు. ప్రభుత్వ తీరును ప్రజలు గమనిస్తున్నారని, జడ్చర్లలో స్థలాలు చాలా ఉన్నాయని పేర్కొన్నారు. సీఎం సొంత జిల్లా, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఇన్‌ఛార్జ్‌గా ఉన్న జిల్లాలో ఇంతటి దుస్థితి నెలకొనడం సిగ్గుచేటని ఆరోపించారు. ప్రజలు సమస్యను వివరిస్తే వారిపైనే ఎదురుదాడి చేస్తున్నారని మండిపడ్డారు.

# మృతదేహాన్ని పీక్కుతిన్న కుక్కలు

## ఘటనలో నలుగురు సిబ్బంది సస్పెన్షన్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబ్‌నగర్, మార్చి 3 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్న ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. దీనిపై మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఆందోళనలు చేపట్టడంతో రంగంలోకి దిగిన ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ జరిపింది. విచారణ అనంతరం బాధ్యులైన నలుగురిని వైద్యారోగ్య శాఖ కమిషనర్ సస్పెండ్ చేసింది. జడ్చర్ల మండలం నాగసాలకు చెందిన భీమేశ్ (32) ప్రమాదవశాత్తు చెరువులోపడి మృతిచెందాడు. రెండు రోజుల తర్వాత మృతదేహం లభ్యం కావడంతో పోలీసులు జడ్చర్ల ప్రభుత్వ దవాఖాన మార్చురీకి తరలించారు. ఈ విషయం తెలిసి బంధువులు కూడా అక్కడకు చేరుకున్నారు. ఈ క్రమంలో మార్చురీలో కుక్కల శబ్దం రావడంతో దగ్గరికి వెళ్లి చూసిన బంధువులకు ఓ కుక్క మృతదేహాన్ని పీక్కుతినడం కనిపించింది. కుటుంబీకులు ఈ ఘటనను వీడియో తీసి, సిబ్బంది నిర్లక్ష్యంపై మండిపడ్డారు. ఇంత ఘోరమైన పరిస్థితికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతదేహాలను భద్రపరచడానికి ఫ్రీజర్లు లేకపోవడం, సిబ్బంది పట్టించుకోకపోవడం వల్లే ఈ ఘటన జరిగినట్టు తెలుసింది. దవాఖాన వైద్యులు, సిబ్బంది వ్యవహారంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి.

# విరుచుకు పడుతున్న ఇరాన్

(ప్రజాలక్ష్యం బ్యూరో)

టెహ్రాన్, మార్చి 3 : పశ్చిమాసియాలో తాజా ఘర్షణలు నాలుగో రోజుకు చేరాయి. ఇజ్రాయెల్-అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధం కొనసాగుతోంది. బహ్రెయిన్‌లోని షేక్ ఇసా ప్రాంతంలోని అమెరికా ఎయిర్‌బేస్‌ను ధ్వంసం చేశామని మంగళవారం ఇరాన్ ప్రకటించుకుంది. డ్రోన్లు, క్షిపణులతో కమాండ్ సెంటర్, కేంద్ర కార్యాలయాన్ని దెబ్బతీశామని వెల్లడించింది. 20 డ్రోన్లు, మూడు క్షిపణులతో టా÷-గ్గం÷ట్లను ఢీకొట్టాం. దాంతో ఆ ప్రాంతంలో ఇంధనాన్ని నిల్వ చేసే ట్యాంకులకు మంటలు అంటుకొని ఆ ప్రాంతమంతా పొగ అలముకుందని ఇరాన్ వెల్లడించింది.

# ప్రాణం తీసిన స్పోర్ట్స్ బైక్ రైడ్ సరదా

## స్నేహితుడితో కలసి రైడ్ చేస్తుండగా ప్రమాదం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,మార్చి 3 : స్పోర్ట్స్ బైక్‌పై మోజు ఓ ఇంటర్ విద్యార్థి ప్రాణాలు తీసింది. నాగోల్ శివారులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వెళ్తున్న బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఇంటర్ పరీక్షలు రాస్తున్న ఇద్దరు స్నేహితుల సరదా బైక్ రైడ్ విషాదంగా ముగిసింది. స్పోర్ట్స్ బైక్‌పై వేగంగా వెళ్తూ ప్రమాదానికి గురయ్యారు. మృతుడు విష్ణువర్ధన్, గాయపడిన విద్యార్థి ఉషాకిరణ్ (16)గా గుర్తించారు. విద్యార్థులిద్దరూ కొత్తపేటలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నారు. సోమవారం మ్యాథ్స్ పరీక్ష రాసిన అనంతరం ఎన్జీవోస్ కాలనీ నుంచి కేటీఎం స్పోర్ట్స్ బైక్‌ను అద్దెకు తీసుకున్న ఉషాకిరణ్ (16).. దానిపై రైడింగ్ చేయగా, విష్ణువర్ధన్ వెనక కూర్చున్నట్లు తెలుస్తోంది. ఫొటో సెషన్ కోసం శివారులో రైడ్ చేస్తూ అతివేగంతో వెళ్తున్న సమయంలో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. విష్ణువర్ధన్ తలకు బలమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఉషాకిరణ్‌కు కాలు, చేయి విరిగినట్లు తెలుస్తోంది. నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫత్తుల్లా గూడ 100 ఫీట్ రోడ్డులో ఈ దుర్ఘటన జరిగింది. ఇదే సమయంలో వారి మరో స్నేహితుడు మణిదీప్ ఫోన్ చేయడంతో ప్రమాద విషయం వెలుగులోకి వచ్చింది. నాగోల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విష్ణువర్ధన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే గాయపడిన ఉషాకిరణ్‌ను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు.


# కుటుంబ కలహాలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భువనగిరి, మార్చి 3 : కుటుంబ కలహాలు మరో ఇంటిని చిదిమేశాయి. ఇద్దరు పిల్లల్ని చంపి, ఓ తల్లి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని గొల్లగూడెం గ్రామంలో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గొల్లగూడెం గ్రామానికి చెందిన మేకల మహేశ్ యాదవ్, ఐశ్వర్య దంపతుల మధ్య కొంతకాలంగా విభేదాలు కొనసాగుతున్నాయి. దీంతో తరచూ గొడవలు జరుగుతున్నాయి.

# ఖమేనీ హత్యపై మౌనమెందుకు ?

## - మోడీ తీరుపై మండిపడ్డ సోనియాగాంధీ



(ప్రజాలక్ష్యం బ్యూరో)

న్యూఢిల్లీ, మార్చి 3 : ఇరాన్ అధ్యక్షుడు అయాతుల్లా అలీ ఖమేనీ హత్యపై మోడీ ప్రభుత్వం మౌనం వహించడంపై కాంగ్రెస్ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ మౌనం వహించడం తటస్థంగా లేదని, బదులుగా ఇది పరాజయమని అన్నారు. భారత విదేశాంగ విధాన లక్ష్యము, విశ్వసనీయతపై సందేహం లేవనెత్తుతోందని అన్నారు. బ్జడెట్ సమావేశాల రెండవ భాగం కోసం పార్లమెంట్ తిరిగి సమావేశమైనపుడు, అంతర్జాతీయ వ్యవస్థ విచ్ఛిన్నంపై ప్రభుత్వ 'ఇబ్బందికరమైన నిశ్శబ్దం' గురించి బహిరంగంగా మరియు ఎగవేయకుండా చర్చించాలని అన్నారు. జాతీయ మీడియాలో ప్రచురితమైన తన వ్యాసంలో సోనియాగాంధీ మాట్లాడుతూ.. నైతిక బలాన్ని మనం తిరిగి కనుగొని దానిని స్పష్టత మరియు నిబద్ధతతో వ్యక్తీకరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇరాన్ అధ్యక్షుడు ఖమేనీని హత్య చేసపినట్లు అమెరికా మరియు ఇజ్రాయిల్ ధృవీకరించింది. అమెరికా, ఇరాన్ మధ్య కొనసాగుతున్న చర్చల సమయంలో దేశాధినేతను హత్య చేయడం సమకాలీన అంతర్జాతీయ సంబంధాల్లో తీవ్ర చీలికను సూచిస్తుందని అన్నారు. అయితే, ఈ ఘటన షాక్‌కు మించి, భారత ప్రభుత్వ మౌనం కూడా అంతే దిగ్భ్రాం÷-రతికి గురిచేసిందని అన్నారు. భారత ప్రభుత్వం హత్యను లేదా ఇరాన్ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించడాన్ని ఖండించడం మానుకుందని ఆమె పేర్కొన్నారు.

# క్షేమంగా ఇండియా చేరుకున్న పివి సింధు

## - బెంగళూరు ఎయిర్‌పోర్టులో దిగిన షట్లర్

(ప్రజాలక్ష్యం బ్యూరో)



బెంగళూరు, మార్చి 3 :పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో దుబాయ్‌లో చిక్కుకుపోయిన భారత స్టార్ షట్లర్ పీవీ సింధు ఎట్టకేలకు భారత్ చేరుకున్నారు. మంగళవారం ఆమె బెంగళూరు ఎయిర్‌పోర్టులో దిగారు. ఈ విషయాన్ని సింధు 'ఎక్స్'లో వెల్లడించారు. సురక్షితంగా బెంగళూరుకు చేరుకున్నా. గడిచిన కొన్ని రోజులు అత్యంత అనిశ్చిత పరిస్థితులు ఎదుర్కొన్నా. ఎట్టకేలకు ఇంటికి చేరుకోగలిగా. ఈ క్లిష్ట సమయంలో మమ్మల్ని సురక్షితంగా చూసుకోవడం కోసం దుబాయ్ అధికారులు, ఎయిర్‌పోర్టు సిబ్బంది, ఇమిగ్రేషన్ అధికారులు అందించిన సేవలను మాటల్లో చెప్పలేను. వారందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. ప్రస్తుతం విశ్రాంతి తీసుకోవాలనుకుంటున్నా. రీసెట్ అయ్యాక నా భవిష్యత్తు ప్రణాళికల గురించి ఆలోచిస్తా అని సింధు తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ కోసం గతవారం ఇంగ్లాండ్ బయల్దేరిన సింధు.. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ ఘర్షణల కారణంగా దుబాయ్ విమానాశ్రయంలో చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. ఉద్రిక్తతల నేపథ్యంలో గత శనివారం నుంచి విమాన సర్వీసులు రద్దు కావడంతో ఆమె ప్రయాణం ఆగిపోయింది. అప్పటినుంచి దుబాయ్‌లోనే సురక్షిత ప్రాంతంలో ఉండాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే యూఏఈ, భారత్ అధికారుల సమన్వయంతో అక్కడ చిక్కుకున్న భారతీయులను స్వదేశానికి తీసుకొచ్చే ఏర్పాట్లు చేశారు. దీంతో సింధు బెంగళూరుకు చేరుకున్నారు. ఇదిలాఉండగా.. ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ మంగళవారం ప్రారంభం కానుంది. ఈ టోర్నీలో సింధు పాల్గొనడంపై అనిశ్చితి నెలకొంది. ప్రస్తుత పరిణామాల్ని నిశితంగా గమనిస్తోన్న ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ).. ప్రయాణ ఆటంకాల కారణంగా క్రీడాకారులు ఆలస్యంగా వస్తే షెడ్యూల్‌లో మార్పులు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై అధికారిక ప్రకటనేదీ రాలేదు.

# అమెజాన్ డేటా సంటర్లపై డ్రోన్ దాడి

## - ధృవీకరించిన అమెజాన్ వెబ్ సర్వీసెస్

(ప్రజాలక్ష్యం బ్యూరో)

టెహ్రాన్, మార్చి 3 : అమెరికా-ఇజ్రాయెల్ సైనిక చర్యలకు ప్రతీకారంగా పశ్చిమాసియా పై ఇరాన్ దాడులు చేస్తోంది. ఈ క్రమంలో అక్కడి అమెజాన్ డేటా సెంటర్‌లపై డ్రోన్ దాడులు జరిగినట్లు వార్తలు వెలువడిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ దాడులు నిజమేనని అమెజాన్ వెబ్ సర్వీసెస్ ధ్రువీకరించింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లోని తమ రెండు డేటా సెంటర్లను డ్రోన్‌లు నేరుగా ఢీకొట్టాయని అమెజాన్ పేర్కొంది. దీంతో పశ్చిమాసియాలోని కొన్ని ప్రాంతాల్లో క్లౌడ్ సర్వీసుల్లో అంతరాయం కలిగినట్లు తెలిపింది. బహ్రెయిన్‌లోని డేటా సెంటర్ సమీపంలో జరిగిన దాడి వల్ల మౌలిక సదుపాయాలకు నష్టం వాటిల్లినట్లు వెల్లడించింది. ఈ దాడుల్లో ఉద్యోగులు ఎవరైనా గాయపడ్డారా? లేదా? అనే విషయం గురించి సంస్థ స్పష్టం చేయలేదు. సర్వీసుల పునరుద్ధరణకు తమ సిబ్బంది స్థానిక అధికారులతో కలిసి పనిచేస్తున్నట్లు చెప్పింది. సర్వీసుల్లో అంతరాయం కారణంగా ప్రభావితమైన వినియోగదారులు కీలకమైన డేటాను బ్యాకప్ చేసుకొని.. ఇతర ప్రాంతాల్లోని అమెజాన్ సర్వీసులకు మారాలని సూచించింది.

# పశ్చిమాసియా ఘర్షణలు

## ముగ్గురు భారత నావికుల మృతి

(ప్రజాలక్ష్యం బ్యూరో)

న్యూఢిల్లీ, మార్చి 3 : పశ్చిమాసియా ఘర్షణల్లో ఇప్పటివరకు భారతదేశానికి చెందిన ముగ్గురు నావికులు మృతి చెందినట్లు షిప్పింగ్ డైరెక్టర్ జనరల్ వెల్లడించింది. ఒమన్ తీర ప్రాంతాల్లో ఉన్న పలు వాణిజ్య నౌకలపై ఇరాన్ చేసిన దాడుల్లో ముగ్గురు భారతీయులు మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడినట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో షిప్ ఆపరేటర్లకు అడ్వైజరీ జారీ చేసింది. గల్ఫ్ ఆఫ్ ఒమన్, హోర్ముజ్ జలసంధి, పర్షియన్ గల్ఫ్‌లో పరిస్థితులను గమనిస్తున్నామని పేర్కొంది. ఆయా ప్రాంతాల్లో క్షిపణి, డ్రోన్ కార్యకలాపాలకు సమస్యలు ఉన్నట్లు గుర్తించామని తెలిపింది. షిప్ ఆపరేటర్ల భద్రతను కచ్చితంగా దృష్టిలోఉంచుకోవాలని.. అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే రిపోర్టు చేయాలని సూచించింది. తాజా నివేదికల ప్రకారం.. భారత జెండా ఉన్న నౌకలను బంధించినట్లు ఎటువంటి సమాచారం రాలేదని షిప్పింగ్ డైరెక్టర్ జనరల్ శ్యామ్ జగన్నాథన్ పేర్కొన్నారు. ఇప్పటివరకు రక్షించిన సిబ్బందిని స్వదేశానికి రప్పించడానికి ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం చర్యలు తీసుకుంటుందన్నారు. పశ్చిమాసియా లో ఉద్రిక్తతలు పెరుగుతున్నందున పర్షియన్ గల్ఫ్ సమీపంలో చిక్కుకొన్న భారతీయ నావికులకు తక్షణ సాయం అందించడానికి.. వారిని భారత్‌కు తరలించడానికి ప్రత్యేక ప్రతిస్పందన బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యుద్ధం వల్ల ప్రభావితులైన భారత నావికులతో ఈ బృందంలోని అధికారులు నిరంతరం సంప్రదింపులు జరుపుతారన్నారు. నావికుల కుటుంబాలు, షిప్పింగ్ కంపెనీలు, ట్రేడ్ యూనియన్లు, విదేశాలలో ఉన్న భారతీయ మిషన్లు, సంబంధిత పోర్ట్ అధికారులతోనూ ఈ బృందం సమన్వయం చేసుకుంటుందన్నారు.

Printed, Published and Owned by **KORUKANTI MANIDEEP PATEL,** Printed at SRI BALAJI PRINTING PRESS, H.No. 4-4-/85, Thilak Road, Karimnagar, Telangana - 505001 and Published at H.No.2-6-242, Ist Floor, Bus stand to Wesly Church Road, Mukarampura, Karimnagar, Karimnagar (Dist.), Telangana-505001, Editor: **GOLI SAMMI REDDY.** RNI.No.TELTEL/2010/35941. Cell: 9394322782, email: prajalakshyam@gmail.com